
# మిసిమి

చింతనాత్మక సారస్వతం




మాసపత్రిక మార్చి 2011 ₹ 20



ప్రేమసందేశం (కాపురాజయ్య)

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*

**సంపుటి 22　　మార్చి 2011　　సంచిక 3**



*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

అన్నపరెడ్డి బుద్ధఘోషుడు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

డాక్టర్ అబ్బూరి గోపాలకృష్ణ

డాక్టర్ జయధీర్ తిరుమల రావు

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

కుర్రా జితేంద్రబాబు

*సహాయ సంపాదకులు*

కాంగ్రేగుల నాగేశ్వర రావు

ముంగర జాషువ

*రెసిడెంట్ ఎడిటర్*

వల్లభనేని అశ్వినీకుమార్

*సంస్థాపక సంపాదకులు*

రవీంద్రనాథ్ ఆలపాటి



*Printed & Published by*

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

Visit us at : www.misimi-monthly.com

ప్రతి : ₹20　　సంవత్సరానికి : ₹200

విదేశాలకు ప్రతి : $ 2.50　　సంవత్సరానికి : $ 25

*మీ చందా **మిసిమి** పేర పై చిరునామాకు పంపండి.*

మరిన్ని వివరాలకు 64వ పుట చూడండి.


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు .................... 3

శ్రుత్యర్థ పర్యాలోచన (కొత్త సచ్చిదానందమూర్తి) .................... 5

*- వాడ్రేవు చినవీరభద్రుడు*

ఇంతింతై వటుడింతయై (పరిణతవాణి) .................... 10

*- జానమద్ది హనుమచ్ఛాస్త్రి*

మా నాన్నగారి సూట్‌కేస్ (నోబెల్ సాహితీపురస్కారం) .................... 15

*- ఒరాన్ పాము*

ఒక టిబెట్ అమ్మాయి - కలల కవిత్వం .................... 23

*- దిలావర్*

రసదృష్టి .................... 28

*- ఆచంట జానకిరామ్*

కారుణ్యమె ముద్దు (కవిత) .................... 31

*- బండి ప్రసాదరావు*

విశ్వవిజేత నెపోలియన్ .................... 32

*- ఎన్. ఆర్కే*

కవిత్వం నిరర్థకమా? (సరస్వతి సమ్మాన్) .................... 35

*- జగన్నాథ ప్రసాద్ దాస్*

శ్రీశైల ద్వారాలు .................... 41

*- బి.ఎస్.ఎల్. హనుమంతరావు*

ఆరోహణ - 2 .................... 47

*- ముక్తవరం పార్థసారథి*

కర్ణాటక సంగీతం .................... 53

*- ఆకెళ్ళ మల్లికార్జున శర్మ*

భారతీయ ముస్లింలు : ఒక పరిశీలన .................... 57

*- దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి*

చదవండి (పుస్తక పరిచయం) .................... 60

ప్రార్థన! (నవ్వులు) .................... 62


*ముఖచిత్రం* : నెపోలియన్ బొనాపార్టి (డేవిడ్)

*రెండవ అట్ట* : ప్రేమ సందేశం (కాపురాజయ్య)

*మూడవ అట్ట* : నాగస్వరం (కాపురాజయ్య)

*చివరి అట్ట* : నియోక్లాసికల్ చిత్రకారిణి ఏంజిలికా కాఫ్‌మన్ (స్వీయచిత్రం)

మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలనంతరం పాశ్చాత్యదేశ ప్రజల జీవన విధానంలో, ఆలోచనాధోరణిలో మౌలికమైన మార్పులు వచ్చాయి. ఈ జీవితం, ఈ ప్రపంచం శాశ్వతం కాదనే తాత్త్విక ధోరణితో పాటు అర్బన్ ఎలియనేషన్, అస్తిత్వవేదన, ఎక్సిస్టెన్షియలిజమ్ లాంటి ఆలోచనాసరళితో మిళితమైన తత్త్వసిద్ధాంతాలు వెలికి వచ్చినాయి. మరో ప్రక్క తాము కొత్తగా చెప్పగల సత్యమేదీలేదని ప్రాచీన తాత్త్వికులను అధ్యయనం చేస్తే సరిపోతుందనీ కనుగొన్నారు.

పై విషయాలు భారతీయ దర్శనాలకు భాష్య ప్రవచనాల సంప్రదాయంలోనే వున్నవి. కొత్త సచ్చిదానందమూర్తి తమ విస్తృత రచనలలో ఇదే విషయాన్ని, వేయి సంవత్సరాలుగా ఏ తాత్త్విక దర్శన ప్రతిపాదనలేకపోవటాన్ని – ప్రాచీన భారతీయ దర్శనాలను లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరాన్ని మరీ మరీ చెప్పారు. పద్మవిభూషణ్ గౌరవాన్ని పొందిన ఆయన స్మృతికి నివాళి సమర్పిస్తూ వాడ్రేవు చినవీరభద్రుడు సచ్చిదానందమూర్తి 'శ్రుత్యర్థ పర్యాలోచన' గ్రంథ ప్రాశస్త్యాన్ని విశ్లేషించారు.

తెలుగుభాషకు ఎనలేని సేవ చేసిన సి.పి. బ్రౌన్ పేర కడపలో గ్రంథాలయాన్ని – అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పి అభివృద్ధి చేసిన 85 సంవత్సరాల జానమద్ది హనుమచ్ఛాస్త్రి పరిణతవాణిని వినవచ్చు.

ప్రపంచంలోనే అరుదైన ప్రదేశం శ్రీశైల శిఖరం, దేవాలయ సముదాయాలు. అక్కడకు చేరే దారుల చరిత్రను వివరంగా అందిస్తున్నాం.

భారతీయ ముస్లింల జాతీయభావాలను, వారి నిబద్ధతను విశ్లేషించి – పరిశీలించిన వ్యాసం దేవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డిది.

అరుదైన టిబెట్ వేదనా కవిత్వాన్ని దిలావర్ చరిత్రతో విశదీకరించారు.

ప్రతి మార్చి నెలలో లండన్ హైడ్ పార్క్‌లో 'వాటర్‌లూ' యుద్ధాన్ని మళ్ళీ 'ఎనాక్ట్' చేస్తారు. దాని నాయకుడు – ప్రతినాయకుడు నెపోలియన్ బొనాపార్టి ముఖచిత్రంతోపాటు ఆయన జీవన రేఖలు కూడా...

మే 17వ తేదీ బుద్ధజయంతి. **మిసిమి** మే నెల సంచికలో బౌద్ధతత్త్వం, చరిత్ర, వ్యాపన సంబంధి రచనలను ప్రచురణకోసం ఆహ్వానిస్తున్నాము.

**– సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు




*పత్రిక రూపురేఖల మార్పు జరిగినప్పటినుంచీ మాకు ఎన్నో ఉత్తరాలు వస్తున్నాయి. అభినందించినవారు, అభిశంసించిన వారూ పత్రికమీద అభిమానంతోనే అని మాకు తెలుసు. ఈ అభిప్రాయాలను పాఠకులందరితో పంచుకోవాలనే ఈ పలుకరింపు. చేవగలిగిన ఉత్తరానికి* ***'అమూహ'*** *పుస్తకం బహుమతి.*

✶ "...సాహితీ వైవిధ్య రచనలతో వెలువరిస్తున్న 'మిసిమి'ని క్రమం తప్పకుండా చదివే వాళ్లల్లో నేనొకణ్ణి. 2010 అక్టోబర్ సంచిక యందు 'ఊరువాడబతుకు' గ్రంథ సమీక్ష గతి తప్పింది. అప్రస్తుత లేఖనాలు, ఆకాశఖేలనాలు అధికం. 'సమీక్ష' పద్ధతి ఏ మాత్రం లేదు. సమీక్షకుడే దీన్ని నవల అన్నాడు. తరువాత కాదన్నాడు, తాను ఏమి చెప్పదలచిందీ అయోమయం, సందర్భం కాకున్నా భాసుడు 'మృచ్ఛకటికం' వ్రాసినాడని గొప్ప విషయం తెల్పినారు. ఈయనయే గోందు భారతం పీఠికలో వాల్మీకి మహాభారతం రచించినట్లు తెల్పి ఆశ్చర్యానికి గురి చేసినారు. 'మృచ్ఛకటిక' శూద్రక మహాకవి రచనయని ఏ కొద్దిపాటి సాహిత్య పరిచయం గల వ్యక్తియైనా చెప్పగలడు, అట్లే మహాభారత రచన. మీ పత్రికలో ఈ విధమైన క్షమార్హంకాని దోషాలను అధిక ప్రసంగాలను చేర్చవద్దని కోరుతున్నాను...

...జనవరి పత్రిక అందమైన, విలువైన అట్ట బొమ్మలతో ఆకర్షణీయంగా రాణిస్తున్నది. 'మూడు భాషల మూలం' (కాళోజి), 'బెంగుళూరు నాగరత్నమ్మ', 'రుద్రగణిక' వ్యాసాలు వినూత్న విషయాలావిష్కారాలనటంలో సందేహం లేదు; ...ప్రతి నెలా రెండు పుస్తకాలనైనా 'సమీక్ష' చేయించండి..." **– డా. రంగాచార్య,** హైదరాబాదు.

✶ "...'మిసిమి' డిసెంబరు సంచికలో ఉత్తరాలు (కమ్మతెమ్మెరలు) శీర్షిక ప్రారంభించటం బాగుంది. పుస్తక పరిచయం సంక్షిప్తంగా ఉండటంవల్ల చాలా పుస్తకాలకు అవకాశం లభించింది. వోలేటి పార్వతీశం కవిత ఏవో జ్ఞాపకాలను తెచ్చింది. కీ.శే. శశాంక ఎం.ఏ. (తెలుగు) చదువుతూ నాతోపాటు ఉస్మానియా హాస్టలులో ఉండటంవల్ల మామధ్య గాఢమైన స్నేహం ఏర్పడింది. అంత తొందరగా ఆయన వెళ్లిపోతారనుకోలేదు..." **– డా. ఎస్వీ రామారావు,** హైదరాబాదు.

✶ "...సాహిత్య సుగంధాలతో పద్య పరిమళాలతో, విశేష వ్యాసాలతో అందంగా, అపురూపంగా అరుదెంచే 'మిసిమి' పసిడి కాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ..." **– పున్న అంజయ్య,** నల్లగొండ.

✶ "... 'మిసిమి'లో రచనలన్నీ బాగుంటున్నాయి. ముఖ పత్రాలన్నీ చాలా అందంగా ఉంటున్నాయి. మునిమాణిక్యం, మల్లాది, పానుగంటి లాంటి బిట్స్ చాలా బాగుంటున్నాయి. అంతకుముందు మిస్ అయినవి కూడా గుర్తు చేసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి..." **– జి. లక్ష్మి**

✶ "...డిసెంబరు 2010 'మిసిమి' చదువుతూ 18వ పేజీ మధ్యలో ఆగిపోయాను. 'పాలేరుగ పుట్టితి...'' అన్న పద్యముద్రణ దోషం కొట్టొచ్చినట్లు కన్పించింది.

**కం॥ "పాలేరుగ పుట్టితి, 'మా / మా'లకు ఋషి వారసత్వ మందించితి, నే**
**శ్రీలలితను సేవించితి, / పాలించితి వాక్య జగము పద్మశ్రీనై"**

'మా మా'లకు అంటే, మాదిగల్ని, మాలల్ని ఇద్దర్నీ కలుపుదామని, అని సవరణ ప్రత్యేక పేజీలో వచ్చే పత్రికలో ముద్రిస్తే, కత్తిరించి, దీనిపై అతికించు కొంటాము. కాక యిలాగే, 'మిసిమి', మిసిమి కోల్పోతుందని నా భావన..."
**– డా. ఐ.ఎస్. ప్రసాద్,** హైదరాబాద్.

✶ "...జనవరి 2011 'మిసిమి'ని రంగులవల్లిగా రూపొందించినందుకు అభినందనలు. శీలా వీర్రాజు వర్ణచిత్రాలు సంవత్సర శుభారంభానికి సొగసునద్దాయి. వర్ణచిత్రాలు (కళా చిత్రాలు) రెండు రకాలు. ఒకటి నాగరికతకు, రెండవది లౌకికం. మొదటి కోవకు చెందిన వీర్రాజు కళాత్మక చిత్రాలు తెలుగింటి ఆడపడుచుల నాగరికతా వైభవాన్ని గుర్తుకు తెస్తున్నాయి. గ్రామీణులు భోగిమంట వద్ద గుమిగూడటం, చుట్టపీకడం ఎంతో సహజంగ వుంది.

**– ఒక పాఠకుడు,** హైదరాబాద్.

✶ "...శీలా వీర్రాజుగారు ప్రత్యేకంగా వేసిన వర్ణచిత్రంతో 'మిసిమి' జనవరి 2011 సంచిక అందింది. రచనలన్నీ ఆమూలాగ్రం చదివాను. చిత్రకళకూ, పరిశోధనాత్మక వ్యాసాలకు, కవితలకూ స్థానం కల్పిస్తూ ఒకనాటి 'భారతి'ని తలపిస్తున్నది" ఇరవై రెండేళ్ల 'మిసిమి' – నూరేళ్ల దిశగా సాగాలని శుభాకాంక్షిస్తున్నాను..."

**– డా. మానేపల్లి,** యలమంచిలి (విశాఖ జిల్లా).

✶ "...ఒకప్పుడు 'భారతి'కి వ్రాయడం, అందులో ప్రచురింపబడడం గొప్ప గౌరవంగా భావించుకునేవారు సృజనశీలురు. ప్రస్తుతం ఆ స్థానం 'మిసిమి'ది. సంవత్సరాలుగా 'మిసిమి'కి అనువాదకునిగా, రచయితగా ఉండడం నా అదృష్టంగా భావిస్తాను. నేను 'మిసిమి'కి అభిమాన పాఠకుణ్ణి కూడాను. వెంకటేశ్వరరెడ్డిగారు తమదైన పద్ధతిలో 'మిసిమి'ని నడిపించారు. ప్రస్తుతం గెటప్‌లోను, రచనల విషయంలోను మీరు చేసిన మార్పులు, చేర్పులు చాలా బాగున్నాయి. ఇంత కాలం నించి విస్తృతంగా చదువుకుంటున్నా, ఇప్పటి దాకా నాకు తెలియని ఎన్నో గొప్ప విషయాలను తెలుసుకోగలుగుతున్నందుకు ఆనందంగా వుంది. మహావాగ్గేయ కారుడు – త్యాగయ్య గురించిన విషయాలు, నటరాజ రామకృష్ణగారి అనుభవ పూర్ణమైన అక్షరాలు – అలాంటి రచనలు కంటతడిపెట్టిస్తాయి. చదవకుండా బ్రతకలేని నాలాంటి వాళ్ళకి 'మిసిమి' ఆత్మీయం. సాహితీ స్వర్గద్వారాలు తెరిచే 'మిసిమి' సాభిమానంగా నమస్కరిస్తూ..."

**– డా. బి.వి. రామిరెడ్డి,** రుద్రవరం.

✶ "...'మిసిమి' ప్రతి పత్రిక ఒక వజ్రం.. డిసెంబరు సంచిక ముఖచిత్రం మరియు ఇతర చిత్రాలు మరియు ప్రతి రచనలు మందరగిరితో సముద్రాన్ని చిలికి అమృతాన్ని తెచ్చినట్లు ఎంతకాలంగానో గ్రంథాలయాల్లోనో ఎక్కడో దాగిన సాహిత్యాన్ని వెలికితీసి మాకు అందిస్తున్నందుకు ధన్యవాదములు. ప్రతి రచన గురించి వ్రాయాలంటే సంతోషాన్ని మాటలలో చెప్పలేని దాన్ని. ***వెన్నెల నీడలో*** వోలేటి పార్వతీశం గారి రచన చదువుతుంటే ప్రతివారి బాల్యస్మృతులు తమలో తామే మాకోసమే అన్నట్లుంది..."

**– ఎస్. పైడితల్లి,** కాకినాడ.

✶ "...జనవరి నెల 'మిసిమి' మాసపత్రిక చాలా బాగుంది. ప్రస్తుత – వాస్తవ పరిస్థితులలో సజీవంగా, సాహిత్యాన్ని గురించి, వెలుపల గురించి ప్రాచీన ఆధునాతన, ఆయా రచయితలు, రచనలు, పరిచయాలు, చాలా బాగుంది. చింతనాత్మక సారస్వతం అంటే, ఆలోచనా మాదిరి సర్వస్వం అని నా భావన..."

**– పసుమర్తి మురళీకృష్ణ.**

✶ "...అందమయిన 'మిసిమి' అందుతున్నది. ముఖ్యంగా ముఖచిత్రాలు అపూర్వం. శీలా వీర్రాజు 'సంక్రాంతి' పూర్వజన్మ జ్ఞాపకంలా, మదిలో వెంటాడే 'భోగిమంటలు', 'కనుమరుగవుతున్న దృశ్యాలు,' 'ఒప్పుల కుప్ప' ఇవన్నీ విధ్వంసమైన గ్రామీణ సంస్కృతికి ఆనవాళ్ళు.

అలాగే ఫిబ్రవరి సంచిక 'అన్నం వండాలి' రాజన్‌బాబు చిత్రం ఒక అపూర్వ జీవన దృశ్యం!

ఒక అద్భుత కవితనో, కథానికనో, కథాశకలాన్నో మదిలో నింపుతున్న అనుభూతి! 'మిసిమి'కి ధన్యవాదాలు.."

**– కాద్రగడ్డ దయానంద్,** గుంటూరు.

✶ "...మీరు ప్రచురిస్తున్న 'నవ్వుల' తీరు హాయిగా ఉంది. మునిమాణిక్యం, కాళ్ళకూరి, పానుగంటి వారు ఎంతటి హాస్యప్రియులో తెలుస్తున్నది. హాస్యం ఆరోగ్యకరంగా ఉండాలి. వెకిలిగా తయారవ్వడం ఇప్పటి సినిమాల ప్రభావం దురృష్టకరం..."

**– రవిచంద్ర,** హైదరాబాద్.



# శ్రుత్యర్థ పర్యాలోచన

- వాడ్రేవు చినవీరభద్రుడు

ప్రపంచమెరిగిన తత్త్వవేత్త, ఆచార్యుడు, గుంటూరుజిల్లా సంగం జాగర్లమూడిలో జన్మించిన కొత్త సచ్చిదానందమూర్తి దార్శనికునిగా విశ్వవిద్యాలయ ఉపకులపతిగా, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఉపాధ్యక్షులుగా దేశానికి సేవలందించారు. వీరి మహత్తర రచన 'రీజన్ అండ్ రేషనాలిటీ ఇన్ ది అద్వైత వేదాంత' గ్రంథమే కాక మరో యాభై గ్రంథాలు రచించారు. వీరిని భారత ప్రభుత్వం 'పద్మవిభూషణ్'తో గౌరవించింది. ప్రపంచమంతా విస్తృతంగా పర్యటించిన సచ్చిదానందమూర్తి తన చివరి సంవత్సరాలలో స్వగ్రామంలో ప్రశాంతంగా గడుపుతూ 87వ యేట జనవరి 25, 2011న తనువు చాలించారు.

ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి అనగానే నాకు ఆయన రాసిన 'వేదిక్ హెర్మన్యూటిక్స్' (1993) గుర్తొస్తుంది. వేదవాఙ్మయం గురించి నేను చదివిన గొప్ప పుస్తకాల్లో దాన్నికూడా చేర్చవచ్చు. ఏ.బి.కీత్, హిల్లెబ్రాంట్, మాక్స్‌ముల్లర్, ఓల్డెన్‌బర్గ్, మాక్డొనాల్ వంటి పాశ్చాత్య విద్వాంసులే కాక, ఆచార్య రాధాకృష్ణన్, దాస్‌గుప్తా, కున్హన్ రాజా వంటి ఆధునిక భారతీయ విద్వాంసుల రచనలు వేదవాఙ్మయాన్ని అర్థం చేసుకోవడానికి నాకు దారి చూపించాయి. అయితే వాటన్నిటికన్నా సచ్చిదానందమూర్తి రచన నాకు మరింత స్పష్టతను కలిగించింది.

'హెర్మన్యూటిక్స్' అనేది ముఖ్యంగా పోస్ట్‌మాడ్రన్ యుగానికి చెందిన తాత్త్వికపద్ధతి. ఇరవయ్యవశతాబ్దపు మధ్యకాలంనుంచీ పాశ్చాత్యతాత్త్వికులు, ముఖ్యంగా ఐరోపియా తాత్త్వికులు తత్త్వశాస్త్రంలో తాము కొత్తగా కనుక్కొనే సత్యమేదీ లేదనీ, తాము ప్రాచీన తాత్త్వికుల రచనలను సరిగా చదివితే సరిపోతుందనీ భావించారు. అందువల్ల ప్లేటో, అరిస్టాటిల్, ప్రీ-సోక్రటిక్ తత్త్వవేత్తల రచనలను మరలా వారు పునరధ్యయనం చేసి వాటికి భాష్యాలు రచించడం మొదలుపెట్టారు. ఇటువంటి భాష్యసంప్రదాయం భారతీయదర్శనాలకు కొత్తకాదు. ఆ మాటకొస్తే గత వెయ్యి పదిహేను వందల ఏళ్లుగా భారతీయ ఆచార్యులెవరూ తాము కొత్తగా ఏ దర్శనాన్ని ప్రతిపాదిస్తున్నట్టుగా చెప్పలేదు. వారు ప్రాచీన వైదిక, బౌద్ధ, జైన దర్శనాలకు భాష్యాలూ, వ్యాఖ్యానాలు రాస్తూ మాత్రమే వచ్చారు. అయితే ఈ ప్రాచీన భాష్యసంప్రదాయానికీ, ఆధునిక హెర్మన్యూటిక్స్‌కీ మధ్య ఒక తేడా ఉంది. భాష్యాల్లో భాష్యకారుడు ఏదో ఒక సంప్రదాయానికి అంటిపెట్టుకుని తన భాష్యం రాయడముంటుంది. కానీ హెర్మన్యూటిక్స్ పూర్తి తాటస్థ్యాన్ని చూపించడానికి ప్రయత్నిస్తుంది. అంటే అత్యంత నిష్పాక్షికంగా, ఎటువంటి లోగోసెంట్రిజమ్‌కి లోనుకాకుండా ప్రాచీన రచనలను అర్థం చేసుకునే ప్రయత్నమది. సచ్చిదానందమూర్తి ఈ హెర్మన్యూటిక్స్ సంప్రదాయంలో వేద సందేశాన్నీ, వేద సారాంశాన్నీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు. అందువల్ల ఆ రచన ఈనాటి భారతదేశానికి అత్యంత అవసరమైన రచనగా నాకు గోచరించింది.

తన రచనకు సచ్చిదానందమూర్తి 'శ్రుత్యర్థ పర్యాలోచన' అనే పేరు కూడా పెట్టారు. ఈ పదబంధం ఆయనది కాదు. దీన్ని ఆయన భగవద్రామానుజులు రచించిన 'వేదార్థసంగ్రహం' నుంచి తెచ్చుకున్నారు. వేదార్థసంగ్రహం భగవద్రామానుజులు శ్రీ వేంకటేశ్వరస్వామి ముందు చేసిన ప్రసంగం.

వాడ్రేవు చినవీరభద్రుడు, ఫోన్ : 9490957129

ఆ విధంగా సచ్చిదానందమూర్తి తన పుస్తకశీర్షికలో కూడా ఒక సాంప్రదాయిక అవిచ్ఛిన్నతను చూపించటానికి ప్రయత్నించారు.

పుస్తకానికి రాసిన ముందుమాటలో ఆయన 'నేను వేదవ్రతస్నాతుడను (అంటే వేదాధ్యయణదీక్షను స్వీకరించి పూర్తిచేసిన వాడు) కాను. లేదా వేదపారగుణ్ణి (అంటే వేదాలగురించి క్షుణ్ణంగా తెలిసినవాడు) కాను. ఆ మాటకొస్తే, పాశ్చాత్య భాషల్లో, లేదా ఆధునిక భారతీయ భాషల్లో వేదాల గురించి రాసినవాళ్ళల్లో వాటిని అనువదించిన వాళ్ళల్లో ఎంతమంది నిజంగా వేదవ్రతస్నాతులో, వేదపారంగులో నాకు తెలియదు. నేను చాలాకాలంగా శ్రుతిభగవతీ ఉపాసన చేయటానికి ప్రయత్నిస్తున్నవాణ్ణి మాత్రమే, అని చెప్పుకున్నారాయన. 30ల మధ్య నుంచే ఆయన భగవద్గీత అధ్యయనం మొదలుపెట్టాననీ, అయితే దానిలో తాను చేసిన సాధన తనకింకా తృప్తి కలిగించలేదనీ, బహుశా అది జీవితకాల సాధనగా కొనసాగుతుందనీ కూడా రాసుకున్నారు. ఆ తరువాత ఆయన ఈశోపనిషత్ అధ్యయనం మొదలుపెట్టాననీ, ఆ తరువాత 40లు మొదలుకొని ఓ పదేళ్లపాటు 'శ్రుతిప్రామాణ్యవిచారం'లోనే మునిగి తేలానని కూడా చెప్పారు. అయితే వేదార్థచింతనలో తన కృషి తనకు తృప్తినివ్వనందువల్ల దాన్ని కూడా జీవితకాల సాధనగా కొనసాగించానని చెప్పారు. ఆ తరువాత ఆయన శ్రీ వేంకటేశ్వరవిశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్లర్‌గా, యూనివర్సిటి గ్రాంట్స్ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా పనిచేసిన కాలంలో ఎందరో వేదపండితుల్నీ, వేదవిద్వాంసుల్నీ, మీమాంసకుల్నీ కలుసుకోవడం జరిగిందనీ, వారందరితో చేసిన చర్చలవల్లా, గోష్టి వల్లా తనకు కలిగిన అవగాహన తననీ పుస్తకరచనకు ప్రేరేపించిందని ఆయన రాసుకున్నారు.

> ఆయన ప్రధానంగా వేదజిజ్ఞాసులులకి దారిచూపించే కరదీపికగా మాత్రమే ఈ పుస్తకాన్ని భావించారనిపిస్తోంది. ఎన్నో కడవల పాలనుంచి పేరిన నెయ్యిలాగా, ఎన్నో పూల మకరందం నుంచి ఏరితెచ్చిన తేనెలాగా ఈ పుస్తకం ఒక జీవితకాల అధ్యయన, సత్సంగసారాంశంగా దర్శనమిస్తోంది.

వేదిక్ హెర్మన్యూటిక్స్‌లో ముందుమాటలూ, వివరణలూ పోగా మొత్తం రచనంతా కూడా 70 పేజీలకు మించిలేదు. ఒకరకంగా దీన్ని వ్యాసంగా కూడా పేర్కొనవచ్చు. కానీ ఇటువంటి క్లుప్తతలోనే ఆయన నిరుపమానమైన స్పష్టతను సాధించే ప్రయత్నం చేశారు. ఇందులో ప్రతివాక్యం సూత్రప్రాయంగా సూత్రసంప్రదాయంలో రాసినట్టుగా అనిపిస్తుంది. కొన్ని కొన్ని సూత్రీకరణల్ని ఎంతో విస్తరించి చెప్పే అవకాశముంది కానీ ఆయన ప్రధానంగా వేదజిజ్ఞాసులులకి దారిచూపించే కరదీపికగా మాత్రమే ఈ పుస్తకాన్ని భావించారనిపిస్తోంది. ఎన్నో కడవల పాలనుంచి పేరిన నెయ్యిలాగా, ఎన్నో పూల మకరందం నుంచి ఏరితెచ్చిన తేనెలాగా ఈ పుస్తకం ఒక జీవితకాల అధ్యయన, సత్సంగసారాంశంగా దర్శనమిస్తోంది.


**మూడు అధ్యాయాలు**

ఈ పుస్తకంలో మూడు అధ్యాయాలున్నాయి. మొదటి అధ్యాయం వేదవాఙ్మయాన్ని అధ్యయనం చేయడానికి అనుసరించవలసిన సక్రమవైఖరి గురించిన ఆలోచన. రెండవ అధ్యాయంలో వేదవాఙ్మయంలోని విషయం గురించిన పరిశీలన. మూడవఅధ్యాయం వేదవాఙ్మయంలోని వస్తుపరమైన, సారాంశపరమైన ఏకత్వం గురించిన ఆలోచన. మూడు అధ్యాయాలకూ ఎక్కడికక్కడే సవివరమైన వివరణలూ, మూలగ్రంథాల సూచనలూ ఉన్నాయి.

**వేదవాఙ్మయం గురించిన సక్రమ వైఖరి:** వేదవాఙ్మయాన్ని పరిశీలించడానికి మనం ఎటువంటి వైఖరి అవలంబించాలి అనే అధ్యాయంలో తిరిగి మరలా నాలుగు భాగాలున్నాయి. మొదటిభాగంలో వేదస్వభావం, వేదవిషయం గురించి చర్చ ఉంది. ఇందులో ఆయన వేదమంటే ఏమిటనే ప్రశ్నతో మొదలుపెట్టారు. కాత్యాయనుడు, తదితరులు వేదమంటే మంత్ర, బ్రాహ్మణాలు రెండు అన్నారనీ, యాస్కుడు, పాణిని కేవలం మంత్రాలు మాత్రమే వేదమన్నారనీ, సాయణుడు వేదమంటే మంత్రబ్రాహ్మణ శబ్దరాశి అన్నాడనీ దాదాపుగా మీమాంసకులు, వేదాంతులూ కూడా ఆ నిర్వచనాన్నే అంగీకరించారనీ చెప్పారు. అయితే ఆయన ఇక్కడ ఓ ముఖ్యవిషయం చెప్పారు. అదేమిటంటే, పాశ్చాత్య తత్త్వశాస్త్రం మనకు సత్యసాక్షాత్కారం అనుభవం ద్వారా, లేదా ఆలోచన ద్వారా సిద్ధిస్తుందని చెప్పింది. కానీ వేదాలు అనుభవం ద్వారా తెలిసే సత్యం గురించి మాట్లాడలేదనీ, అవి అనుభవం ద్వారా తెలుసుకోలేని సత్యంగురించి మాత్రమే మాట్లాడాయనీ ఆయన

అన్నారు. ముఖ్యంగా శాస్త్రవాక్యం ‘అజ్ఞాతజ్ఞాపన’మనీ, అది చెప్పే సత్యం మానవానుభవానికీ, సైన్సుకీ విరుద్ధంగా కనిపించనంతవరకూ మాత్రమే ప్రామాణికమనీ అన్నారాయన.

ఈ అధ్యాయంలో రెండవభాగంలో వేదార్థాన్ని తెలుసుకోవలసిన అవసరం గురించి మాట్లాడారు. ఇందులో వేదార్థం తెలుసుకోకుండా వేదపాఠాలు వల్లెవేయటాన్ని ఋగ్వేదమే నిరసించిందని ఆయన 1.164.39, 10.71.4 సూక్తాలను ఎత్తిచూపారు. వేదార్థం తెలుసుకోకుండా దాన్ని కంఠతా పట్టినవాడు బరువుమోసే ఇనుపస్తంభం లాంటివాడు మాత్రమేనని ‘నిరుక్తం’ (1.18) అన్నమాట కూడా ప్రస్తావించారు. వేదార్థజ్ఞానం లేకుండా అర్పించిన హవిస్సుల్ని దేవతలు స్వీకరించరని శౌనకుడు ‘బృహద్దేవత’ (7.130, 132) లో పేర్కొన్నాడని కూడా చెప్పారు. ఈ రోజు పిల్లలకి వేదాన్ని బోధించే వేదపాఠశాలల్లో వివిధ రకాల వేదార్థభాష్యాలు గురించిన పరిచయం కూడా కలిగించడం మంచిదని ఆయన సూచించారు.




అధ్యాయం మూడవభాగంలో ఆయన వేదాలకున్నటువంటి వివిధరకాల వ్యాఖ్యానాల గురించి చెప్పారు. ఇది చాలా విలువైన భాగం. వేదాలకు ముఖ్యంగా మూడు రకాల వ్యాఖ్యానాలున్నాయన్నది అందరికీ తెలిసిందే. మొదటిది అధిదైవిక పద్ధతి. రెండవది అధియాజ్ఞిక పద్ధతి. మూడవది అధిఆత్మిక పద్ధతి. సాధారణంగా అందరూ భావించేది వేదాల్లోని సంహితభాగం అధిదైవికమని, బ్రాహ్మణాలూ, ఆరణ్యకాలూ అధియాజ్ఞికాలనీ, ఉపనిషత్తులు ఆధ్యాత్మికాలని. అయితే పాశ్చాత్య వేదవిద్వాంసులు 18-19 శతాబ్దాల్లో వేదాధ్యయనం మొదలుపెట్టినప్పుడు ప్రధానంగా సాయణభాష్యం మీదనే ఎక్కువగా ఆధారపడ్డారు. సాయణుడు 14వ శతాబ్దానికి చెందిన సంగమయుగానికి చెందిన విద్వాంసుడు. ఆ రోజుల్లో తిరిగి వైదికమత పునరుద్ధరణ కోసం విజయనగరసామ్రాజ్యం కృషిచేస్తూ ఉంది. ఆ కాలంలో వేదాలకు యాజ్ఞికపరమైన అర్థం చెప్పే అవసరం ఎక్కువగా ఉన్నందువల్ల సాయణభాష్యం ప్రధానంగా యాజ్ఞికవ్యాఖ్యానం. అయితే పాశ్చాత్య వేదవిద్వాంసులు సాయణుడిమీదనే ఎక్కువ ఆధారపడ్డందువల్ల వారు వేదాలను ఒక క్రతుదృక్పథంలో మాత్రమే చూడగలిగారనీ, ఇంగ్లీషులో వేదాల అనువాదాలు, వ్యాఖ్యానాలు చదవటంతో వేదాధ్యయనం మొదలుపెట్టిన మనలాంటివాళ్లమంతా అదే దృక్పథానికి లోనవుతున్నామనీ సచ్చిదానందమూర్తి అంటున్నారు. అలాకాక, వేదాలను అర్థంచేసుకోవటానికి ఈ దేశంలో పురాతనకాలంనుంచీ ఒక ప్రయత్నం అవిచ్ఛిన్నంగా కొనసాగుతూవస్తోందని, అది యాస్కుడి నిరుక్తం, శౌనకుడి బృహద్దేవత వంటి వాటితో మొదలై స్వామి దయానంద సరస్వతి, అరవిందుల దాకా కొనసాగుతూ ఉందని అన్నారాయన. ఈ సంప్రదాయంలో కూడా మూడు శాఖలున్నాయి. ఒకటి, నైరుక్తికపద్ధతి. అంటే వేదశబ్ద విచారం మీదా, భాష మీదా, భాషామూలాల్ని అన్వేషించడం మీదా ఆధారపడ్డది. యాస్కుడినుంచి అరవిందుల దాకా ఇదొక శాఖ. మరొకటి ఐతిహాసక పద్ధతి. మూడవది యాజ్ఞికపద్ధతి. వేదార్థాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాసువులు కేవలం సాయణభాష్యం మీద మాత్రమే ఆధారపడకుండా వెంకటమాధవ, దయానంద, అరవిందులు, కపాలిశాస్త్రి వంటి వారి వ్యాఖ్యానాల్ని కూడా చదవాలని, ఇతిహాసాలు, పురాణాలు, పూర్వ ఉత్తర మీమాంసలు వేదాన్ని ఎలా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాయో తెలుసుకోవాలని కూడా మూర్తి అన్నారు.

అధ్యాయంలోని నాల్గవ భాగంలో ఆయన వేదాధ్యయనానికి కావలసిన అర్హత గురించి చర్చించారు. వేదాలు కేవలం ఒక వర్ణానికో, ఒక కులానికో మాత్రమే సంబంధించినవనే భావనకి వేదాల్లో ఎక్కడా ఆధారం లేదనీ, అది కేవలం తదనంతర యుగాల మూఢవిశ్వాసం మాత్రమేననీ ఆయన సోదాహరణంగా పేర్కొన్నారు. ఆర్యులపట్లగానీ దస్యులపట్ల గానీ తాను పక్షపాతం వహించననీ ఎవరెవరైతే నిష్పాక్షికంగా ప్రవర్తిస్తారో తన ఆదేశాలను ఎవరైతే అనుసరిస్తారో వారందరినీ తాను రక్షిస్తానని వేదం పేర్కొన్నట్లుగా (అధర్వవేద సంహిత: 5.11.3), ఆయన పేర్కొన్నారు. వేదం ప్రకటించిన ఇలాంటి నిష్పాక్షికతవల్లనే దారాషికో, వివేకానందుడు, అరవిందులు వంటి వారు వేదసారాంశాన్ని ప్రపంచానికి చాటిచెప్పగలిగారని చూపించారు.

**వేదవాఙ్మయంలోని విషయం:** వేదవాఙ్మయంలోని విషయమేమిటనేది తెలుసుకోవడంకోసం మనం ప్రధానంగా పాశ్చాత్యులు, పాశ్చాత్యచరిత్రకారులు, వారి ప్రభావంతో రచనలు చేసే దేశీయచరిత్రకారులమీద ఆధారపడుతూ వచ్చాం. వాళ్లు ప్రధానంగా వేదాలు ఆదిమతెగల కర్మకాండకు సంబంధించినవిగానూ, ప్రకృతిశక్తుల్ని ప్రసన్నం చేసుకోటానికి పాడినపాటలుగాను చిత్రీకరిస్తూ వచ్చారు. ఇందుకు విరుద్ధంగా ఒక సంప్రదాయ దృక్పథం ఉంటూ వచ్చింది. దాని ప్రకారం వేదాలు అపౌరుషయాలు. అవి ఎప్పుడు ఆవిర్భవించాయో మనం చెప్పలేమనే వాదన అది. దాని ప్రకారం వేదాల్లో సమస్తం ఉంది. భూగర్భశాస్త్రం మొదలుకొని, విమానాల తయారీదాకా సమస్తం వేదాల్లో ఉంది. కాని నిజానికి ఈ రెండు దృక్పథాలూ కూడా పాక్షికదృక్పథాలే. మొదటిది వేదవిషయాన్ని కేవలం ఒక పురావస్తు విషయానికి మాత్రమే పరిమితం చేస్తూంటే, రెండవదృక్పథం దాన్ని పూర్తిగా మానవాతీతవిషయంగా చూపటానికి ప్రయత్నిస్తుంది. ఈ పరిస్థితుల్లో వేదాల్లో ఉన్నదేమిటో, దానిలో ప్రస్తుతకాలానికి పనికొచ్చేదేమిటో, భవిష్యజీవితానికి దారిచూపేదేమిటో చెప్పగలిగే మనుషులు చాలా అరుదు. ఎందుకంటే వాళ్లకి వేదపరిజ్ఞానంతో పాటు వివేచనాత్మకదృక్పథముండాలి. నిష్పాక్షికత ఉండాలి. అన్నిటికన్నా ముఖ్యం సత్యజిజ్ఞాస ఉండాలి.

డా. సచ్చిదానందమూర్తి అటువంటి మనిషి. కాబట్టే తన పుస్తకంలోని రెండవ అధ్యాయంలో వేదవిషయం గురించి చేసిన కొంత వివేచన నిజంగా ఎంతో విలువైన వివేచన అనాలి. ఆయన వేదవిషయం గురించి అర్థంచేసుకోవటానికి పాశ్చాత్యులభాషాశాస్త్రం, చరిత్ర, తులనాత్మక అధ్యయనం మొదలైనవాటినన్నింటి మీద ఆధారపడుతూనే అంతకన్నాకూడా ఎక్కువగా యాస్కుడు, శౌనకుడు, పాణిని, పతంజలి, ఇతిహాసాలు, పురాణాలు, జైమిని, బాదరాయణుడు, శంకరుడు, రామానుజుడు, మధ్వాచార్యులు, స్కందస్వామి, సాయణులు చెప్పిన విషయాల మీద ఎక్కువ ఆధారపడ్డారు. వేదాలను అర్థం చేసుకోవటానికి పురాతనకాలంనుండీ భారత దేశంలో జరుగుతున్న ఈ ప్రయత్న పరంపరను అధ్యయనం చేయటమే సరైనమార్గమని కూడా ఆయన చెప్తూ వచ్చారు.

పాశ్చాత్యులు వేదపాఠాన్ని చదవడంలో శ్రద్ధ చూపించినప్పటికీ, గౌరవం చూపించలేదనేది ఆయన వాదన. మనం బైబిల్‌ని అర్థం చేసుకోవాలనుకుంటే దాన్ని ఒక అగస్టయిన్, ఒక ఆక్వినాస్, ఒక లూథర్ చదివినట్టుగా చదవాలనీ, ఖురాన్‌ని బోధపరుచుకోవాలనుకుంటే ఒక ఆల్‌ఘజలీ చదివినట్టుగా చదవాలనీ (పే. 25), అలాగే వేదాలు బోధపడాలంటే కేవలం సాయణభాష్యమొక్కటీ చదివితే సరిపోదనీ ఆయన అన్నారు. ఇదే మాట ప్రసిద్ధ పాశ్చాత్యవేదవిద్వాంసుడు రోత్ అన్నాడని కూడా (పే.26) రాశారు. ముఖ్యంగా ఏబెల్ బెర్గయిన్ అనే ఒక విద్వాంసుడు ఋగ్వేదం బోధపడాలంటే 'ప్రతి ఒక్క సూక్తాన్నీ మాత్రమే కాక, ప్రతి ఒక్క మంత్రాన్నీ మాత్రమేకాక, ప్రతిఒక్క శబ్దాన్నీ కూడా పట్టిపట్టి చదవాలనీ, శ్రద్ధగా చదవాలనీ' చెప్పాడని రాశారు. వేద తాత్పర్యం ఒక్కరోజులో, ఒక్కపఠనంలో సిద్ధించేదికాదనీ, అది జీవితకాల సాధన స్వాధ్యాయాల ఫలితం మాత్రమేనని ఆయన చెప్పారు. అందుకనే తైత్తిరీయ ఉపనిషత్తులో గురువు 'సత్యంవద', 'ధర్మంచర' అని మాత్రమే కాక, 'స్వాధ్యాయ న ప్రమదితవ్యమ్' అని కూడా చెప్తాడని, సత్యం మాట్లాడడం లాగా, ధర్మం పాటించడం లాగా వేదాన్ని అధ్యయనం చేస్తూండడం కూడా ఒక నిరంతర కార్యకలాపం కావాలని వేదమే సూచించిందని డా. మూర్తి రాస్తారు.

అందుకనే వేదాన్ని అర్థం చేసుకోవాలనుకున్నవారికి విట్నీ మూడు ప్రత్యామ్నాయాలున్నాయని సూచించాడని రాశారు. ఒకటి, వేదాన్ని ఒక గురుముఖతా అభ్యసించడం, లేదా వేదపాఠం స్ఫురింపజేస్తున్న సరళార్థాన్ని మాత్రమే స్వీకరించి తక్కిన అన్నిరకాల వ్యాఖ్యానాల్నీ అంగీకరించడం, లేదా ఖండించడం, ఈ రెండూ కాకపోతే మూడవది వేదశబ్దాల్ని ఒక భాషావేత్తగా క్షుణ్ణంగా పరిశీలించుకుంటూ వెళ్లటం. అయితే భారతీయ చరిత్ర గురించి భారతీయ స్వభావం గురించీ తెలుసుకోకుండా భారతీయ ఆధ్యాత్మికజీవితంతో పరిచయంలేకుండా ఋగ్వేదం బోధపడదని గెల్డనర్, పిష్లెల్ అనే పండితులన్నారని కూడా ఆయన ప్రస్తావించారు.

ఈ అధ్యాయంలోనే రెండవ భాగంలో ఆయన వేదాన్ని బోధ పరుచుకోడానికి తర్కసహాయం అవసరమని ప్రతిపాదించారు. యాస్కుని నిరుక్తంలో ఒకచోట మానవులంతా వైదికఋషుల్ని 'మీరు వెళ్లిపోతే మాకు ఇప్పుడు ఎవరు దారి చూపిస్తారు?' అని అడిగారని అప్పుడా ఋషులు తమ తరఫున తర్కఋషుని ప్రతిష్ఠించి వెళ్లారనీ రాసి ఉందనీ,

వేదవిషయాన్ని బోధపరచుకోటానికి తర్కం ఎంతో సహాయకారి అనీ డా. మూర్తి రాశారు.

మూడవభాగంలో ఈయన వేదవిషయకమైన తర్కం గురించి మరింత వివరించారు. దాన్నే మీమాంస అంటారని చెప్పారు. తర్కసహాయంగా మీమాంస చేసినప్పుడు వివిధ రకాల అర్థాలు స్ఫురించే అవకాశాన్ని పూర్వవ్యాఖ్యాతులెవరూ కూడా ఖండించలేదని ఆయన చెప్పారు. వేదం కేవలం శబ్దాలవల్లనో, అర్థాలవల్లనో లేదా వ్యాకరణం వల్లనో మాత్రమే బోధపడదని అది నిరంతర జిజ్ఞాసవల్ల, మీమాంస వల్ల మాత్రమే గోచరిస్తుందని ఆయన చెప్పారు. అటువంటి సందర్భాల్లో మనకి స్ఫురించే అర్థం మన అనుభవాలకు విరుద్ధమయితే దాన్ని నిరాకరించవచ్చని మధ్వాచార్యులు అన్నారని కూడా చెప్పారు. అంతేకాక, ఆయనిలా రాశారు: 'సమకాలీన అణుభౌతికశాస్త్ర సిద్ధాంతాల్లో కొన్ని పరిశీలనలు వేదాలతో అంగీకరిస్తున్నాయని తెలిసినందువల్ల వేదాలు నిరూపితమైనట్టు కాదు. అలాగే సమకాలీన పరమాణుజీవశాస్త్రసిద్ధాంతాల్లోని ఇటీవలి పరిణామాలు వేదాలతో ఏకీభవించనందువల్ల వేదాలు నిరూపించబడనట్టూ కాదు. మానవానుభవం, సైన్సు, చరిత్రలద్వారా నిరూపించబడేది కాని, నిరూపించబడనిది కాని వేదాల యొక్క తాత్పర్యం కాదు, సారాంశమూ కాదు' (పే. 33). అంతేకాదు, 'వేదసారాంశాన్ని శ్రద్ధతో, నైతిక జీవితంతో కూడిన నిర్మలచిత్తంతో ఏళ్లతరబడి వివేచిస్తూ ఉండాలి. అప్పుడు మాత్రమే దాని సారాంశమేమిటో, ఎంతోకొంత బోధపడుతుంది. చివరికి వేదసత్యం సాక్ష్యాత్కరిస్తుంది' (పే. 34). 'ఇదే సనాతన వైఖరి' అని కూడా అన్నారు.

ఆ విధంగా వేదసత్యాన్ని బోధ పరచుకోటానికి ప్రాచీన భారతీయ గ్రంథాలు, రచనలు చేసిన కృషిని ఆయన స్థూలంగా వివరించారు. తర్క-వ్యాకరణాలు, సాంఖ్య-యోగాలు, వైశేషికం, మనుస్మృతి, మహాభారతం, రామాయణం, భాగవతం, భగవద్గీత, వేదాలను అర్థం చేసుకోటానికి చేసిన ప్రయత్నం గురించి ఆయన సూత్రప్రాయంగా వివరించారు. ఈ అధ్యాయం నిజంగా ఎంతో విలువైన అధ్యాయం. వేదాలను అర్థం చేసుకోటానికి ఇటువంటి ఒక ఐతిహాసికపరంపర ఉందనే విషయాన్ని మనం మర్చిపోయి కేవలం పాశ్చాత్యచరిత్రకారులనో, లేదా మతవ్యాఖ్యాతలనో చదివినట్లయితే వేదాల్ని ఎప్పటికీ సమీపించలేమని స్పష్టమవుతోంది.


**వేద సారాంశం:** పుస్తకంలోని మూడవఅధ్యాయంలో ఆయన వేదసారాంశం గురించీ, వేదభాగాల్లోని వస్త్వైక్యం గురించీ మాట్లాడారు. సాధారణంగా వేదాలు మూడు మాత్రమేననీ, అధర్వణవేదానికి సమానప్రతిపత్తి లేదనీ చెప్పే మాటల్నీ, అలాగే సంహితలు కర్మకాండనీ, ఉపనిషత్తులు జ్ఞాన విచారణనీ ప్రోత్సహిస్తాయని చెప్పే మాటల్నీ ఆయన నిరాకరించారు. వేదాల్లో అటువంటి యాంత్రిక విభజన ఏదీ లేదనీ, నాలుగు వేదాలూ ఒక దానికొకటి అనుసంధించుకునే ఉన్నాయనీ ఆయన చెప్పారు. ఈ అంశంలో రెనౌ, లూడస్ వంటి మేధావులు చెప్పిన మాటలు కుమారిలుడు, ప్రభాకరుడు వంటి మీమాంసకులు చెప్తున్న మాటలూ ఒక్కలానే ఉన్నాయన్నారు. అలాగే వేదాల్లో ఆర్య అనార్య విభజన ఉందనీ, అవి ఆర్యప్రాశస్తిని ఉద్ఘాటిస్తూ, అనార్యుల్ని అణచివేయటం గురించి మాట్లాడుతున్నాయని చరిత్రకారులు చెప్తున్న మాటలు కూడా సత్యం కాదని ఆయన చెప్పారు. 'ఋగ్వేదం ఆర్య-అనార్య జాతులమధ్య సహకార ఫలితంగా రూపొందిందే'నని ఎఫ్.ఆర్. అల్చిన్, బ్రిట్జెట్అల్చిన్ చెప్పారని ఆయన రాసిన వాక్యం (పే. 78) నాకెంతో సంతోషాన్ని కలిగించింది.

ఈ అధ్యాయంలో రెండవభాగంలో ఆయన వేదాలకూ, మానవానుభవానికీ మధ్యనుండే సంబంధాన్ని వివరించారు. ఆ తరువాత మూడవభాగంలో ప్రధానంగా యజ్ఞం గురించి సంహితలు, బ్రాహ్మణ ఆరణ్యకాలూ, ఉపనిషత్తులు చెప్పిందాన్ని చాలా చక్కగా వివరించారు. త్యాగశీలంకాని కర్మకలాపమంతా కూడా మనుషుల్ని బంధిస్తుందేతప్ప, విముక్తపరచదని గీత (3.9) చెప్పిన వాక్యం దృష్టిలో పెట్టుకుని ఆయన యజ్ఞం గురించి వివరించారు. చివరగా ఆయన వేదార్థం గురించి మరొక్కమారు వివిధ వేదవాక్యాలు ఏం చెప్తున్నాయో ప్రస్తావించారు. మనం గ్రహిస్తున్న దానిలో అనుభవరీత్యా గ్రహిస్తున్నదంతా కూడా పక్కన పెట్టేస్తే చివరికి ఏం మిగులుతుందో ఆ కేవల సత్యమే యథార్థసత్యమని అన్నారు.

ఈ రచన చదవడం వల్ల నా వేదజిజ్ఞాస మరింత బలపడ్డమేకాక, నా జీవితకాల స్వాధ్యాయానికి మరింత ప్రోద్బలం దొరికిందని చెప్పనివ్వండి. మి

# ఇంతింతై వటుడింతయై

- జానమద్ది హనుమచ్ఛాస్త్రి



'ఆంధ్ర సారస్వత పరిషత్తు'లో 2011 జనవరి 24న తన పరిణతవాణిని వినిపించిన 85 సంవత్సరాల జానమద్ది!

నేను అనంతపురం జిల్లా రాయదుర్గంలో జానకమ్మ సుబ్రహ్మణ్యశాస్త్రి గార్లకు మూడవ సంతానంగా 5-9-1926న జన్మించాను. రాయదుర్గం శ్రీ కృష్ణదేవరాయలు సామంతుడైన భూపతిరాయుడు నిర్మించిన గిరిదుర్గం. నా ప్రాథమిక విద్య రాయదుర్గం కోటలోని వీరభద్రస్వామి ఆలయంలో జరిగింది అది ఒక వీధి బడి. ముంజోజీ అనే ఒక ఫించనుదారు ఆ బడిని నడిపేవాడు. 1 , 2 తరగతులకు ఒక అణా, 2 అణాలు ఫీజు వసూలు చేసేవాడు. నేటివలె ఆ నాడు వాచకాలు అందుబాటులో లేవు. ఒక చిన్ని నోట్‌బుక్‌లో కొన్ని ఊర్లపేర్లు, తాలుకాల పేర్లు, ఎక్కాలు, నెలలు, తిథి, వార, నక్షత్రాల పేర్లు రాసి ఇచ్చేవాడు. అదే నా మొదటివాచకం. ఉదయం 7 గంటలకల్లా బడి ప్రారంభమయ్యేది. కృష్ణశతకం, సుమతీశతకం పద్యాలు వల్లె వేయించేవారు.

రాయదుర్గం తెలుగు కన్నడ భాషలకూడలి. నా మాతృభాష తెలుగు హైస్కూల్‌లో కోరుకొని కన్నడం రెండవ భాషగా చదివాను. మా ప్రధానోపాధ్యాయుడు ఎన్. సుందరం అయ్యర్, ఎస్.ఎస్.ఎల్.సి తరగతిలో ఆయన మాకు ఇంగ్లీష్ పాఠాలు చెప్పేవారు. ప్రతి విద్యార్థి వద్ద టెక్ట్సుబుక్‌తో పాటు మైకెల్‌వెస్ట్ ఇంగ్లీషు డిక్షనరీ, రెన్ & మార్టిన్ గ్రామర్ పుస్తకం తప్పక ఉండాల్సిందే. ప్రతి రోజూ పాఠాలు చెప్పేముందు జరిగిన పాఠాలపై ప్రశ్నలు వేసేవారు, సరైన సమాధానాలు చెప్పకపోతే బెత్తం దెబ్బలు తప్పేవికావు.

మా చరిత్ర ఉపాధ్యాయులు నేత్రపల్లి సంజీవరావు గారు జాతీయ భావాలు గలవారు. మహనీయుల జీవితాలను ఉత్తేజకరంగా చెప్పేవారు. వారాంతంలో సారస్వత సమావేశాలను జరిపి విద్యార్థులలో రచనాశక్తిని, వక్తృత్వ శక్తిని పెంపొందించేవారు.

1942 సంవత్సరంలో "క్విట్ ఇండియా" ఉద్యమం ముమ్మరంగా సాగుతుండేది. స్థానిక కాంగ్రెస్ నాయకులు విద్యార్థులను ఉద్దేశించి ఉపన్యాసాలిచ్చేవారు. కొంత మంది మిత్రులతో పాటు రాత్రి భోజనం తర్వాత ఒక గదిలో చదుకోడానికి చేరేవాళ్లం. పంచాంగం సుబ్బరామశర్మ కాంగ్రెస్ యువనాయకుడు బయటి ఊర్ల నుంచి వచ్చే ఉద్యమకరపత్రాలను సిరాతో నకళ్లు రాయించేవాడు. వేకువనే లేచి మా ఊరు చుట్టూ ఉన్న కొండ రాళ్లపై "డు ఆర్ డై", "క్విట్ ఇండియా" అన్న నినాదాలు సున్నంతో రాసేవాళ్ళం అదే ఆనాటి మా దేశసేవ.

నా హైస్కూల్ చదువు బాగా సాగింది. మంచి మార్కులు వచ్చాయి. వేసవి సెలవుల్లో నా స్వగ్రామం జానమద్దికి వెళ్ళేవాడిని. మా ఊరు నదీతీరంలో ఉంది. నదీ తీరంలోని కపిలబావి నుండి నీటిని పొలాలకు మళ్లించేవారు. ముగ్గురు జీతగాళ్లు పనులు చూసేవారు. వారి సహకారంతో నేను కూడా మోటుపై కూర్చుని కపిలె తోడేవాణ్ణి.

హైస్కూలు చదువు తరువాత జిల్లా కేంద్రమైన బళ్ళారి చేరాను. వైశ్యకుల గురువుగా, పండితులుగా వుండిన, భాస్కరాచార్య రామచంద్రస్వామి గారింట్లో వుండి 1944-46 మధ్య టీచర్ ట్రైనింగ్ స్కూల్‌లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా శిక్షణ ముగించాను. మంచి మార్కులు రావడంతో ట్రైనింగ్ పూర్తి అయిన తరువాత వారం రోజులలోనే

డా. జానమద్ది హనుమచ్ఛాస్త్రి, ఫోన్ : 08562 - 243923

'ట్రైనింగ్ స్కూల్‌కు అనుబంధంగా ఉన్న మోడల్ స్కూల్‌లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా నా ఉద్యోగ జీవితం ప్రారంభించాను. బళ్ళారిలోని హిందీ ప్రశిక్షణ కళాశాలలో హిందీ తరగతులకు వెళ్లేవాడిని. మా అధ్యాపకులు టి.బి. కేశవరావు, కె. గౌడప్ప స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నవారు. బళ్ళారిలో రెండేళ్ళు ఉపాధ్యాయుడుగా పనిచేసిన తరువాత నేను కన్నడం కూడా చదివినందున 1951లోనే జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతిపై బళ్ళారి జిల్లాలోని కన్నడ తాలుకా కూడ్లిగికి బదిలీ చేశారు. అప్పుడు నిర్బంధ ప్రాథమిక విద్య అమలులో ఉండేది. ఆంధ్ర ప్రాంతానికి వయోజన విద్య గౌరవ డైరక్టరుగ వుండిన గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు బళ్ళారి జిల్లాలోని వయోజన విద్యా కేంద్రాలను గ్రామ పంచాయితి గ్రంథాలయాలను చూస్తూ జిల్లాలోని కన్నడ తాలుకాలలో పర్యటించారు.



డా. బెజవాడ గోపాలరెడ్డి

గాడిచర్లవారు స్వాతంత్ర్య సమరయోధులు. తెలుగువారిలో మొట్టమొదటి మూడేళ్లు కఠిన కారాగార శిక్ష అనుభవించిన ఎం.ఏ పట్టభద్రుడు. పగటివేళ గ్రామీణ గ్రంథాలయాలను చూచేవారు. రాత్రిబడులను దర్శిస్తూ ఉపాధ్యాయులకు చక్కని బోధనా పద్ధతులను వివరించేవారు. వారి తెలుగు ప్రసంగాలను కన్నడంలోకి అనువదిస్తూ వారితో జిల్లాలోని కన్నడ తాలుకాలన్నిటికీ వెళ్లాను. ఆయన ఆదర్శ దేశభక్తుడు మూర్తీభవించిన త్యాగమూర్తి.

వారం రోజుల పర్యటన తరువాత నా అనువాద రీతిని మెచ్చుకొని నేను నీకు ఏమి చేయగలనని కోరారు. అయ్యా, నేను బళ్ళారిలో ఉద్యోగం చేస్తూ ప్రైవేట్‌గా ఇంటర్‌మీడియట్ పాసయ్యాను.. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత మద్రాస్ యూనివర్శిటీవారు బి.ఏ చదవటానికి అనుమతించలేదు.ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నందున ఆంధ్ర యూనివర్శిటిలోనే బి.ఏ. చదువవలసి వచ్చింది. నేను చరిత్ర, హిందీలతో ఇంటర్ మీడియేట్ చదివాను. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆ గ్రూప్ లేదు. అందుకు ప్రత్యేక అనుమతి పొందాల్సి వచ్చింది. హరిసర్వోత్తమరావుగారు ఆంధ్ర యూనివర్శిటి సెనెట్ మెంబర్‌గా ఉండేవారు. వైస్-చాన్సెలర్ డా.వి.యస్.కృష్ణగారికి ఉత్తరం రాసి నాకు ప్రత్యేక అనుమతి ఇప్పించారు. ఆ రీతిగా ఉద్యోగం చేస్తూ బి.ఏ పరీక్ష పాసయ్యాను. తర్వాత ఇంగ్లీష్, తెలుగు భాషల్లో ఎం.ఏ. పట్టాలందుకొన్నాను.

రాష్ట్ర విభజనానంతరం మా ఊరు రాయదుర్గానికి జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా ఒక ఏడాది పాటు పని చేశాను. విద్యార్థి దశనుండే నాకు సాహిత్యం పట్ల ఆసక్తి ఉండేది. స్థానికులైన పెద్దలు ప్రారంభించిన 'విజయకళాసమితి' అన్న సాహిత్య సంఘానికి కార్యదర్శిగా వుండి శ్రీనాథ జయంతి, కాళిదాస జయంతి కార్యక్రమాలను గొప్పగా జరిపాం. సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా వుండిన రత్నగిరి పద్మనాభన్, కార్యదక్షుడు, మంచి వక్త. అపుడు జరిగిన శ్రీనాథ జయంతి సభలో పుట్టపర్తి నారాయణాచార్యులు బ్రహ్మాండంగా ఉపన్యసించారు.

కడపలోని రాచుపల్లె రాజగోపాల రెడ్డిగారి కృష్ణ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫీసులో రోజూ కొందరు రచయితలం కలుసుకొని సాహిత్య చర్చలు జరిపే వాళ్ళం. రెడ్డిగారు "మాసీమ" పక్షపత్రిక సంపాదకులుగా ప్రారంభించారు.

1973లో చిత్తూరుజిల్లా రచయితల మహాసభలకు, కడప ప్రతినిధిగా పి. రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. సభలు చాలా బాగా జరిగినట్లు, అట్టి సంఘాన్ని కడపలో కూడా ప్రారంభించటం మంచిదని పి. రామకృష్ణారెడ్డి సూచించారు. ఆయన అధ్యక్షుడుగా, జానమద్ది హనుమచ్ఛాస్త్రి (నేను) కార్యదర్శిగా సంఘం ఏర్పడింది.

1973 ఆగస్టు 11,12 తేదీలలో కడప జిల్లా రచయితల మొదటి మహాసభ జరిగింది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అధ్యక్షులు డా. బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యఅతిథిగా వచ్చారు.శివభారత కావ్యకర్త గడియారం వేంకటశేషశాస్త్రి గారు అధ్యక్షత వహించారు. ఏడాది తర్వాత రామకృష్ణారెడ్డి ఆంధ్రజ్యోతి వార పత్రిక సబ్ ఎడిటర్ విజయవాడ వెళ్ళారు. డా. మల్లెమాల వేణుగోపాలరెడ్డిగారు అధ్యక్షులుగా, నేను ప్రధాన కార్యదర్శిగా ఇరువదేళ్ళలో 8 మహాసభలు కొన్ని

వందల సాహిత్య సభలు, యువతను ప్రోత్సహిస్తూ ఎన్నో సభలు జరిపాం. ఈ మహాసభల్లో విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ, దాశరథి కృష్ణమాచార్య పురిపండా అప్పలస్వామి, దేవులపల్లి రామానుజరావు పుట్టపర్తి నారాయణాచార్యులు, కుందుర్తి, ఆరుద్ర, జ్వాలాముఖి, గజ్జెల మల్లారెడ్డి, రా.రా. కేతు విశ్వనాథరెడ్డి, దివాకర్ల వెంకటావధాని, ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ, మధురాంతకం రాజారాం మున్నగు వారెందరో పాల్గొన్నారు. జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా ఆ తరువాత అధ్యక్షులుగా సభలు నిర్వహించి రాష్ట్రంలో ఎందరో సాహిత్యవేత్తల పరిచయం సంపాదించుకొన్నాను.

**సి.పి. బ్రౌన్ గ్రంథాలయ భవన నిర్మాణం:** 1976లో ఆరుద్ర, బంగోరె (బండి గోపాలరెడ్డి) కడప వచ్చారు. వారు తమ వద్దనున్న బ్రౌన్ రీడర్ల ఆధారంతో కడపలో బ్రౌన్ నివసించిన స్థలాన్ని, బంగళా శిథిలాలను పరిశీలించారు. అప్పటి కలెక్టర్ డా. పి.ఎల్. సంజీవరెడ్డి గారిని కలుసుకొని తెలుగు భాషా సాహిత్యాలకు ఎంతో కృషిచేసిన బ్రౌన్ స్మృతిచిహ్నంగా గ్రంథాలయం నిర్మించాలన్న తమ ఆశయాన్ని కలెక్టర్‌కు చెప్పారు.


సి.పి. బ్రౌన్

సాహిత్యాభిమానియైన కలెక్టర్ డా. పి.ఎల్. సంజీవరెడ్డి నన్ను పిలిపించారు. అప్పట్లో నేను ప్రభుత్వ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడుగా పనిచేస్తుండేవాడిని. బ్రౌన్ స్మృతి చిహ్నంగా గ్రంథాలయ నిర్మాణానానికి నన్ను పురమాయించారు.

డా. సంజీవరెడ్డిగారు బ్రౌన్ బంగళా శిథిలాలున్న స్థల యజమాని ఆడిటర్ కృష్ణస్వామిగారిని ఆహ్వానించి బంగళా శిథిలాలున్న 20 సెంట్ల స్థలాన్ని బ్రౌన్ స్మృతి చిహ్నంగా గ్రంథాలయ నిర్మాణానానికి విరాళంగా ఇవ్వమని కోరారు. ఆయన వెంటనే సమ్మతించారు. 1977 నాటికి బంగళా మొండిగోడలు మాత్రమే మిగిలాయి. ట్రస్టు కార్యదర్శిగా ఉండమని నన్ను ఆదేశించారు. 1977 నుండి 1987 దాకా జిల్లా ప్రణాళికా మండలి వారికి గ్రంథాలయ భవన నిర్మాణానికి సహాయం కోరుతూ వినతి పత్రాలు సమర్పించాం. పదేళ్ళు ప్రయత్నించాను కాని ప్రజాప్రతినిధులు ఏ మాత్రం ఆసక్తి చూపలేదు.

1986 జూలైలో జంధ్యాల హరినారాయణగారు కలెక్టర్‌గా వచ్చారు. వారు స్థలదాత ఆడిటర్ సి.కె. సంపత్‌కుమార్ అధ్యక్షులుగా నన్ను కార్యదర్శిగా ఉండమని సూచించారు. ట్రస్టు ప్రధానపోషకులుగా కలెక్టరు, అధ్యక్షుడుగా ఆ స్థలదాత కుమారుడు సి.కె. సంపత్‌కుమార్, జానమద్ది హనుమచ్ఛాస్త్రి ప్రధాన కార్యదర్శిగా మరో ఏడు మంది సభ్యులుగా రిజిష్టర్ చేయబడింది. కలెక్టర్‌గారు తెలుగు గ్రామీణ పథకం నిధుల నుండి రూ. 3.5 లక్షలు మంజూరు చేశారు. అంతలోనే వారికి బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. మా విన్నపం మేరకు హరినారాయణగారు మరుసటి రోజు 22.1.1987 ఉదయం భవనానికి శంకుస్థాపన చేశారు. 'సరస్వతీపుత్ర' పుట్టపర్తి నారాయణాచార్యులు నాటి సభకు అధ్యక్షతవహించారు. ఆ రోజు సాయంత్రం రైల్లో హైదరాబాద్ వెళుతూ "భగవంతుడు ఈ సత్కార్య నిర్వహణ కోసమే నన్ను కడపకు పంపారు కాబోలు" అన్నారు. మేము సాదరంగా వీడ్కోలు పలికాం.

అందిన ప్రభుత్వ నిధులతో భవన నిర్మాణం ప్రారంభించాం. ఎందరో దాతల సహకారంతో మూల భవన నిర్మాణం పూర్తిచేశాం. విద్యాశాఖాధికారి డా. ఆర్. సత్యనారాయణ, ప్రాంతీయ విద్యాశాఖాధికారి శ్రీరామస్వామి రెడ్డి సహకారంతో కడప, ప్రొద్దుటూరు విద్యార్థులు కూర్చిన 25వేల పైకంతో ప్రహరిగోడ పూర్తిచేశాం. కలెక్టర్ ఎ.కె. ఫరిదాగారు గ్రంథాలయానికి రూ.60వేలు విరాళం అందజేశారు.

కడప సమీపంలోని వల్లూరు గ్రామానికి చెందిన పోలేపల్లి వెంగన్నశ్రేష్ఠి గారు తాము నిర్వహిస్తున్న సీతారామ చంద్ర గ్రంథ భాండాగారంలోని 2 వేల గ్రంథాలను బ్రౌన్ గ్రంథాలయానికి అందజేశారు. 1992 నుంచి సేవలందిస్తున్న గ్రంథాలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు దర్శించి 20.11.1995న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వావిలాల గోపాలకృష్ణయ్యగారిచే ప్రారంభోత్సవం కావించారు.

నానాటికి పెరిగిపోతున్న పుస్తకాల సంఖ్య, పరిశోధకుల కోరిక మేరకు రెండవ అంతస్తు నిర్మాణానాకి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా. సి. నారాయణరెడ్డిగారు రాజ్యసభ సభ్యులుగా తమ విచక్షణ నిధుల నుండి రూ.10 లక్షలు అందజేశారు. అలా నిర్మింపబడిన అంతస్తుకు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి. నారాయణరెడ్డి పరిశోధన కేంద్రంగా ఏర్పడింది. ఆ కేంద్రాన్ని 9.10.2003న డా. సి. నారాయణరెడ్డిగారే ప్రారంభించారు. 'ఇంతింతై వటుడింతయై' అన్నట్లు బ్రౌన్ గ్రంథాలయం విస్తరించింది. పలు ప్రచురణ సంస్థలు, పండితులు వేలాది గ్రంథాలను విరాళంగా అందజేశారు.

కడప జిల్లాకు చెందిన డా. వై.యస్. రాజశేఖరరెడ్డిగారు 2006లో బ్రౌన్ గ్రంథాలయాన్ని దర్శించి మా సేవలను అభినందిస్తూ గ్రంథాలయాన్ని కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయానికి అప్పగింపజేశారు. ప్రభుత్వం నుండి రు.30 లక్షలు వార్షిక గ్రాంటు మంజూరు చేశారు. బ్రౌన్ గ్రంథాలయ ప్రగతిని సూచించుటకు ఆధారంగా మొండిగోడల నుండి మహాసౌధం దాకా అన్న పేరుతో 250 పుటల ప్రత్యేక గ్రంథం ప్రచురింపబడింది. సందర్శకుల చేతి రాతలతో వారి అభిప్రాయాలను ఫోటోలతో సహా ప్రచురింపబడింది. దాదాపు పాతికేళ్లుగా కొనసాగించిన గ్రంథాలయ నిర్మాణ యజ్ఞం పూర్తికావటంతో నా జన్మ సార్థకమైంది అన్న తృప్తి నాకు మిగిలింది. సి.నా.రె. వంటి పెద్దలు, కలెక్టర్లు, మరెందరో దాతలు నన్ను అభినందించారు. డా. సి. నారాయణరెడ్డిగారు నాకు "బ్రౌన్ శాస్త్రి" అన్న ప్రశస్తి ప్రకటించారు.

2006 నవంబర్10వ తేదిన కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి గారి అధ్యక్షతతో సలహాసంఘం ఏర్పడింది. ఒకనాటి బ్రౌన్ గ్రంథాలయం సి.పి. బ్రౌన్ భాషా కేంద్రంగా రూంపొందింది.

నాటినుండి నేటి వరకు ప్రముఖ తెలుగు పత్రికలన్నిటిలో నా రచనలు ప్రచురిస్తున్న సంపాదకులకు నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. కడపలోని ఆకాశవాణి కేంద్రంద్వారా దాదాపు 150 ప్రసంగాలు ప్రసారమైనాయి. దాదాపు 12 ఏళ్లు కడప ఆకాశవాణి కేంద్రం సలహా సభ్యుడుగా పనిచేశాను. ఇప్పటికి దాదాపు 2500 వ్యాసాలు పత్రికల్లో వెలువడినాయి.

**సాంస్కృతిక సేవా రంగం :** కడపలోని సాయిబాబా అనాథ శరణాలయం సభ్యుడుగా జె.సి. సుబ్బయ్యగారి సారథ్యంలో సాయిబాబా అనాథ శరణాలయం నిర్మాణానికి నా వంతు సహాయం అందజేశాను. మిత్రసమూహ ఒక సాంస్కృతిక సేవా సంస్థ కడపలోని హోటల్ యజమాని అధ్యక్షుడు నన్ను గౌరవాధ్యక్షుడుగా ఎన్నుకొన్నారు. మిత్రసమూహ ప్రధాన కార్యదర్శి కుంభాశి జనార్దన పురాణిక పలు సేవా సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**గాడిచర్ల ఫౌండేషన్**

ఇదివరలో గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు నాకు అందజేసిన ప్రోత్సాహానికి కృతజ్ఞతాపూర్వకంగా 1997 సెప్టెంబర్ 14వ తేదీన కడపలో 10వేల రూపాయల విరాళంతో గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఫౌండేషన్ ఏర్పాటు చేశాను. గత 13 ఏళ్లుగా చంద్రశేఖర్ కల్కూర అధ్యక్షులుగా గాడిచర్ల అవార్డును వివిధ సేవా రంగాలలో కృషిచేసిన పెద్దలకు ఏటా రావుగారి జయంతి సందర్భంగా అందజేస్తున్నాము.

**రచనల వివరాలు**

కడప నుండి వెలువడుతున్న 'మాసీమ' పత్రికలో రాయలసీమ కవులు గురించిన వ్యాసాలను 'మాసీమ కవులు' అన్న పేరుతో మాసీమ రాజగోపాలరెడ్డిగారు ప్రచురించారు. అది నా మొదటి పుస్తకం. క్రమంగా మరికొన్ని గ్రంథాలు వెలువడ్డాయి. అవి :

1. బళ్లారి రాఘవ జీవిత చరిత్ర
2. కస్తూరి కన్నడ సాహిత్య సౌరభం – రెండు ముద్రణలు పొందింది.
3. గణపతి – కన్నడం నుండి తెలుగులోకి ఇంగ్లీషులోను అనువదించిన రచన
4. మహనీయుల జీవితాల్లో రసవద్ఘట్టాలు
5. మన దేవతలు – శ్రీశైల దేవస్థానం ప్రచురణ
6. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరాయ తెలుగులోను, ఇంగ్లీషులోను ప్రచురింపబడింది.
7. సుప్రసిద్ధుల జీవితవిశేషాలు
8. సి.పి. బ్రౌన్ చరిత్ర – తెలుగు అకాడమి ప్రచురణ
9. వ్యాసభారతి
10. ఎందరో మహానుభావులు
11. నీరాజనం
12. సంగీత మేరుశిఖరాలు
13. ప్రగతి పథంలో భారతమహిళ

**అనువాదాలు:** *"Man Thou Can"* *"మనిషీ నీకసాధ్యమేది"* శ్రీ బదరీనారాయణ సిన్హాగారి కుమారుడు కలెక్టర్ అదర్‌సిన్హాగారి కోరిక మేరకు కట్టా నరసింహులు సహకారంతో తెలుగులో గేయాత్మకంగా వెలువడింది. పై రచనలే కాక ఇప్పటకి మొత్తం 30 పుస్తకాలు రచించాను.

**నేనేరిగిన పెద్దలు :** నా సాహిత్య జీవితంలో ఎందరో పెద్దలను కలుసుకొనే భాగ్యం నాకు లభించింది. సాహిత్య సంగీత విద్యానిధి రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారు బళ్లారిలో ఆయన కుమార్తె అల్లుడుగార్లను చూడడానికి వచ్చినప్పుడు మా పెద్దనాన్న రామచంద్రస్వామి గారి ఇంట్లో వారిని కలుసుకొన్నాను. తరువాత తిరుపతిలోను, బెంగుళూరులోను వారిని కలుసుకొని పరిచయం పెంచుకొన్నాను.కడపలో శివభారతకర్త డా॥ గడియారం వెంకటశేషశాస్త్రి గారిని పలుమార్లు కలుసుకొన్నాను. సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు కడపకు రాకముందే నాకు పరిచితులు. కడపలో కొన్నేళ్లపాటు వారితో ముచ్చటించే అవకాశం లభించింది. వారి షష్టిపూర్తి సన్మాన కార్యక్రమానికి నేనే కార్యదర్శిగా వుండి "సాహితీవిస్మేరం" అన్న అభినందన సంచికను సమర్పించాం. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారికి కడపలో జరిగిన ఘన సన్మానానికి నేను కూడా సహకరించాను. కడప కళాశాలలో సంస్కృత అధ్యాపకులైన పేరాల భరతశర్మ, కథా రచయితగా సుప్రసిద్ధులు మధురాంతకం రాజారాం, శ్రీ భుజంగరాయశర్మ గార్లతో నాకు సాన్నిహిత్యం లభించింది. శంకరంబాడి సుందరాచారి నా అతిథిగా కడపలో మూడు రోజులు గడిపారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యవర్గ సమావేశాలు కడపలో జరిగాయి. ఆ సందర్భంగా సాహిత్య దిగ్గజాలైన దివాకర్ల వేంకటావధాని, డా. ఆరుద్ర, శ్రీ.శ్రీ. కాళోజి నారాయణరావు, సంజీవదేవ్ మున్నగు వారితో సభలు నిర్వహించి వారి ఆదరాభిమానాలు చూరగొన్నాను. రాజకీయరంగంలోను, సాహిత్య రంగంలో కూడా లబ్ధప్రతిష్ఠులైన డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు జిల్లా రచయితల ప్రథమ మహాసభలను ప్రారంభించారు. తర్వాత బ్రౌన్ గ్రంథాలయాన్ని దర్శించి నా కృషిని ప్రోత్సహించారు.

విశ్వవిఖ్యాత నటులు బళ్లారి రాఘవగారిని బళ్లారిలో పలుమార్లు కలుసుకొన్నాను. వారి జీవితచరిత్రను తెలుగు విశ్వవిద్యాలయం ఆ తరువాత విశాలాంధ్ర ప్రచురణ సంస్థ వారు ప్రచురించారు. రాఘవ చివరిదశలో బళ్లారిలో ప్రదర్శించిన పాదుకాపట్టాభిషేక నాటకంలో చిన్న పాత్ర దర్శించే అవకాశం కూడా నాకు లభించింది. ప్రముఖ సంగీత విద్వాంసులు శ్రీపాద పినకపాణి, గేయధార ప్రక్రియకు ఆద్యులైన డా. సాయికృష్ణయాచేంద్ర మున్నగువారిని పలుమార్లు కలుసుకొన్నారు. కడప జిల్లా రచయితల సంఘ కార్యదర్శిగా సి.పి. బ్రౌన్ గ్రంథాలయ వ్యవస్థాపక కార్యదర్శిగా ఎందరో సాహితివేత్తలను కళామూర్తులతో పరిచయ భాగ్యం లభించింది.



సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడప

**పురస్కారాలు** : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ అందుకొన్నాను.

సాహిత్య సాంస్కృతిక రంగాలలో నా కృషిని గుర్తించిన ఎందరో పెద్దలనుండి సత్కారాలు అందుకొన్నాను. వార్త దినపత్రిక ప్రారంభోత్సవ సందర్భంగా ప్రధాని పి.వి. నరసింహారావు గారు మధురాంతకం రాజారాంగారితొ పాటు నాకు కూడా సత్కారం చేశారు. సి.పి. బ్రౌన్ ద్విశత జయంతి సందర్భంగా జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి. నారాయణరెడ్డిగారు హైదరాబాదులోని ఆంధ్ర సారస్వత పరిషత్తులో రెడ్డి ల్యాబ్ అధినేత డా. కె. అంజిరెడ్డి ధర్మనిధి సాహిత్య పురస్కారం అందుకొన్నవారిలో నేను మొదటి వాడిని. ఆచార్య బిరుదురాజు రామరాజుగారు తాము రచించిన 'ఆంధ్ర యోగులు' గ్రంథావిష్కరణ సందర్భంగా సత్కరించారు. ఎందరో పెద్దల నుండి పురస్కారలందుకొనే భాగ్యం నాకు లభించింది. ®

# మా నాన్నగారి సూట్‌కేస్

**- ఒరాన్ పాము**

*ఇస్తాంబుల్‌లో సంపన్న కుటుంబంలో జన్మించిన (1952) ఒరాన్ పాము (Orhan Pamuk), రాబర్ట్ కళాశాలలో డిగ్రీ, ఇస్తాంబుల్ విశ్వవిద్యాలయంలో ఆర్కిటెక్చర్, జర్నలిజంలో విద్యాభ్యాసం చేశారు. తరువాత మూడు సంవత్సరాలు (1985–88) అమెరికాలో కొలంబియా విశ్వవిద్యాలయం (న్యూయార్క్)లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా వున్నారు. ప్రస్తుతం ఇస్తాంబుల్‌లో నివసిస్తున్నాడు. 1982లోప్రచురించబడిన తన తొలి నవలలో – ఇస్లామిక్, అమెరికా ప్రపంచాల నడుమ మూడు తరాల తన కుటుంబం ఎలా మార్పు చెందిందో వ్రాశారు. రెండో నవలలో టర్కీ అంతర్యుద్ధం నేపథ్యంలో – వివిధ ప్రాంతాలలో నివసించే తన కుటుంబ సభ్యులు–వృద్ధురాలయిన తన నాయనమ్మను చూడటానికి ఎలా వచ్చారో వివరించాడు (House of Silence). పాముకి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చింది – 'The White Castle' అనే నవల. ఇది ప్రాథమికంగా, మనిషి అహానికి, అంతర్మథనానికి, అస్తిత్వ అన్వేషణకు సంబంధించి 17వ శతాబ్దపు నేపథ్యంలో చెప్పబడిన కథ. ఇది ఐరోపా కథను – మధ్యప్రాచ్య వాతావరణంలో నవలీకరించడం!*

*ఆయన My home is Red, రచన తూర్పు – పశ్చిమల సంబంధాల గురించి ప్రత్యేకంగా సాంస్కృతిక విభాగాల కథనం. ప్రాథమికంగా చిత్రకారుడయిన పాము తన రచనల్లో కూడా చిత్రకళను కథనంలో వాడుకున్నారు. తరువాత 'The Snow' అనే నవల – టర్కీ, రష్యా సరిహద్దుల మధ్య జరిగినట్లు వ్రాశారు. ఇదీ ఆయనకు ఎంతో పేరు తెచ్చింది. పాము, సాల్మన్ రష్దీకి తన మద్దతు తెలిపారు. అలాగే యాసర్ కీమల్ అనే రచయిత తరపున కష్టకాలంలో నిలబడ్డారు. పాముకి రోమన్, జర్మన్, ఫ్రాన్స్, గ్రీక్, ఐర్లండ్ దేశాల పురస్కారాలు లభించాయి – 2006లో ఈ నోబెల్ పురస్కారం ఆయన పాతికేళ్ల సాహిత్య కృషికి ఫలితం.*

ఇంకా రెండు సంవత్సరాలకు చనిపోతారనగా మా నాన్నగారు తన రచనలు, వ్రాత ప్రతులు, నోటుపుస్తకాలలో నిండివున్న ఒక సూట్‌కేసును నాకిచ్చారు. ఆయన తన మామూలు వ్యంగ్యధోరణిలో నాతో అన్నారు – "దీనిలో వున్న వాటిని నేను పోయాక మాత్రమే చదువు."

"ఊరికే చూడు. వాటిలో నీకు పనికొచ్చేదేమైనా వుందేమో చూడు. నేను చనిపోయాక వాటిలోంచి పనికొచ్చే వాటిని ఏరి ముద్రించు."

మేమిద్దరమూ పుస్తకాల మధ్య నాగదిలో కూర్చున్నాం. మా నాన్నగారు ఆసూట్‌కేస్‌ని ఎక్కడ వుంచితే బాగుంటుందా అని సరైన స్థలం కోసం వెదుకుతున్నారు. ఆయన అటూ ఇటూ పచార్లు చేస్తూ ఏదో బరువైన, బాధాకరమైన బరువును దించేసుకోవడం కోసం ప్రయత్నిస్తున్నట్టనిపించింది. చివరికి ఆయన దాన్ని ఒక మూలన సర్దారు. అక్షణాల్ని మేమిద్దరమూ ఎప్పటికీ మర్చిపోలేం. మళ్ళీ మేము మామూలుగా మా జోకులు, హేళనలు జీవితాన్ని తేలిగ్గా తీసుకునే ధోరణిలోకి వెళ్ళిపోయాం. ఎప్పటి లాగానే దైనందిన జీవితపు మామూలు విషయాలగురించీ, టర్కీలోని ఎప్పటికీ కొలిక్కిరాని సమస్యలగురించీ, మా నాన్న గారి వ్యాపార నష్టాల గురించీ మాట్లాడుకున్నాం.

నాకింకా గుర్తుంది. మా నాన్నగారు వెళ్ళిపోయాక చాలా రోజులపాటు ఆ సూట్‌కేస్‌ని ముట్టుకోకుండా అటూ ఇటూ

తెలుగు : డా. బి.వి. రామిరెడ్డి, ఫోన్ : 9908856530

నడుస్తుండేవాణ్ణి. చిన్న, నల్లని లెదర్ సూట్‌కేస్, దాని తాళం, దాని గుండ్రని మూలలు ఇవన్నీ నాకు సుపరిచితం. మా నాన్నగారు తన పనిమీద వెళ్ళేప్పుడు, చిన్న ప్రయాణాలకి వెళ్ళేప్పుడు దాన్ని తీసుకెళ్ళేవారు. నాకింకా గుర్తే. నా చిన్నప్పుడు మా నాన్నగారు ప్రయాణం నించి తిరిగొచ్చారు. నేను ఆ సూట్‌కేస్‌ని తెరిచి అందులోని వస్తువుల్ని, ఇతరదేశాల సువాసనల వస్తువుల్ని కదిలించేవాడ్ని. ఆ సూట్‌కేస్ నాకు బాగా తెలిసిన మిత్రుడు, నా గతాన్ని బాల్యాన్ని గుర్తుచేసే బలమైన గుర్తు. అయితే ఇప్పుడు నేను దాన్ని ముట్టుకోలేదు. ఎందుకని? అందులో వున్న రహస్యమైన కాగితాల బరువువల్ల.

నేనిప్పుడు దాని 'బరువు' కు అర్థం చెప్పబోతున్నాను. అది వొక వ్యక్తి తన గదిలో తలుపు మూసుక్కూచుని టేబుల్ దగ్గర ప్రశాంతంగా తన ఆలోచనల్ని వ్యక్తపరుచుకోవడం. సాహిత్యానికి అర్థం అదే.

మా నాన్నగారి సూట్‌కేస్‌ని ముట్టుకున్నాక కూడా దాన్ని తెరవలేక పోయాను. అయితే అందులో వున్న కొన్ని నోటుపుస్తకాల్లో ఏముందో నాకు తెలుసు. వాటిలో కొన్నింటిని మా నాన్నగారు వ్రాసుకుంటుంటే చూశాను. మా నాన్నగారికి పెద్ద గ్రంథాలయం వుంది. 1940లలో, ఆయన యౌవనపు రోజుల్లో ఆయన ఒక ఇస్తాంబుల్ కవి కావాలనుకున్నారు. ఆయన 'వెలెరీ'ని టర్కీభాషలోకి అనువదించారు. కొద్దిమంది పాఠకులున్న ఒక పేదదేశంలో కవిగా జీవించడం ఆయనకిష్టం లేదు. మా నాన్నగారి తండ్రి – మా తాతగారు – ధనవంతుడైన వ్యాపారి. బాలుడుగా, యువకుడుగా మానాన్నగారు సుఖంగా జీవించారు. సాహిత్యం కోసం కష్టాల్ని భరించడం ఆయనకిష్టం లేదు. జీవితాన్ని అన్ని అందాలతోను ఆయన ప్రేమించాడు. అది నాకు తెలుసు.

మా నాన్నగారి సూట్‌కేస్‌లోని పేపర్లను చదవకుండా దూరంగా వుంచడానికి మొదటి కారణం అందులోని విషయాలు నాకు నచ్చవేమోననే భయం. మా నాన్నగారికి ఈ విషయం తెలుసు. అందుకే ఆ విషయంలో ఆయన ముందు జాగ్రత్త తీసుకున్నాడు. రచయితగా ఇరవై అయిదు సంవత్సరాలనుభవం వున్న నన్ను ఈ విషయం బాధించింది. మా నాన్నగారు సాహిత్య రచనను సీరియస్‌గా తీసుకోనందుకు ఆయన మీద కోప్పడాలని లేదు. ఆయన సీరియస్‌గా వ్రాసి వుంటే గొప్ప రచయిత అయివుండేవారు. అందువల్ల కూడా నేను ఆ సూట్‌కేస్‌ని తెరిచే ప్రయత్నం చెయ్యలేదు. ఒకవేళ మా నాన్నగారి సూట్‌కేస్‌లోంచి గొప్ప సాహిత్యం బయటపడితే మా నాన్నగారు చాలా ప్రత్యేకమైన వ్యక్తిగా నేను అంగీకరించాలి. ఈ వయసులో కూడా నాకు మా నాన్నగారు మా నాన్నగారిలాగే వుండాలనీ, రచయితగా కాదనీ నా కోరిక.

రచయిత ఓర్పుగా, సంవత్సరాలతరబడి, తనలోని రెండో వ్యక్తిని ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తాడు. రచన చేయడం అంటే మొదటగా నాకు స్ఫురించేది నవల, కవిత్వం, సాహితీ సాంప్రదాయంకాదు. అతడు తనగదిలో తలుపులు మూసుకుని ఒంటరిగా, తనలోకి చూసుకుని తనలోని నీడల్లోంచి పదాల సాయంతో ఒక కొత్త ప్రపంచాన్ని నిర్మించుకుంటాడు. ఈ మనిషి – పురుషుడుగాని, స్త్రీగాని, టైప్‌రైటర్ సాయంతో ఒక కవితనో, ఒక కాగితాన్నో, నేను ముప్ఫై సంవత్సరాలుగా చేస్తున్న పనిని చేస్తారు. వ్రాస్తున్నప్పుడు కాఫీనో, టీనో త్రాగుతాడు లేదా సిగరెట్లు కాలుస్తాడు. అప్పుడప్పుడు టేబుల్‌దగ్గర్నించి లేచి కిటికీలోంచి వీధిలో ఆడుకుంటున్న పిల్లల్ని, చెట్లని, నల్లగోడని చూస్తాడు. నాలాగే కవితలు, నాటకాలు, నవలలు వ్రాస్తాడు. ప్రధానమైన ఈ తేడాలన్నీ టేబిల్‌దగ్గర కూచుని, ఓర్పుగా తన లోపలికి చూసుకునేటప్పుడే వొస్తాయి. రచన చేయడం అంటే ఇలా లోపలికి చూసుకోవడాన్ని మాటల్లోకి మార్చడమే; తను సంచరించే ప్రపంచాన్ని చదవడమే; ఈ కార్యక్రమమంతటిని ఓర్పుతో, ఆనందంతో సాగించడమే. నేను నా టేబిలుముందు రోజులు, నెలలు, సంవత్సరాలు కూచుని, ఖాళీ పేజీమీద క్రొత్త పదాలను కూరుస్తూ ఒక క్రొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నట్టు, నాలోని రెండో వ్యక్తిని జీవితంలోకి తీసుకొస్తున్నట్టు భావించేవాణ్ణి. అలాచెయ్యడం ఒకదాని కొకటి రాళ్ళను పేర్చి ఒక వంతెననో, అర్చినో నిర్మిస్తున్నట్టుగా వుండేది. రచయితలు

**రచయిత ఓర్పుగా, సంవత్సరాలతరబడి, తనలోని రెండో వ్యక్తిని ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తాడు. రచన చేయడం అంటే మొదటగా నాకు స్ఫురించేది నవల, కవిత్వం, సాహితీ సాంప్రదాయంకాదు. అతడు తనగదిలో తలుపులు బిడాయించుక్కూచుని, ఒంటరిగా, తనలోకి చూసుకుని తనలోని నీడల్లోంచి పదాల సాయంతో ఒక కొత్త ప్రపంచాన్ని నిర్మించుకుంటాడు.**

నిర్మాణాత్మకంగా ఉపయోగించే పదాలే ఆరాళ్ళు. వాటిని చేతిలోకి తీసుకున్నప్పుడు వాటికి వొకదానితో మరొక దానికున్న సంబంధాన్ని గ్రహించుకుంటూ, దూరం నించి వాటిని గమనిస్తూ, కలంతోనో, వ్రేళ్ళ కొనలతోనో స్పృశిస్తూ, అనునయిస్తూ, తూస్తూ, కదిలిస్తూ, ఓర్పుతో, ఆశతో క్రొత్త ప్రపంచాన్ని సృజిస్తాం.

రచయిత రహస్యం ఉత్తేజం కాదు – అది ఎక్కణ్ణించి వొస్తుందో ఖచ్చితంగా తెలీదు. అతని స్థిరత్వం, ఓర్పు. టర్కీ భాషలో ఒక సామెత వుంది. సూదితో బావిని తవ్వడం – అని. దీన్ని రచయితల్ని దృష్టిలో పెట్టుకునే చెప్పి వుంటారు. పాతకథల్లో, తన ప్రేమకోసం, ఓర్పుతో పర్వతాలను తొలిచిన ఫెరాట్ కథంటే నాకిష్టం. అది నాకు బాగా అర్థమౌతుంది. నా నవల "మై నేమ్ ఈజ్ రెడ్"లో నేను పురాతన పర్షియన్ కళాకారులు అదే గుఱ్ఱాన్ని సంవత్సరాల తరబడి చిత్రించడాన్ని, ప్రతిచిన్నగీతను గుర్తుచేసుకోవడాన్ని, అందమైన గుఱ్ఱాన్ని కళ్ళుమూసుకుని చిత్రించడాన్ని హర్షించడంలో రచయిత వృత్తిని, నా జీవితాన్ని గురించే చెప్పానని నాకు తెలుసు. రచయిత తన కథని చెబుతున్నపుడు నెమ్మదిగా కథ యొక్క శక్తిని, తన అంతరంగంలోంచి ఉబికి వస్తున్న కథను టేబిల్ దగ్గర కూర్చుని, ఓర్పుగా, కళాత్మకంగా మలుస్తూ పోవాలి. కొందరిని తరచుగా, కొందరిని అప్పుడప్పుడు పలకరించే ఉత్తేజ దేవత ఎవరైతే స్థిరమైన నమ్మకంతో, ఆశతో వుంటారో వారినే వరిస్తుంది. అదీ రచయిత ఏకాంతంలో. తన ప్రయత్నాలను సందేహించు కుంటున్నప్పుడు, తనకలల్ని, తన రచనావిలువల్ని ప్రశ్నించుకుంటున్నప్పుడు, ఆ దేవత అతనికి కథల్ని, భావ చిత్రాల్ని ఆవిష్కరిస్తుంది. నా జీవితాన్నంతా అంకితంచేసుకున్న నా పుస్తకాలను గురించి ఆలోచించినపుడు, ఆ క్షణాలు, ఆ వాక్యాలు, కలలు, పేజీలు నాకిచ్చిన సంతోషాన్ని గుర్తుచేసుకున్నప్పుడు అవి కేవలం ఊహ. ప్రపంచంనించే గాక మరేదో శక్తి దయతో వాటిని నాకు ప్రసాదించినట్టనిపిస్తుంది.



ఒరాన్ పాము

మా నాన్నగారి సూట్‌కేస్‌లోని నోటు పుస్తకాల్ని తెరవడానికి ఎందుకు జంకానంటే ఆయనకి వీటన్నింటినీ భరించడం కష్టమనీ, ఆయనకు ఏకాంతమంటే ఇష్టం లేదనీ, తన మిత్రులతో, గుంపులతో, జోకులతో, గడపడమే యిష్టమనీ నాకు తెలుసు. తరువాత నా ఆలోచనలు వేరుగా రూపుదిద్దుకున్నాయి. రచయితగా నా జీవితాన్నించి, అనుభవాలనించి, లభించిన ఓర్పు, పరిత్యాగపు కలలు, నా అయిష్టతల నుండి వచ్చినవే. తమ చుట్టూ వున్న గుంపులు సంసారిక జీవితం, సరదాకబుర్లు వీటన్నిటిలో వుంటూ తెలివిగా వ్రాసిన రచయితలు చాలామంది వున్నారు. మేం చిన్నవాళ్ళంగా వున్నప్పుడు మా నాన్నగారు సంసారిక జీవితంతో విసిగిపోయినపుడు, పారిస్‌వెళ్ళి, ఇతర రచయితల్లాగే, హొటల్ గదిలో కూచుని నోటుపుస్తకాలను నింపుతూ వుండేవారు. వాటిలో కొన్ని ఆ సూట్‌కేస్‌లో వున్నాయని నాకు తెలుసు. మా నాన్నగారు అప్పటి విషయాలను నాతో ముచ్చటిస్తూ వుండేవారు. ఆయన పారిస్ ఫుట్‌పాత్‌లమీద నడుస్తూ వెళ్ళిన సార్త్రెని గురించి, తను చదివిన పుస్తకాలు, చూసిన సినిమాలు గురించి ఉత్సాహంగా చెప్పేవారు. నేను రచయిత నయ్యాక ఆయన ప్రపంచ ప్రసిద్ధ రచయితల్ని గురించి మాట్లాడేవారు. బహుశా నేను ఈ దృష్టితోనే ఆయన నోటు పుస్తకాలను చదవవలసి వుంటుంది. ఆయన పెద్ద గ్రంథాలయానికి నేను చాలా రుణపడ్డాను. నేను ఆయనతో కలిసి జీవిస్తున్నపుడు, నాలాగే మా నాన్న గారు కూడా, తన ఆలోచనలతో, పుస్తకాలతో ఏకాంతంగా ఆనందించేవారు.

మా నాన్నగారి సూట్‌కేస్‌ని చూస్తున్నప్పుడు నేనూ అలాగే చెయ్యలేకపోయాననిపించింది. అప్పుడప్పుడు మా నాన్నగారు తన పుస్తకాలముందు బల్లమీద చాచుకు పడుకుని ఆలోచనల్లోకి జారిపోయేవారు. అప్పుడాయన వేరుగా కనిపించేవారు. ఆయనలో ఏదో అసంతృప్తి గోచరించేది. ఇన్ని సంవత్సరాల తరువాత నాకు తెలుస్తోంది. ఆ అసంతృప్తే మనిషిని రచయితను చేస్తుంది. రచయిత అవ్వాలంటే కేవలం ఓర్పు, శ్రమ మాత్రమే చాలవు. గుంపుల్లోంచి, సహచరుల నుంచి, దైనందిన జీవితంనించి తప్పించుకుని, గదిలో ఒంటరిగా కూచోవాలని బలంగా అనిపించాలి. ఓర్పు, ఆశ, మన రచనలో లోతైన ప్రపంచాన్ని ఆవిష్కరించేందుకు దోహదం చేస్తాయి. కాని, ఒంటరిగా గదిలో కూచోవాలనే బలమైన తపన మనల్ని కార్యోన్ముఖుల్ని చేస్తుంది. ఇలా తన పుస్తకాలను చదువుకుంటూ, అంతర్వాణిని వింటూ, ఇతరుల పదాలతో విభేదిస్తూ, తన ఆలోచనా ప్రపంచాన్ని విస్తృత పరుచుకుంటూ 'మోన్‌టేన్' లాగా ఎదగాలి. మా నాన్నగారు తరచుగా 'మోన్‌టేన్'ని చదవడమే కాదు, నన్నూ చదవమని ప్రోత్సాహించేవారు. ప్రపంచ రచయితల కోవలో చేరిపోవాలనుకునే నాలాంటి వాళ్లు సమాజాన్నించి దూరంగా, తమ పుస్తకాలతో గదిలో ఒంటరిగా కూచోవాలి. సాహితీ సృజనకు అదే ప్రారంభం.

**మనకన్నా ముందు వేరే ప్రజల కథల్ని చెప్పినవారి పదాల, పుస్తకాల సమక్షంలో మనం వున్నామని అర్థమౌతుంది. దీన్నే మనం సాంప్రదాయం అంటాం. మానవ జాతి తననుతాను అర్థం చేసుకోవాలనే తపనతో చేసిన ప్రయత్నంలో పోగు చేసుకున్న విలువైన సంపదే సాహిత్యం. సంఘాలు, జాతులు, ప్రజలు తమ రచయితల బాధానుభవాలను భరించిన మాటలవల్ల జ్ఞానాన్ని పెంచుకుని వృద్ధి చెందుతారు.**

అలా గదిలో ఒంటరిగా కూచున్నాక మనం ఒంటరిగా లేమని అర్థమౌతుంది. మనకన్నా ముందు వేరే ప్రజల కథల్ని చెప్పినవారి పదాల, పుస్తకాల సమక్షంలో మనం వున్నామని అర్థమౌతుంది. దీన్నే మనం సాంప్రదాయం అంటాం. మానవజాతి తననుతాను అర్థం చేసుకోవాలనే తపనతో చేసిన ప్రయత్నంలో పోగు చేసుకున్న విలువైన సంపదే సాహిత్యం. సంఘాలు, జాతులు, ప్రజలు తమ రచయితల బాధానుభవాలను భరించిన మాటలవల్ల జ్ఞానాన్ని పెంచుకుని వృద్ధి చెందుతారు. పుస్తకాలను తగలబెట్టడం, రచయితల్ని హింసించడం చీకటికాలానికి సంకేతాలు. సాహిత్యం జాతీయతకు సంబంధించింది మాత్రమే కాదు. రచయిత తన గదిలో కూచుని ముందు తనలోపలికి ప్రయాణిస్తాడు. అప్పుడతనికి కలిగే గ్రహింపు ఏమంటే తన కథల్ని తాను ఇతరుల కథల్ని చెప్పినట్టే, ఇతరుల కథల్ని కూడా తన కథలాగే చెప్పాలి. సాహిత్యమంటే అదే. అయితే రచయిత ముందుగా ఇతరుల కథల్లోంచి, పుస్తకాల్లోంచి ప్రయాణించాలి.

మా నాన్నగారి గ్రంథాలయంలో 1500 పుస్తకాలుండేవి. నాకు ఇరవై రెండేళ్ళ వయస్సు వచ్చేసరికి ఆ పుస్తకాలన్నీ చదివాను. వాటిలో ఏవి అత్యంత ప్రాముఖ్యమైనవో, వేటిని తేలిగ్గా చదవాలో ఏవి క్లాసిక్స్, ఏవి విద్యార్జన కుపయోగపడతాయో, ఏవి మరిచిపోదగినవో, ఏవి సాహిత్య చరిత్రకు సంబంధించిన అవగాహన కల్పిస్తాయో; మా నాన్నగారికిష్టమైన ఫ్రెంచి రచయితలెవరో – అన్నీ అవగాహనలో కొచ్చాయి. మా నాన్నగారి గ్రంథాలయాన్ని చూస్తూ, ఏదో ఒక రోజు నేనూ నా స్వంత గ్రంథాలయాన్ని ఏర్పరుచు కోవడం, ఆ విధంగా నాదైన ప్రపంచాన్ని నిర్మించుకోవాలని భావించుకునేవాణ్ణి. మా నాన్నగారి గ్రంథాలయాన్ని చూసినప్పుడు ఒకచిన్న నిజమైన ప్రపంచం కళ్ళముందు మెదిలేది. ఆ ప్రపంచం మా ఇస్తాంబుల్ దృష్టిలోంచి చూసినది. మా గ్రంథాలయం దానికి సాక్ష్యం. మా నాన్నగారు విదేశీ పర్యటనలనుంచి, ముఖ్యంగా పారిస్, అమెరికాలనుంచి, విదేశీ పుస్తకాల షాపులనుంచి సేకరించారు. మా ప్రపంచం ప్రాంతీయ, జాతీయ, పాశ్చాత్యాల కలయిక. 1970ల నుంచీ నేనూ నా లైబ్రరీని నిర్మించుకోవడం ప్రారంభించాను. మా నాన్నగారు మాసిపోయిన, దుమ్ముకొట్టుకున్న మూలలవేళ్ళాడే పాత పుస్తకాలు నాకిచ్చారు. అవన్నీ ఇస్తాంబుల్ పాతపుస్తకాల షాపులనుంచి సంపాదించినదే. రోడ్లప్రక్కన, మసీదు గోడల ప్రక్కన, గోడల నీడల్లో వుండే ఆ పుస్తకాల షాపుల్ని తలుచుకుంటే జాలివేస్తుంది. చిరిగిన దుస్తుల్లో, విచారగ్రస్తంగా కనిపించే వాళ్ళ ముఖాలు దయనీయంగా వుంటాయి.

ఇక ప్రపంచంలో నా స్థానం గురించి – జీవితంలోను, సాహిత్యంలోను – నేను ప్రధానమైన రచయిత ననుకోవడం లేదు. మన జీవితాలకన్న గొప్పదీ, అద్భుతమైనవీ అయిన

జీవితం వుంది. నేను దానికి బయటే వున్నాను. సాహిత్యపరంగానూ అంతే. నా ఉద్దేశ్యంలో మన టర్కుల స్థితి అది. మా నాన్నగారి లైబ్రరీయే ఇందుకు సాక్ష్యం. దాంట్లో ఓ చివర ఇస్తాంబుల్ పుస్తకాలు, అంటే మన సాహిత్యం, అంటే మా ప్రపంచం; మరో చివర పాశ్చాత్య ప్రపంచానికి చెందినదీ, మా ప్రపంచంతో పోలిక లేనివీను. వ్రాయడం, చదవడం ఒక ప్రపంచాన్ని వొదిలి వేరే ప్రపంచము వేరే తనాన్ని తెలుసుకోవడం. మా నాన్నగారు ఈ ప్రపంచాన్నుంచి తప్పించుకుని పాశ్చాత్య ప్రపంచంలోకి పారిపోయేందుకు పుస్తకాలు చదివేవారనిపిస్తుంది. ఆ రోజుల్లో మా సంస్కృతినుంచి పారిపోవడానికి మేము పుస్తకాలు చదివే వాళ్ళం. చదవడమేకాదు, రచన చేయడమూ అందుకే. తన నోటుపుస్తకాల్ని నింపేందుకు నాన్నగారు పారిస్ వెళ్ళి, గదిలో ఒంటరిగా కూచుని, వ్రాసి, టర్కీకి తీసుకొచ్చేవారు. ఇరవై అయిదు సంవత్సరాలపాటు టర్కీలో రచయితగా జీవించడానికి చాలా శ్రమపడ్డాను. మా నాన్నగారి సూట్‌కేస్ రచన అనేది రహస్యంగా సంఘం కళ్ళకు దూరంగా చెయ్యవలసినవని అని గుర్తుచేస్తుంది. అందువల్లనేనేమో మా నాన్నగారు సాహిత్యాన్ని, నాలాగ, సీరియస్‌గా తీసుకోలేదని కోపం వొస్తుంది.



పురస్కార స్వీకారం

మా నాన్నగారిమీద కోపం ఎందుకంటే, ఆయన నాలాగ జీవించలేదనీ, జీవితంలో తగవుపడలేదనీ; తన మిత్రులతో, తను ప్రేమించిన వారితో నవ్వుతూ సంతోషంగా గడిపేశారనీను. అప్పుడప్పుడు అసలు సంతోషమంటే ఏమిటి? గదిలో ఒంటరిగా కూచుని ఆలోచిస్తూ సీరియస్‌గా జీవించడమా? సంఘంలో అందరిలాగ సంతోషంగా బతకడమా? ఒంటరిగా కూచుని, రహస్యంగా వ్రాస్తూ, అందరితో జీవిస్తున్నట్టే అనుకోవడమా? – ఈ ప్రశ్నలన్నీ కోపంతో వేసుకునేవే. ప్రతి వొక్కరూ జీవితానికి ముఖ్యమైంది సంతోషమేనన్నట్టు ప్రవర్తిస్తుంటారు. మానాన్నగారు తనకుటుంబాన్నుంచి ఎన్నోసార్లు పారిపోవడాన్ని నేనర్థం చేసుకోగలిగానా?

మొదటిసారిగా మానాన్నగారి సూట్‌కేస్‌ను తెరిచినపుడు ఇలాంటి ఆలోచనలు వొచ్చాయి. మా నాన్నగారికి ఏదైనా రహస్యం వుందా? నాకర్థంకాని విషాదం ఏదో ఆయనజీవితంలో వుందా? అందులోంచి బైటపడడానికే ఆయన వ్రాసేవారా? ఆయన సూట్‌కేస్‌ను తెరవగానే ఆయన ప్రయాణాలు మనసులో మెదిలాయి. ఆయన నోటు పుస్తకాలు గుర్తించాను. అవి కొన్నిసంవత్సరాల క్రితం ఆయన నాకు చూపినవే. వాటిలో చాలా వరకు యువకుడిగా ఆయన పారిస్ వెళ్ళినపుడు వ్రాసినవే. నేను మాత్రం నా అభిమాన రచయితల్లాగే, మా నాన్నగారేం వ్రాశారో తెలుసుకోవాలని, ఆయన ఎలా ఆలోచించేవారో గ్రహించు కోవాలని తపనపడ్డాను. మా నాన్నగారి పుస్తకాల్లో నాకు రచయిత గొంతు దొరికింది. అది ఆయన గొంతుకాదు; అది అధికారికంగా లేదు, అది మా నాన్నగారి గొంతు కానేకాదు అనిపించింది. వ్రాస్తున్నప్పుడు ఆయన మా నాన్నగారుకాదు. అందులో నాక్కావలసింది దొరకదేమోననే భయం. ఆయన మీద ఆయన అభిమాన రచయితల ప్రభావమే ఎక్కువగా వుంటుందని జంకాను. రచయితగా నా మొదటి పది సంవత్సరాల్లో ఇలాంటి సందేహాలతోనే ఘర్షణపడ్డాను. వాటిని జయించుకున్నాను. ఎప్పుడో వొకరోజు, నేను చిత్రలేఖనాన్ని వొదిలేసినట్టుగా, నవలా రచనను కూడా వొదిలేసి, ఓటమి నంగీకరించాల్సి వొస్తుందేమోనని భయపడ్డాను.

ఈ భయాలన్నీ నా పఠనాన్నీ, రచననూ సంవత్సరాల తరబడి నన్ను అయోమయానికి గురిచేశాయి. పుస్తకాలు

వ్రాస్తూ నేనీ సమస్యల్ని అర్థం చేసుకోగలిగాను. రచయితగా వుండడం అంటే మనలోని రహస్యమైన గాయాలను అంగీకరించుకోవడమే; వాటిని ఓర్పుతో గుర్తించుకోవడమే; అర్థం చేసుకోవడమే; వాటిని మన రచనలో భాగం చేసుకోవడమే.

రచయిత ప్రతివొక్కరూ ఎరిగిన విషయాలను వారికి తెలియదనుకుని వాటి గురించి వ్రాస్తాడు. ఈ విషయాన్ని గ్రహించుకోవడం ఆనందదాయకంగా వుంటుంది. పాఠకుడు తనకు తెలిసిన విచిత్ర ప్రపంచాన్ని దర్శిస్తాడు. రచయిత సంవత్సరాల తరబడి తనగదిలో ఒంటరిగా కూచుని, ఆ ప్రపంచాన్ని సృజిస్తూ, తన రహస్యగాయాలతో ప్రారంభించి, మానవతమీద గొప్ప నమ్మకంతో తన కార్యక్రమాన్ని నిర్వర్తిస్తాడు. మనుషులందరికీ వొకరికొకరికి పోలికలుంటాయి. వాళ్ళు నాలాగే తమ గాయాలను మోస్తూ తిరుగుతుంటారు. అందుచేత వాళ్ళు బాగా అర్థం చేసుకుంటారు. నిజమైన సాహిత్యమంతా ఈ బాల్యచేష్ట, ఈ పోలికలోంచే ఉద్భవిస్తుంది. రచయిత సంవత్సరాలతరబడి తన గదిలో కూచుని, ఈ కదలికతోనే ఒకే మానవతను, కేంద్రబిందువులేని ప్రపంచాన్ని ప్రతిపాదిస్తాడు.


రచయిత ప్రతివొక్కరూ ఎరిగిన విషయాలను వారికి తెలియదనుకుని వాటి గురించి వ్రాస్తాడు. ఈ విషయాన్ని గ్రహించు కోవడం ఆనందదాయకంగా వుంటుంది. పాఠకుడు తనకు తెలిసిన విచిత్ర ప్రపంచాన్ని దర్శిస్తాడు. రచయిత సంవత్సరాల తరబడి తనగదిలో ఒంటరిగా కూచుని, ఆ ప్రపంచాన్ని సృజిస్తూ, తన రహస్యగాయాలతో ప్రారంభించి, మానవతమీద గొప్ప నమ్మకంతో తన కార్యక్రమాన్ని నిర్వర్తిసాడు.

మా నాన్నగారి సూట్‌కేస్ ద్వారా ఇస్తాంబుల్‌లో పారిపోయిన మన జీవితపు రంగుల్ని చూసినపుడు ఈ ప్రపంచానికో కేంద్రబిందువు వున్నదనీ, అది మనకు చాలా దూరంలో వున్నదనీ అనిపిస్తుంది. నా పుస్తకాల్లో ఈ విషయం కొంతవరకు వివరించబడింది. నా అనుభవం నాకు చెప్పిందేమంటే – ఈ భూమ్మీద అధిక సంఖ్యాకులు ఇవే భావనలతో జీవిస్తున్నారు. వారిలో చాలా మంది అసంతృప్తితో, హీనతాభావనతో, అభద్రతాభావంతో జీవిస్తున్నారు. మానవజాతి ఎదుర్కొంటున్న భయంకరమైన సందేహాలు – స్వంతయిల్లు, భూమిలేకపోవడం, ఆకలి, సాహిత్యం కన్నా మీడియా ఈ ప్రాథమిక సమస్యల్ని త్వరగా తెలియజేస్తోంది. ప్రస్తుత సాహిత్యం మానవజాతి ఎదుర్కొంటున్న ఈ భయాలు వొదిలి వేయబడడం, అర్థంలేని లెక్కలు, పనికిమాలినతనం, హీనపరచడం, బాధలు, సున్నితత్వాలు, ఊహాజనితమైన హీనతలు, జాతీయ బడాయి కోరుతనాలు, ఆర్థిక సమస్యలు – ఇవన్నీ నాలోని చీకటిని స్పృశిస్తాయి. మనం పాశ్చాత్య ప్రపంచపు బైట వున్న ప్రజలు, ప్రజాసమూహాలు, దేశాలు ఈ భయాలతో వున్నాయని గ్రహించాం. పాశ్చాత్య దేశాల్లో కొన్ని తమసంపద, తాము తెచ్చిన సాంస్కృతిక పునరుజ్జీవం, జ్ఞానదృష్టి, ఆధునికత మొదలైన వాటిని గురించి సంతృప్తి పడడం కూడా మూర్ఖత్వమే.

మా నాన్నగారే కాదు, మనమంతా ప్రపంచపు కేంద్రానికి చాలా ప్రాధాన్యతనిస్తున్నామని అర్థమౌతుంది. మనల్ని గదిలో సంవత్సరాలతరబడి వొంటరిగా కూచోబెట్టి వ్రాయించే విశ్వాసం, మన రచనలు అందరూ చదువుతారని, అర్థమౌతాయని, ప్రపంచ ప్రజలందరికీ పోలిక లున్నాయని విశ్వసింప జేస్తుంది. మా నాన్నగారి, నా రచనల ద్వారా నాకూ తెలిసిందేమంటే, ఇదొక బాధా సమన్వితమైన ఆశావాదం. తన జీవితకాలమంతా పాశ్చాత్య ప్రపంచం మీద డోస్టవస్కీకి కలిగిన ప్రేమ, ద్వేషం, అసహ్యం నాకూ కలిగాయి. డోస్టవస్కీకున్న ఈ ప్రేమ – ద్వేష బంధంతో నేనూ ఈ పాశ్చాత్య ప్రపంచంలో తిరిగాను; ఆయన నిర్మించిన వేరే ప్రపంచాన్ని చూశాను.

రచనకు జీవితాన్ని అంకితం చేసుకున్న రచయితలందరికీ ఈ నిజం తెలుసు. మన అసలైన ప్రయోజనం యేదైనప్పటికి మనం సంవత్సరాలతరబడి సృష్టించిన ప్రపంచం చివరికి ఇతర ప్రదేశాలకు వెడుతుంది. అది మనల్ని మన విచారంతో, కోపంతో పని చేసిన మన టేబిల్ దగ్గర్నించి దూరంగా, ఆవలివైపున వున్న విచారం, కోప ప్రపంచంలోకి తీసుకెడుతుంది. మా నాన్నగారు అలాంటి ప్రపంచాన్ని చేరుకోలేక పోయారా? సముద్ర ప్రయాణంలోంచి, పొగమంచులోంచి మనం చేరుకునే ద్వీపంలాగ ఆ ప్రపంచం మనల్ని మైమరపింపజేస్తుంది. ప్రయాణం పూర్తయ్యాక ఆశ,

కుతూహలం కలుగుతాయి. మనముందు మసీదులతో, మినార్లతో, వీధులు, కొండలు, వంతెనలు, లోయలున్న ఒక ప్రపంచం మనకళ్ళముందు ఆవిష్కృత మౌతుంది. దాన్ని చూసి, ఆ ప్రపంచంలోకి వెళ్ళిపోయి, మనల్ని మనం మర్చిపోవా లనుకుంటాం. ఒక పుస్తకాన్ని టేబిల్ దగ్గర కూచుని చదువుతున్నపుడు ఇలాంటి ప్రపంచాన్నే భావించుకుంటాం.



నా బాల్యంలో, యౌవనంలో నేను భావించుకున్న దానికి ప్రస్తుతపు నా భావన వ్యతిరేకమైనది. అది – ఈ ప్రపంచానికి కేంద్రబిందువు ఇస్తాంబుల్. నేను జీవితకాలమంతా అక్కడే నివసించినందువల్ల అలా భావించుకోవడం లేదు. గత ముప్పై మూడేళ్ళుగా ఈ పట్టణపు వీధుల్ని, వంతెనల్ని, ప్రజల్ని, కుక్కల్ని, ఇళ్ళని, మసీదుల్ని, జలవనరుల్ని, విచిత్రమైన హీరోల్ని, అంగళ్ళుని, గొప్ప వ్యక్తిత్వాలని, చీకటి ప్రదేశాలని, పగళ్ళని, రాత్రుల్ని – నాలో భాగంగా చేసుకుని, ఆలింగనం చేసుకుని, వర్ణించుకున్నాను. నా అలోచనలు, ఊహల్లోని ఈ ప్రపంచం నేను నా స్వహస్తాలతో నిర్మించుకున్నది. అది నేను నివసించిన పట్టణం కన్నా నిజమైనది. ఆ ప్రజలు, వీధులు, కట్టడాలు వాటితో అవి సంభాషించుకుంటున్నపుడు, నా పుస్తకాల్లోనూ, భావనా ప్రపంచంలోను అవి జీవించినపుడు కాక, వాటికవే జీవించినపుడు, నాకలా అనిపిస్తుంది. ఈ ప్రపంచం నేను సృజించిన ప్రపంచం సూదితో వొక మనిషి తవ్విన బావిలాగ, అత్యంత సహజమైంది.

మా నాన్నగారు కూడ ఇలాగే తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ ఇలాంటి సంతోషాన్నే పొంది వుంటారు. ఆయన్ని నేను అపార్థం చేసుకోకూడదు. ఆయనకు నేనెల్లప్పుడూ కృతజ్ఞుడనై వుండాలి. ఆయన ఎప్పుడూ ఆజ్ఞాపించడం, చేయకూడదని చెప్పడం, పెత్తనం చెలాయించడం, శిక్షించడం చేయలేదు. ఆయన నాకు సంపూర్ణమైన స్వేచ్ఛనిచ్చారు, గౌరవించారు. నా బాల్యంనుంచీ, నా యితర మిత్రుల్లాగ, నాకు మా నాన్నగారంటే భయంలేదు. నాలాగే యౌవనదశలో మా నాన్నగారు కూడా రచయితనవ్వాలని అనుకునివుంటారు. మా నాన్నగారు హొటల్ గదుల్లో ఒంటరిగా కూచుని వ్రాసిన నోటుపుస్తకాల్ని, అందుకే, ఓర్పుతో చదివి అర్థం చేసుకోవాలి.

ఇలాంటి ఆలోచనలతోనే నేను మా నాన్నగారి సూట్‌కేస్ దగ్గరికి వెళ్ళాను. దానిలోని నోటుపుస్తకాల్ని వ్రాత ప్రతుల్ని కొన్నింటిని చదివాను. మా నాన్నగారు వేటిని గురించి వ్రాశారు? ఆ హొటల్ గదుల కిటికీల్లోంచి కొన్ని కవితలు, సమీక్షలు, విమర్శల్ని చూశాను. నేను వ్రాసేప్పుడు ట్రాఫిక్ యాక్సిడెంట్లో చిక్కుకున్నట్టు, అదంతా ఎలా జరిగిందో? గుర్తుచేసు కోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నట్టు, మరీ యెక్కువగా గుర్తొస్తుందేమోనని భయపడు తున్నట్టు అనుభూతి కలిగింది. నా బాల్యంలో అమ్మ, నాన్న పోట్లాడుకోబోతున్నపుడు భయంకరమైన నిశ్శబ్దంలో ఇద్దరూ మునిగివున్నప్పుడు, మా నాన్నగారు వెంటనే రేడియో పెట్టేవారు. ఆ స్థితిని సంగీతం మార్చివేసేది.

ఆ సంగీతం లాంటి మాటలతో ఇప్పటి యీ పరిస్థితిని మార్చే ప్రయత్నం చేస్తాను. మన రచయితలందరికీ ఎప్పుడూ ఎదురయ్యే ప్రశ్న – "మీ రెందుకు వ్రాస్తారు?" వ్రాయాలనే తపన నాలో వుంది కాబట్టి వ్రాస్తాను. నేను రచనతప్ప మామూలు మనుషులు చేసే పనులు చెయ్యలేను. నేను ఎందరో నా లాంటి రచయితలు వ్రాసిన పుస్తకాలు చదువుతాను కాబట్టి వ్రాస్తాను. నాకు ప్రతి వొక్కరిమీద, అందరిమీద కోపం, అందుకే వ్రాస్తాను. నా గదిలో రోజంతా ఒంటరిగా కూచుని వ్రాసుకోవడాన్ని ప్రేమిస్తాను. అందుకే వ్రాస్తాను. నిజజీవితాన్ని మార్చే ప్రయత్నంలో పాలుపంచుకోవడం కోసం వ్రాస్తాను. ప్రపంచంలోని మనుషులందరూ వాళ్ళు జీవిస్తున్న జీవితాన్ని అర్థం చేసుకోవాలి. అందుకోసం నేను వ్రాస్తాను. పేపరు, పెన్ను, సిరా వాసనల్ని ప్రేమిస్తాను, అందుకే వ్రాస్తాను. సాహిత్యాన్ని విశ్వసిస్తాను, నవలారచనను విపరీతంగా అభిమానిస్తాను, అందుకే వ్రాస్తాను. వ్రాయడం నా అలవాటు, తపన. నన్ను అందరూ మరిచిపోతారేమోనని భయం, అందుకే వ్రాస్తాను. రచన ఇష్టాన్నీ, గొప్పతనాన్నీ తీసుకొస్తుంది, అందుకే వ్రాస్తాను. నాకు ఏకాంతం యిష్టం, అందుకే వ్రాస్తాను. నాకు

ప్రతివొక్కరిమీద, అందరిమీద కోపం. నా కోపాన్ని అర్థం చేసుకుంటారనే వ్రాస్తాను. నన్ను అందరూ చదవాలని ఆశిస్తాను, అందుకే వ్రాస్తాను. ప్రతి వొక్కరూ నేను వ్రాయాలని అభిలషిస్తారు, అందుకే వ్రాస్తాను. బాల్య చేష్టలాంటి నమ్మకం నాకొకటుంది. గ్రంథాలయాలు శాశ్వతంగా జీవించి వుంటాయని, వాటి అరల్లో నా పుస్తకాలు స్థిరంగా కూచునివుంటాయని, అందుకే వ్రాస్తాను. జీవితపు అందాలను, గొప్ప నిండుతనాలను మాటల్లోకి మార్చడంలో గొప్ప ఆనందంవుంది, అందుకే వ్రాస్తాను. నేను కథను చెప్పను, అల్లుతాను, అందుకే వ్రాస్తాను. కలలోలాగ, నేను చేరవలసిన గమ్యం వొకటుంది. ఆ గమ్యానికి పారిపోవాలని వుంటుంది, అందుకే వ్రాస్తాను. సంతోషంగా వుండడం ఎలాగో నాకు తెలీదు, అందుకే వ్రాస్తాను. సంతోషంగా వుండానికి నేను వ్రాస్తాను.

తన సూట్‌కేస్‌ని నా దగ్గర వొదిలి వెళ్ళడానికి నా ఆఫీసుకు వొచ్చిన వొకవారం తరువాత మా నాన్న మళ్ళీ వొకసారి నా దగ్గరికి వొస్తూ ఒక బార్ చాకొలేట్ తీసుకొచ్చారు (నాకు 48 సంవత్సరాలని ఆయన మరిచిపోయినట్టున్నారు!). మామూలుగానే జీవితాన్ని గురించి, రాజకీయాల్ని గురించి, కుటుంబపు గొడవల గురించి కబుర్లు చెప్పారు. ఒక్క క్షణం తను సూట్‌కేస్‌ని వుంచిన మూలవేపు కళ్ళు తిప్పి, నేను సూట్‌కేస్‌ను కదిపిన సంగతిని గుర్తించారు. ఒకరి కళ్ళలోకి వొకరం చూసుకున్నాం. నిశ్శబ్దం ఆవహించింది. సూట్‌కేస్‌ని తెరిచి అందులోని విషయాల్ని చదివే ప్రయత్నం చేశానని ఆయనతో చెప్పలేదు. ఆయనకర్థమయింది. ఇదంతా కొద్ది క్షణాలవ్యవహారమే. మా నాన్నగారిది అన్నిటినీ తేలిగ్గా తీసుకునే తత్వం. ఆయన ఎప్పటిలాగే ఓ చిరునవ్వు నవ్వారు. ఎప్పటిలాగే ఒక తండ్రిగా, ఇంటినించి వెడుతూ ప్రేమగా, ప్రోత్సాహకరంగా మాట్లాడారు.

ఎప్పటిలాగే ఆయన సంతోషానికి ఈర్ష్యపడుతూ ఆయన్ని గమనించాను. ఆ రోజు నాలో ఏదో ఆనందశకలం దోబూచులాడి నన్ను సిగ్గుపడేట్టు చేసింది. ఆయనలాగా జీవితంలో నేను సౌఖ్యంగా లేననే ఆలోచన, నా జీవితాన్ని రచనకు అంకితం చేసుకున్నాననే ఆలోచన అందుకు కారణం కావొచ్చు. నన్ను బాధించని మా నాన్న నాకు సంపూర్ణమైన స్వేచ్ఛనిచ్చారు. ఇదంతా మనకేం గుర్తుచేస్తోందంటే సాహిత్యము, రచన ఒకనదానితో వొకటి ముడిపడి వుంటాయి. మన జీవన కేంద్రంలోని సంతోషం న్యూనతాభావనల లోపాలతో అనుసంధింపబడి వుంటాయి.

మా నాన్నగారు తన సూట్‌కేస్‌ని నాకు అప్పగించటానికి ఇరవై మూడు సంవత్సరాల ముందు, ఇరవై రెండు సంత్సరాల వయసులో నవలా రచయితను కావడానికి, అన్నింటినీ త్యజించి ఒంటరిగా గదిలో కూచోవాలని నిర్ణయించు కున్నప్పుడు నేను నా మొదటి నవల పూర్తిచేశాను. వొణుకుతున్న చేతులతో, ఆయన అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు నా అచ్చుకాని నవల టైపు కాపీని మా నాన్నగారికిచ్చారు. ఆయన మేధా సంపత్తిమీద, అభిరుచి మీద నమ్మకంతో నేనలా చేయలేదు. మా అమ్మగారిలా కాక, నేను రచయితనవ్వడాన్ని వ్యతిరేకించినందుకు అలా చేశాను. అప్పుడు మా నాన్నగారు మాతో లేరు, చాలా దూరాన వున్నారు. ఆయన రాకకోసం అశాంతితో ఎదురుచూశాను. రెండు వారాల తరువాత, ఆయన వొచ్చాక, ఆయనకోసం తలుపు తెరిచేందుకు ఆత్రుతగా పరిగెత్తాను. మా నాన్నగారు ఏమీ చెప్పలేదు. నన్ను గట్టిగా కౌగిలించుకొని నా రచన తమకు నచ్చినట్టు కౌగిలింతద్వారా తెలియజేశారు. గొప్ప భావావేశంలో మేమిద్దరం కొద్దిసేపు మౌనంగా వున్నాం. మళ్ళీ మామూలు ప్రపంచంలోకి వొచ్చి, మాట్లాడటం మొదలుపెట్టాక, నా మొదటినవలను గురించి గొప్ప పొగడ్తలతో నా మీద తమకున్న విశ్వాసాన్ని వెలిబుచ్చారు. నాకు ఎప్పుడో అప్పుడు తప్పక నోబెల్ పురస్కారం వొచ్చి తీరుతుందన్నారు.

ఆయన అలా అనడం నాకు నమ్మకం కలిగించడానికో లేదా పురస్కార సాధన ఒక గమ్యంగా నిర్ణయించుకోమని చెప్పడానికో కాదు. ఒక టర్కీదేశపు తండ్రిలాగ తనకుమారుడికి మద్దతునివ్వడం, ఉత్తేజితుణ్ణి చెయ్యడంతో బాటు, "ఎప్పుడో ఒక రోజు నువ్వు 'పాషా' వొతావు" అన్నారు. సంవత్సరాల తరబడి, నన్ను చూసినప్పుడల్లా అలానే అనేవారు. మా నాన్నగారు 2002 డిసెంబరులో చనిపోయారు.

ఈ రోజు నేను స్వీడిష్ అకాడెమీకి చెందిన అంత్యత గౌరవనీయ సభ్యుల సమక్షంలో ఈ అత్యున్నత పురస్కారాన్ని వారి చేతులమీదుగా స్వీకరించేందుకు నిలుచున్నప్పుడు మా నాన్నగారు కూడా మన మధ్యే వున్నారని నేను భావించు కుంటున్నాను.



# ఒక టిబెట్ అమ్మాయి కలల కవిత్వం

- దిలావర్

ప్రపంచంలోని అనేక దేశాలు అగ్రదేశ బాధిత దేశాలే. టిబెట్ మాత్రం చైనా బాధితదేశం!

ఆ టిబెట్ సంతతికి చెందిన త్సేరింగ్ వాంగ్మో థోంపా ఇండియాలోనూ, నేపాల్‌లోనూ పెరిగి పెద్దదయింది. ప్రస్తుతం ఆమె అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో నివసిస్తున్నది. థోంపా మసాచ్యుసెట్స్ యూనివర్సిటీనుండి ఎమ్.ఎ. డిగ్రీ పుచ్చుకుంది. సృజనాత్మక రచనా వ్యాసంగంలో శానోఫ్రాన్సిస్కో స్టేట్ యూనవర్సిటీ నుండి ఎమ్.ఎఫ్.ఎ. పట్టా స్వీకరించింది. 2002లో 'Rules of the House' అన్న కవితా సంపుటి ప్రచురించింది. అంతకుముందు Chap books (కథలూ, గాథలూ పాటలున్న చిన్న చిన్న పుస్తకాలు) ప్రచురించింది. అట్లాంటా రివ్యూ, బోస్టన్ రివ్యూ, మిడ్ అమెరికన్ రివ్యూ, జిజియా రివ్యూ మొదలగు వాటిలో ఆమె రచనలు ప్రచురింప బడుతున్నాయి.

ఏ దేశమేగినా ఎందు కాలిడినా తన మాతృదేశాన్ని మరచిపోని కవయిత్రి థోంపా. తను ఎక్కడ్నుంచి వచ్చిందో ఆ నేలను, తన పూర్వీకులను, తన మూలాలను, తన దేశానికి చెందిన యిసుక, రాళ్ళు, చెట్లూ, వాటికి అల్లుకున్న తీగలూ, రెల్లు పూపొదలు, పక్షులు ... నదులు, కొండలు, జంతువులు, మొక్కలు .... వాటితోపాటు తను పవిత్రంగా ఆరాధించే బౌద్ధ మతం, మత సంప్రదాయాలూ, తమ సంస్కృతి....దేనినీ విడిచి పెట్టకుండా మక్కువతో తన కవిత్వానికి వస్తువులుగా మలచుకుంది థోంపా. వీలు చిక్కినప్పుడల్లా టిబెట్ స్వాతంత్ర్యం పట్ల తన ప్రగాఢ వాంఛను వెల్లడిస్తుంది. వలస పక్షుల దయనీయబతుకుల్ని ఆర్ద్రంగా అక్షరీకరిస్తుంది.

టిబెటన్లు బౌద్ధమతాన్ని ప్రాణప్రదంగా చూసుకుంటారు. చిత్రమేమిటంటే ఆ బౌద్ధమతం చైనానుండే టిబెట్‌కు వ్యాపించింది. టిబెట్ చరిత్రలోనే గొప్ప కీర్తి ప్రతిష్ఠ లార్జించిన రాజు సాంగ్‌త్సేవ్ గ్యాంపో. ఆ రాజు క్రీ.శ. 617 నుండి 650 వరకు టిబెట్‌ను పరిపాలించాడు. ఆ సమయంలో చైనాలో సుయి సామ్రాజ్యం అంతరించింది. ట్యాంగో రాజుల పాలన మొదలయింది. ట్యాంగ్ రాజుల ఆడపడుచు 'వెన్ చెంగ్' గొప్ప సౌందర్యవతి. ఆ విషయం మెల్లగా గ్యాంపో చెవిన పడింది. వెనీ చెంగ్‌ను తాను పెళ్ళాడుతానని ట్యాంగ్ రాజులను కోరాడు గ్యాంపో. వారు అందుకు నిరాకరించారు. యుద్ధానికి సన్నద్ధం కావాలని గ్యాంపో హెచ్చరించాడు. ట్యాంగో రాజులు భయపడి వెన్‌చెంగ్‌ను గ్యాంపోకిచ్చి పెళ్ళి చేశారు. టిబెట్ రాజుతో కాపురానికొచ్చిన చీనీ యువరాణి తనవెంట బుద్ధవిగ్రహాన్ని తీసుకొచ్చింది. ఆ విధంగా టిబెట్‌లోనికి తొలిసారిగా బుద్ధుని ఆగమనం జరిగింది.

కాలక్రమేణా టిబెట్, చైనాల మధ్య బలసమీకరణలు తారుమారు కాజొచ్చాయి. టిబెట్, చైనాల మధ్య క్రీ.శ. 7వ శతాబ్దంలోనే మొదటి యుద్ధం జరిగింది. 755 నాటికి టిబెట్‌లోని చాలా భూభాగాలను చైనా ఆక్రమించుకుంది. 763లో టిబెట్ రాజు సాంగ్‌త్సేవ్ మనవడు ట్రైసాంగ్ డెంట్‌సన్ చైనామీద దండెత్తాడు. ట్యాంగ్ రాజులను పరాజయంపాలు చేసి వారి రాజధానిని కైవసం చేసుకున్నాడు. ఈసారికూడా ట్యాంగ్ రాజులు తమ వంశానికి చెందిన మరో రాచకన్యను టిబెట్ రాజుకిచ్చి పెళ్ళి చేయవలసి వచ్చింది.

ట్రైసాంగ్ డెంట్‌సన్ హయాంలోనే అధికారిక మతంగా బౌద్ధమతం ప్రకటింపబడింది. టిబెట్‌లో బౌద్ధమత వ్యాప్తిని రాచరిక వ్యవస్థ అన్నివిధాలా ప్రోత్సహించింది. బౌద్ధమతాన్ని అప్రతిహతంగా దేశమంతటా వ్యాపింప జేయడంలో ట్రైసాంగ్

డా. దిలావర్, ఫోన్ : 9866923294

సఫీలీకృతుడయ్యాడు. ఆ తరువాత 'న్యాత్రి' వంశం టిబెట్‌లో రాజ్యపాలన ప్రారంభించింది. న్యాత్రివంశంలో ప్రఖ్యాతి పొందినవాడు దర్మాలాంగ్ దర్మా. అతడు బౌద్ధమత వ్యాప్తిని నిరోధించడానికి శాయశక్తులా ప్రయత్నించాడు. అది సహించలేని ఓ బౌద్ధ సన్యాసి దర్మాను హత్య చేశాడు. అంతటితో న్యాత్రివంశం అంతరించింది.

ఆ తరువాత చరిత్రలో చాలా పరిణామాలు చోటు చేసుకున్నాయి. మంగోలు వీరుడు చెంఘీజ్ ఖాన్ అరివీర భయంకరుడై చైనాను జయించాడు. చైనాలో యువాన్ల పాలన మొదలయింది. ఆ సమయంలో టిబెట్‌ను పాలించే రాజు లేక దేశం సంక్షోభంలో చిక్కుకుంది. అన్ని వ్యవహారాలను మతాధిపతులే చూసుకోవలసి వచ్చింది. టిబెట్‌లో స్థావరం ఏర్పరచుకున్న యువాన్లకు హితబోధ చేస్తూ మతగురువులు ప్రముఖ పాత్ర వహించారు. క్రీ.శ. 1358 తరువాత యువాన్ల శకం అంతరించింది. మింగ్ రాజులు చైనాలో తమ పరిపాలన ప్రారంభించారు. టిబెట్‌తో సహా మంగోలు తండాలు, వారి రాజ్యాలన్నీ తమ పాలన కిందికే వస్తాయని ప్రకటించారు మింగ్ రాజులు. ఆ తరువాత వచ్చిన క్వింగ్ రాజుల హయాంలో టిబెట్ బౌద్ధ సన్యాసుల రాజ్యమయింది. దలైలామా క్రీ.శ. 1750 తరువాత మత, రాజకీయ, సాంఘిక, న్యాయాల సర్వాధికారి అయ్యాడు. ఆ కాలంలోనే టిబెట్ సైన్యం తన దేశంలోని చైనా వారిపై అనూహ్యదాడులు ప్రారంభించింది. 1913లో టిబెట్, మంగోలియాలు పరస్పరం తమ స్వాతంత్ర్యాన్ని గుర్తించుకుంటున్నట్టు ప్రకటించు కున్నాయి.

అంతటితో వ్యవహారం అంతం కాలేదు. టిబెట్, చైనాల మధ్య వివాదం ముదురుతూనే వుంది. సమస్య అంతకంతకూ తీవ్రతరమైంది. 1959 మార్చి 1న చైనా సైనికాధికారులు దలైలామాను బంధించాలన్న వ్యూహంతో టిబెట్‌లోకి ప్రవేశించారు. చైనా ఆకాంక్షను ప్రతిఘటిస్తూ వేలాది టిబెటన్లు 'లాసా'కు చేరుకున్నారు. టిబెటన్ల తిరుగుబాటును ఉక్కు పాదంతో అణచి వేసింది చైనా. 17 మార్చి 1959లో దలైలామా ఇండియాకు చేరుకున్నాడు. దాదాపు ఎనభైవేల మంది టిబెటన్లు ఆయన వెంట ఇండియాకు వచ్చారు.

ఇప్పటికీ పరిస్థితుల్లో మార్పులేదు. టిబెటన్ల స్వాతంత్ర్యేచ్ఛ పగటి కలగానే మిగిలింది. బీజింగ్ ఒలంపిక్స్ సందర్భంగా



లాసా

ప్రపంచవ్యాప్తంగా వున్న టిబెటన్లు తమకు స్వాతంత్ర్యం కావాలని అడుగడుగునా తీవ్ర నిరసన తెలిపారు. చైనా నుండి పూర్తిగా దూరం కావాలని లేకున్నా, బీజింగ్ సార్వభౌమాధికార పరిధిలోనే తమకు స్వయం ప్రతిపత్తి కావాలని మాత్రమే సంప్రదాయ టిబెటన్లు కోరుకుంటున్నారు.

టిబెట్‌లో చైనా బలం పెరిగాక, చైనా నుండి టిబెట్‌కు వలసల వరద వెల్లువెత్తింది. ముఖ్యంగా టిబెట్‌లో 'హస్' జాతీయుల ప్రాబల్యం మరీ ఎక్కువైంది. పాశ్చాత్య ప్రభావంతో పెచ్చరిల్లుతున్న చైనీయుల ఆధునిక పోకడలు టిబెటన్లకు మింగుడు పడటం లేదు. బార్లూ, పబ్బులూ, నగ్న నృత్యాలు విచ్చలవిడిగా ప్రబలుతున్నాయి. మతాచారాలను పవిత్రంగా భావించే టిబెటన్లు బలవంతంగా జరుగుతున్న తమ సంప్రదాయ, మత సాంస్కృతిక విధ్వంసాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

చైనీయుల అక్రమవలసల వల్ల టిబెటన్ల జీవన శైలి మారిపోవడమేగాక వారి జీవనయానమే ప్రమాదంలో పడుతున్నది. తమ సొంతగడ్డమీదనే తాము పరాయి వారమయి పోతున్నామన్న భావన నిరంతరం వారిని అభద్రతకు గురి చేస్తున్నది. చైనావారి వలసల వల్ల టిబెట్‌లో 'మాండరిన్' (చైనా అధికారభాష) భాషే అనధికారికంగా పెత్తనం చెలాయిస్తున్నది. ఫలితంగా ఆ భాషతో పరిచయంలేని టిబెటన్లకు తమదేశంలోని ఉద్యోగాలే తమకు దక్కని వింత పరిస్థితినెలకొన్నది. తమ సంస్కృతి, ఆచారవ్యవహారాలు అంతరించిపోయే ప్రమాదం వాటిల్లిందని టిబెటన్లు భయపడుతున్నారు. చైనా బలప్రదర్శన, అణచివేతల కారణంగా టిబెటన్లు గత్యంతరం లేక ప్రపంచవ్యాప్తంగా వలస పోయ్యారు. అలాంటి వలస పక్షుల కోవలోనిదే మన కవయిత్రి థోంపా కుటుంబం.

ఈ నేపథ్యం తెలిస్తేనే, థోంపా కవిత్వాన్ని మనం సంపూర్ణంగా ఆస్వాదించగలుగుతాం. మౌఖిక సంప్రదాయానికి చెందిన థోంపా యొక్క శక్తివంతమయిన యీ కవితల సమూహం టిబెటన్ డయాస్పోరా కవిత్వానికి మంచి ఉదాహరణ. సార్వత్రిక సమానత్వాన్ని, మానవత్వాన్ని ఈ డయాస్పోరా కవిత్వంలో అక్షరం, అక్షరంలో నిబిడీకృతం చేసింది కవయిత్రి. ప్రతికూల పరిస్థితుల్ని మనోస్థైర్యంతో అనుకూలంగా మలచుకునే సంయమనం కూడా ఈ కవిత్వంలో కనిపిస్తుంది. సంచార జాతుల సాహిత్య మరియు సాంప్రదాయక కర్మకాండలు, ఆసక్తికరంగా ఈ కవితలలో విస్తరించి ఉన్నాయి. సాంత్వననిచ్చే లక్షణాలు కౌటుంబిక, గృహసంబంధ చైతన్యోత్సాహాలు మనల్ని ఉత్తేజపరుస్తాయి. తన నమ్మకాలను, విశ్వాసాలను, మతకర్మకాండలను నిజాయితీగా థోంపా చిత్రీకరించిన తీరు ఆశ్చర్య పరుస్తుంది. ఈ కవిత్వం చదువుతుంటే భాష నుండి భాషలోకి, సంస్కృతి నుండి సంస్కృతిలోకి, బాల్యంనుండి యవ్వనంలోకి మళ్ళీ మళ్ళీ ప్రవేశిస్తూ–నిష్క్రమిస్తూ వలస పాలబడిన ఒక అమ్మాయి మరో ప్రపంచంలోకి మనం కూడా అడుగు పెట్టుతాం.

తాను అలవరచుకున్న అమెరికన్ – ఇంగ్లీష్ సాంకర్య – సామాన్య కావ్యభాషను అందంగా తీర్చిదిద్దుకుంది థోంపా. అది విలువైన 'ధర్మ' – దాని పవిత్రతను అసాధారణంగా చిత్రీకరించడానికి ఉపయుక్తమయింది. వర్ణనలతో కూడిన మౌఖిక సంప్రదాయానికి చెందిన ఆమె కవిత్వం పాటలాగ హాయిగా సాగుతుంది.

ఆవేదనతో కూడిన 'Passage' అన్న థోంపా కవితను పరిశీలించుదాం :


**మా తాతకు యాభై గుర్రాలుండేవి**
**ఇప్పటికీ అదో ప్రపంచం!**
**అవి కూడా చనిపోయాయని ఆమె చెబుతుంది.**
**మా పూర్వ చరిత్ర తెలుసుకోవడానికి ఇదో మార్గం.**
**మా ముత్తాత పందొమ్మిదేండ్ల ప్రాయంలోనే**
**విషప్రయోగంతో మృతి చెందాడు.**
**ఒక తాత తుపాకికి బలి అయ్యాడు.**
**అందానికి ప్రతిరూపమైన మా నాయినమ్మను కూడా**
**తుపాకితో కాల్చి చంపారు.**
**'దేశభక్తి' అన్న పదశోధనలో**
**అతడు రేకుల కప్పుమీద రవ్వల్లా ఉగ్రుడయ్యాడు**
**'నా దేశానికి స్వతంత్రం తెచ్చేందుకు**
**నేను రేపే పయన మవుతాను' అంటాడతడు.**
**'లాభం లేదు' అని పెదవి విరుస్తాను నేను.**
**నేనొక చిల్లుపడ్డ కుండను.**
**అందులో నీళ్ళు ఆగకుండా కారిపోతూనే వుంటాయి.**
**నేను దృఢంగా మనసు లగ్నం చేయలేకపోతున్నా.**
**జనం క్రూరంగా చంపబడ్డారని ఆమె చెబుతుంది.**
**(కొంతమంది సజీవ దహనం చెయ్యబడ్డారు)**
**గతం గురించి చెప్పుకోవడానికి కేమీ లేదని ఆమె చెబుతుంది**
**గొప్ప అందగత్తెకు జన్మించిన బిడ్డనని చెబుతుంది**
**వాళ్ళను జ్ఞాపకం చేసుకోవడానికి కేం మిగిలింది...?**

తిరుగుబాటును అణచి వేయడం అన్న నెపంతో చైనా సైన్యం టిబెట్‌లో సృష్టించిన మారణ హోమానికి అక్షర రూపం యీ కవిత. కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. సంస్కృతులు తుడిచిపెట్టుకు పోయాయి. సంప్రదాయాలు విధ్వంస మయ్యాయి. ఈ సాంస్కృతిక విధ్వంసం టిబెట్‌లో విషాదమే మిగిల్చింది.

'How Thubeten Sang his Songs' అన్న కవితలో అస్తిత్వవేదనను అత్యంత నేర్పరితనంతో చిత్రించింది థోంపా.

**నిశ్శబ్ద ఉపన్యాసాలకు నువ్వు అలవాటుపడ్డావు**
**మాట్లాడు – అతడన్నాడు – మాట్లాడు.**
**ప్రపంచం అందంగా రూపెత్తినట్టు**
**'మాగ్‌పై' పక్షి పక్కగూటిలోకి చేరింది.**
**ఖాళీనాలుకలు చాలా బరువుగా ఉన్నాయి**
**గుహల్లో నివసించే నీకు**
**జీవితం గురించి ఏం తెలుసు?**
**పొరుగింటి అమ్మాయిని**
**ఎవరో ఒకరు పెళ్ళి చేసుకున్నారు**
**ఒక స్త్రీ వెటకారపు నవ్వు**
**గదినిండా పరచుకుంది.**
**అవతలి ప్రపంచాన్ని**
**దూరంగా వుంచలేం.**
**అతడు; వీధిలోని**
**ఒక పాలవాణ్ణి పిలిచాడు**
**'నీ బాధలకు కారణాలేంటి?' అని అడిగాడు.**
**అతడన్నాడు, పాలు! – పాలు!**
**నేనెక్కడున్నానో తెలుసుకోవాలని అనుకుంటున్నా.**
**నేనెక్కడ్నించి వచ్చానో తెలుసుకోవడం అవసరం.**

**నేను ఒకసారి ఒక్కమాటనే వినగలను.**
**ఎప్పుడైతే నేను జనంతో వున్నానో**
**నేను జనాన్ని ప్రేమించాను.**
**ఎప్పుడైతే నేను ఒంటరిగా వున్నానో**
**నేను కేవలం ఒంటరిని!**
**వెలుతురు లేని చీకటి గుహలో**
**నువ్వేం చూశావు?**
**కాలిపోతున్న నీ నీడలు!**
**మంటలు...!**
**మంటలు...!**



**భిక్షువు**

నిర్బంధాలమధ్య, నిషేధాల మధ్య, అణచివేతల మధ్య ఉండటమంటే చీకటి గుహలో ఉండటమే! అన్నిటికీ మౌనమే శరణ్యం, జనంతోలేని ఒంటరి తనం ప్రేమరాహిత్యంతో ఎంత దుర్భరంగా వుంటుందో రచయిత్రి; వేదనామయ భావనలను తన స్వరంలో గాద్గదికంగా పలికించింది యీ కవితలో.

'Hibernation' అన్న కవితలో టిబెటన్ల జీవితాలు ఎలాంటి సామాజిక చేతన లేకుండా స్తబ్దుగా ముడుచుకు పోవడం, మతకర్మకాండలకే పరిమితం కావడం చాలా సున్నితంగా చిత్రించింది థోంపా.

**తూర్పు టిబెట్‌లో పెరగడానికి గడ్డి తిరస్కరిస్తున్నది**
**నదికభిముఖంగా తన చెక్కిళ్ళు పెట్టి**
**వరుణుడు 'ఢమరు' మ్రోగిస్తున్నాడు,**
**వర్షాన్ని ఆహ్వానిస్తున్నాడు.**
**'దైనికైనా సమాయత్తం కావడం**
**సర్దుబాటు చేసుకోవడం**
**ఇవే జీవితమంటే' అని అమ్మ చెబుతుంది.**
**మేం, స్థూపం మీద వెన్నతో దీపం వెలిగించాం**
**బుద్ధుని కనుబొమ్మల మీద**
**వెన్నదీపం తాలూకు ధూపం గాలిలా సుడులు తిరగటం,**
**వెలుతురు బొట్లు బొట్లుగా పడటం చూశాం.**
**'తార' విగ్రహం కళ్ళలో కన్నీరు!**
**కాపలా దారుడు చిన్న చిన్న కాగితపు ముక్కలతో**
**ఆ కన్నీళ్ళు తుడిచాడు.**
**తెగిన మణికట్టు రక్త నాళాల్లోంచి**
**ప్రవహించే రక్తంలా,**
**నదిలో వంకలు తిరుగుతూ**
**ప్రవహించే నీళ్ళలా**
**ఒకరినుండి ఒకరికి మాటలు ప్రవహిస్తున్నాయి...**

ఇలాసాగుతుంది యీ కవిత. 'జీవితంలో గుండెలు బాదుకునే విషాదం ఏమీలేదు – రాజీపడటం తప్పు' అన్నట్టుగా నిరాశలోంచి, నిస్పృహలోంచి, నిర్వేదంలోంచి పుట్టిన జీవన తాత్త్వికతను అక్షరబద్ధం చేసింది కవయిత్రి. ప్రవాసంలో వున్నా తన నరనరాలలో ప్రవహిస్తున్న బౌద్ధ మతారాధనను, పవిత్ర భావనను పదే పదే చాటుకుంది థోంపా. తాత్వికతను శోధించడంలో భాగంగా 'జీవితం తర్వాత ఏమిటి?' అన్న ప్రశ్నతో యీ కవిత ముగుస్తుంది.

'In between' అన్న మరో కవితలో ఆశోపహతులైన టిబెటన్ పౌరుల విషాద పరిస్థితిని కళ్ళకు కట్టినట్టు వర్ణించింది థోంపా.

**"...గోడలు బహిర్గత మయ్యేందుకు భయపడుతున్నాయి.**
**మేం గొణుక్కుంటున్న మాటల్ని**
**నీడలు వేళ్ళతో బంధిస్తున్నాయి**
**'మీ పద ప్రయోగం చాలా తప్పు**
**చాలా విషాదకరమైన తప్పు**
**పదాలు ఎలా పుట్టుతాయో ఆలోచించండి.**
**ప్రముఖ పదాల మధ్య సంబంధాల గురించి ఆలోచించాలి"**
**అంటూ యూనివర్సిటీ టీచరే నిట్టూరుస్తున్నాడు.**
**కారణం లేకుండానే కుక్కలు మొరుగుతున్నాయి.**
**మాలో కొందరం 'ఘాట్'కు వెళ్ళి**
**శవాలను దహనం చేయడం చూస్తున్నాం**
**తెల్లని గుడ్డలో కప్పబడివుంది స్త్రీ**
**ఆమె వెంట్రుకలు నిర్వీర్యమైన వెన్నెముకకు**
**మౌనంగా చిక్కుకొని వున్నాయి.**
**మేమా శ్మశాన వాటికలో యింకా చాలా**
**మామూలు కంటె భిన్నమైన దృశ్యాలు చూశాం.**
**మధ్యాహ్నం 'అర్థాలు' అమితంగా కీర్తిస్తున్నాయి..."**

ప్రజాకంటకుల నీడ పాము పడగవంటిది, ఆ పడగ నీడన స్వేచ్ఛగా ఏమీ మాట్లాడుకోవడానికి లేదు. స్వతంత్ర భావాలు ప్రకటించుకోవడానికి లేదు. నాలుగ్గోడల మధ్య

మాట్లాడినా, నీడలే వాటిని బహిర్గతం చేసే ప్రమాదం వుంది. జీవన వ్యాకరణం శిథిలమైనచోట భాషావ్యాకరణాలను ఎవరు పట్టించుకుంటారు? కడుపు మండిన వాళ్ళు కవిత్వంలో మాట్లాడరు. బాధాసర్పదష్టులు మోహనరాగాలు ఆలపించరు. ఇక్కడ కవయిత్రి బృందం చూసిన దృశ్యాలు; దగ్ధమవుతున్న టిబెట్ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే ప్రతీకాత్మకంగా నేర్పుగా చిత్రీకరించింది కవయిత్రి.

చివరగా 'Since' అన్న కవితను థోంపా ఎంతటి కవితాత్మక సంవిధానంలో తీర్చిదిద్దిందో చూద్దాం :

**అలసిపోయిన యాత్రికునిలా**
**వసంతం చాలా ఆలస్యంగా వచ్చింది..**
**దాని పూపూ, విత్తనాలను మేం చూశాం**
**'జకరాండా' మసక ఎరుపు పూలను పూసింది**
**ఇది మంచి సంవత్సరానికి సంకేతమని సన్యాసి చెప్పాడు.**
**జటిలమైన సమస్యలను ఎదుర్కోవడం**
**ఇప్పుడు ఒక గతం!**
**సన్యాసులుక్కూడా సంయమనం అవసరం**
**లామా కోసం కలలు రాశిపడ్డాయి**
**అతని మీద పూరేకులు కురిపించాం**
**విచారాన్ని ఇతరత్రా అనువదించాలని**
**'కర్మ'ను సులభతరం చెయ్యాలని అడిగాం**
**అతడు వేళ్ళలో చిటికెలను బంధించాడు**
**మా 'కర్మ'లోకి మేం ఘనీభవించాం**
**అతడు వాస్తవికతను**
**భ్రమలోకి మార్చాడు**
**సంభ్రమాశ్చర్యాలతో మేం వీధుల్లో**
**తిరగడం ప్రారంభించాం**
**అతిగా చూడటంవల్ల తలతిప్పుతున్నట్లనిపించింది**
**పగటి వెలుతురులో ధూళి కణాలు మెరుస్తున్నాయి**
**వీధి మూలల మలుపుల్లో వెలుతురు విశ్రమిస్తున్నది**
**మా కలయిక చివర, ఒకరి నుదురును ఒకరు స్పృశించాం**
**ఒకరి నొకరు దీవించుకున్నాం:**
**'గ్యాషో' ప్రేమకు నువ్వు పాత్రమగుదువు గాక!**
**వర్షంలో స్థూపం కండ్లు నిమీలితమయ్యాయి**
**చుట్టూ వున్న వికృతాకృతులు చీల్చబడి**
**సుందర దృశ్యం మీద మేటలు వేశాయి.**

**అంతులేని పాదాల ఆవులింతల తరువాత**
**'ఓం మణి పద్మేహం' అని మంత్రోచ్ఛారణ చేశాం**
**పావురాయి రెక్కలు దులుపుకుంటున్నది**
**మేం తిరిగి లామా చెంతకు చేరుకున్నాం**
**'మేం జ్ఞాపక ముంచుకోదగిన**
**ఉపదేశమివ్వండి' అని అర్థించాం.**
**"మీ కురులు ఏపుగా పెరుగు గాక!**
**మీ పాదాలకు చూపు నివ్వండి**
**ఎవరినీ అనుసరించకండి' అన్నాడు లామా.**

మత విశ్వాసాలను నమ్ముతూనే ప్రాపంచిక విషయాలకు కూడా ప్రాధాన్యత నిస్తున్నది థోంపా. ఇందులో వీథులన్నీ కల తిరిగిన టిబెట్ అమ్మాయి అనుభవాలు గుదిగుచ్చబడ్డాయి. ఆ అనుభవాలను పొడి పొడి వాక్యాలతో ఏకరువు పెట్టకుండా గొప్ప కవితాభినివేశంతో వర్ణించింది కవయిత్రి. బౌద్ధ మతాలకు చెందిన వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్టు చిత్రీకరించింది. గంభీరమైన ఆ వాతావరణంలోనూ అమ్మాయిల ఆసక్తులూ, అనాసక్తులూ వివరింపబడ్డాయి. మతకర్మలగురించి అమ్మాయిల్లో ఎలాంటి అభిప్రాయా లున్నాయో స్థూలంగానైనా థోంపా తెలియజేసింది యీ కవితలో.

ఆమె నరనరాల్లో ప్రవహించే స్వేచ్ఛా కాంక్షకు ప్రతీక 'Airport' అన్న కవిత. తాను ఆ లోహ విహంగాల్లో ఎగరాలని కలలు కంటుంది. విమానాలు ఎగిరే దృశ్యం చూస్తున్నప్పుడు ఆమె మనసు సీతాకోక చిలుకలా రెక్కలు విప్పుకొని విహరిస్తుంది.


'నా ప్రజలు పర్వత శ్రేణులకు చెందిన వాళ్ళు. ఇంకా చాలా లక్షణాలున్నాయి వాళ్ళకు. అయినా పరస్పరం నా ప్రజలు అని పిలుచుకోవడానికి ఏమాత్రం సిగ్గుపడరు' అంటూ తన దేశ ప్రజల గురించి గర్వంగా చెప్పుకుంటుంది థోంపా.

ఆమె తన దేశంకోసం, రక్తసంబంధీకుల కోసం, స్నేహితుల కోసం, ఆత్మీయుల కోసం పరితపించడం యీ కవితల్లో కనిపిస్తుంది. ప్రత్యేకించి తను బౌద్ధమతాన్ని భక్తి ప్రపత్తులతో ఆరాధించడాన్ని తన్మయత్వంతో కవిత్వీకరిస్తుంది. జీవనోత్తేజాన్ని కలిగించే ప్రేమను స్వప్నిస్తుంది. తన దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, దేశ సౌభాగ్యాన్ని స్వప్నిస్తుంది. తన దేశ ప్రజలతో మమేకంకావడాన్ని కలకంటుంది. తన దేశపు నేల, నదులు, కొండలు, పొలాలు, చెట్లూ చేమల్లో హాయిగా విహరించాలని ఊహిస్తుంది. ఇది ఒక టిబెట్ అమ్మాయి కలల కవిత్వం.

# రసదృష్టి

- ఆచంట జానకిరామ్

ఆ మధ్య ఒకరిని చూడడానికి వెళ్లి, వారి ఇంటిచుట్టూ ఉన్న తోటలో చక్కగా వికసించిన రకరకాల పువ్వులను చూచి ఎంతో ముగ్ధుడనయ్యాను. కాని, ఆ తరువాత వారు కూర్చునే గదిలో బల్లమీది ప్లాస్టిక్ టేబిల్ క్లాతూ, పూల సజ్జలో ప్లాస్టిక్ పువ్వులూ చూచి చాలా బాధపడ్డాను. వారితో చెపుదామనుకున్నాను. "మీ తోటలో అన్ని రకాల పువ్వులున్నవి కదా. మీకు ఈ కృత్రిమపు పువ్వుల ఖర్మమేమి?" అనీ "కాస్త శ్రమపడితే ఖద్దరులోగాని, చేనేత వస్త్రాలలో గాని చాలా చాలా అందమైన టేబిల్ క్లాత్‌లను కొనవచ్చు కదా" అని. కానీ వారి మనస్సును బాధపెట్టడమెందుకని ఊరుకున్నాను.



అయితే, దేశమంతటా ఈ కృత్రిమపు అలంకార వస్తువులు అనేక రకాలవి చాలా చౌకగా లభిస్తున్నవి. ఆ మాటకొస్తే నేను ఎవరికైనా మనోహరమైన ఒక ఎర్రగులాబీ పువ్వును కానుకగా ఇస్తే వారు వెంటనే అంటారు. "ఎంత బాగుంది! అచ్చంగా కాగితం పువ్వులా ఉంది కదూ!" అని అంత దిగజారిపోయింది మన కళాదృష్టి. ఇక మెడలో వేసుకునే హారాలు, తలలో పెట్టుకునే పూలచెండ్లూ ఇవన్నీ కూడా ప్లాస్టిక్‌లో దొరుకుతున్నాయి. వాటిని మనవారు వేలం వెర్రిగా కొని సింగారించుకుంటున్నారు.

ఏదైనా పండుగవస్తే గడపలకూ, ద్వారబంధాలకూ చక్కగా పసుపుపూసి మధ్య మధ్య కుంకుమబొట్లు పెట్టే అలవాటు అంతరించింది ఏనాడో. అదంతా డబ్బాలలో వచ్చే రంగులతో పూయవలసిందే. ఈనాడు చుక్కలున్నూ ఇనామిల్ ఎర్రచుక్కలే. ఇవి నీళ్ళు పోసినా చెరిగిపోవు. ఇంట్లో వారికి పని తగ్గుతుంది. ఈ దురలవాటు గ్రామాలలోకి కూడా వ్యాపించడము మరీ శోచనీయము. ఎంత మంచి రకపు ఇనామిల్ ఐనా పసుపు కుంకుమల అందముతో సరిపోదు అని వీరికెలా నచ్చచెప్పడము?

మన జీవితంలో ఇటువంటి అలవాట్లు ఏర్పడడానికి కారణం కొంతవరకు సినీమాల ప్రభావమనుకుంటాను. వారికి నకిలీ వస్తువులతోనే పని గడుస్తుంది అసలు పువ్వులైతే వాడిపోతాయి. ప్లాస్టిక్ పువ్వులైతే ఎన్నాళ్ళైనా ఆ పిక్చర్ పూర్తయ్యేవరకు ఉంటాయి. ఇంక కథలో మన ప్రాచీన శిల్ప సౌందర్యాన్ని చూపవలసివస్తే ఎవరో ఒక సినీమా సంస్థగాని లొకేషన్ షూటింగ్‌కు ఖర్చు పెట్టరు. అన్నిటికీ నకిలీలను తయారు చేసి అవి అసలువైనట్లు భ్రమ కలిగిస్తారు మనకు.

మన ప్రజలకు విపరీతమైన అపకారము చేసేవి జనవరి 1వ తేదీ లోపుగా వచ్చే అతి విరివిగా పంచిపెట్టబడేవీ, చాలా చౌక ధరలకు అమ్ముడయ్యేవీ అయిన క్యాలండర్ బొమ్మలు వీనిలో కొట్టవచ్చేటంతటి ధాతు రంగులలో ఉన్న భామల బొమ్మలను చూచి మనవారు ముగ్ధులైపోతారు. కొందరి ఇండ్లలో ఎన్నెన్ని క్యాలండర్ బొమ్మలో ఇవన్నీ కూడా వారి ఇంటి అందాన్ని తక్కువ చేస్తున్నాయని వారికి తెలియదు. ఒక పార్వతీ పరమేశ్వరుల బొమ్మలూ, శ్రీకృష్ణుని బొమ్మలూ ఏదో సినిమాలో ఆ పాత్రలను ధరించిన సినీమా తారల బొమ్మలే! ఆ బొమ్మలలో ప్రస్ఫుటంగా కనిపించేది ఆ సినీమా తారయేగాని పార్వతీ కాదు, పరమేశ్వరుడూ కాదు, శ్రీకృష్ణుడూ కాదు!

ఆచంట జానకిరామ్ (1902-1992)

ఇప్పుడిప్పుడు కొందరు, పదివేల మందిలో ఒకరు, చిత్రకారుడు చిత్రించిన అసలు బొమ్మలతో తమ ఇండ్ల గోడలను అలంకరించుకొంటున్నారు. దేశంలో చిత్రకళా సాధన బాగా ఎక్కువగానే ఉన్నది. కాని, ఉత్తమ చిత్రకారుని బొమ్మలను కొనేది ఎక్కువగా పాశ్చాత్యులు. మనదేశమును చూడడానికి వచ్చిన విదేశీయులు – ఈ విదేశీయుల సహాయంతో స్థాపితమైన కొన్ని వ్యాపార సంస్థలవారు మంచి మంచి బొమ్మలను క్యాలండర్లలోనూ, డైరీలలోనూ ముద్రిస్తున్నారు. కాని, ఈ మేలురకపు క్యాలండర్‌లు మన వారిలో చాలా తక్కువమందికి లభిస్తవి. అందుచేత ఉత్తమ చిత్రకళతో వారికి పరిచయం తక్కువ.

చిత్రకళ అంటే జ్ఞాపకము వచ్చింది. నేను జరిపిన కొన్ని చిత్రకళా ప్రదర్శనలకు జనము తండోపతండాలుగా రాకపోయినా, రోజుకు ఒక వేయిమందికి తక్కువగాకుండా వచ్చేవారు. వీరందరికీ ఒకొక్క బొమ్మను గురించీ కొంచెము వివరంగా చెపుతూ, ఆ రేఖాసంపద వల్లగాని, ఆ రంగుల మేళవింపుద్వారాగాని, ఎంతటి అందము చేకూరిందో వివరిస్తే వారెంతో శ్రద్ధగా వింటారు. ఇటువంటి చిత్రకళా ప్రదర్శనలు ఎన్ని ఐనా అవసరము మనకు. వట్టి ప్రదర్శనేగాక, ఒకొక్క బొమ్మను గురించీ శ్రద్ధగా, ఓపికతో, వివరించేవారూ కావాలి మనకు.

మన ఇళ్ళల్లో కుర్చీలూ, బల్లలూ, అలమారాలు ఎంతో అందంగా తయారుచేయించుకోవచ్చును. ప్రతి ఊరి వడ్రంగులు, మనకు తెలిసిన మంచి తరహా 'ఫర్నిచర్'ను మనము చూపిన మాతృక ప్రకారం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నారు. వారికి కావలసినది కాస్త ప్రోత్సాహమే.

మా చిన్నతనంలో మా ఇంట మంచి కంచుసామగ్రి ఉండేది. నాకు చాలా ఇష్టమైన ఒక మంచినీటి పాత్రకు నేను "దోసగింజ ఆపుకారా" అని పేరుపెట్టినట్లు జ్ఞాపకము. ఆ పాత్ర దోసగింజ ఆకారంలో ఉండేది. చక్కగా తోమితే ఎంతో అందంగా ఉండేది. అదిన్నీ, హరివాణము అనే రాగిపళ్ళెము అందంగా నగిషీ చెక్కినది మా ఇంట ఉండేది. చక్కగా తోమిన ఈ హరివాణములో అప్పుడే చెట్టునుండి వ్రాలిన పారిజాతపు పువ్వులను సేకరించి తెచ్చేవారము పిల్లలము మేము. ఆ పళ్లెములో పువ్వులు ఎంత అందంగా ఉండేవో ఇప్పటికీ ఏబది ఏండ్ల తర్వాత, జ్ఞాపకం చేసుకోగలను నేను! ఆ జీవిత విధానమే మారిపోయింది!!

చిన్నపిల్లల విషయంలో వారికి ఆడుకోటానికి ఇచ్చే ఆటవస్తువులతో ప్రారంభిస్తుంది. అందమైన "చెన్నపట్నపు లక్కపిడతలు'' లేక ''ఏటి కొప్పాక'' లక్కపిడతలూ ఇటువంటివానికి బదులు కీ ఇస్తే గిర్రుమని తిరిగే రేకుతో చేసిన మోటార్ కార్లూ, రైళ్ళూ, ఏరోప్లేన్లూ... ఇలాంటివి ఇచ్చామా ఆ పిల్లల కళాదృష్టిని చిన్నతనమునుంచీ పెడత్రోవను పెట్టిన వారమవుతాము మనము.

ఒకానొక మహమ్మదీయ కుటుంబముతో కొన్ని రోజులు ఉండే అవకాశం లభించింది నాకు. మనకంటే ఎక్కువగా వారు అందాన్ని పాటిస్తారని తెలియవచ్చింది. కుటుంబంతో మంచి నగిషీతో నేసిన 'దస్తర్‌ఖానా' అనే తివాసీలాంటి గుడ్డపైన అందమైన పళ్ళాల్లో ఆహారమును స్వీకరిస్తారు. వారు వాడే పాత్ర సామగ్రిన్నీ ఎంతో అందంగా ఉంటుంది. తమలపాకులందించే 'పాన్‌దాన్' ఎంతో బాగుంటుంది. అగరవత్తులను పెట్టే 'స్టాండ్' కూడా అందమైన నగిషీ. ఆఖరికి గదికి ఒక మూలనున్న ముసలివారు ఉమియడానికని ఉంచిన పాత్ర కూడా అందంగా ఉంటుంది. ఇక పిల్లలు, పెద్దవారు ధరించే కమీజులు, షిర్వానీలు, దుప్పట్టాలు ఎంత మనోహరంగా ఉంటాయో నేను వర్ణింపలేను. ఈ విషయంలో వారివద్దనుంచి మనం నేర్చుకోవలసింది ఎంతైనా ఉన్నది.

లోకులలో సౌందర్యదృష్టిని రూపముద్వారా, సంగీతము ద్వారా, సాహిత్యముద్వారా కల్పించిన మహాపుణ్యము శ్రీ రవీంద్రనాథ ఠాగూరుకు చెందినది. ఆయన రచనలలో మాటిమాటికి ఈ సౌందర్యాన్వేషణా, సౌందర్యానుభూతి ప్రస్ఫుట మగుతూంటాయి. ఆయన సందేశాన్ని రెండేరెండు మాటలలో చెప్పాలి అంటే అవి, రమ్యాలోచనము, రమ్యజీవనము. మన ఆలోచనలు రమ్యంగా ఉండాలి. మన జీవితము రమ్యంగా ఉండాలి.

కాని రవీంద్రుడు భౌతిక సౌందర్యానికి విశేషమైన స్థానాన్ని ఇచ్చినా మనము ఆ భౌతికపుటెల్లలను దాటి ముందుకుపోతూ ఒక ఆధ్యాత్మిక సౌందర్యానుభూతిని పొందాలని రవీంద్రుని ఆదేశం, ఆయన అంటారు.

**స్వర్గలోకంలో దేవతలు ఆస్వాదించే**

**అమృతానికి రూపంలేదు; పరిమితిలేదు.**

**ఆ అమృతం ఎక్కడున్నదో తెలుసా?**

**జలజల ప్రవహించే సెలయేటిలో,**
**కన్నుల పండువుగా పుష్పించే చెట్ల గుంపులో**
**మీన నేత్రల కాటుక కనుల కొలకుల నాట్యమాడే మందహాసంలో**

ఆ అమృతాన్నే స్వేచ్ఛగా ఆస్వాదించు! అని ఇలా భౌతికమైన అనుభవం ద్వారా, భౌతికాతీతమైన అనుభూతిని పొందమని ఆదేశిస్తాడు రవీంద్రుడు.

మరి ఒక చోట ఇలా అంటారు.

**సౌందర్యము అనే మహాప్రవాహం పైన**
**చిరుకెరటాలుగా రేగే రంగుల అందాన్ని**
**కన్నులారా చూచి ఆనందించు; కాని,**
**ఆ రంగులను గుప్పిటిలో బంధించాలని ప్రయత్నించకు!**

ఇది చాలా అవసరమైన హెచ్చరిక! పంచేంద్రియముల ద్వారానేగాక ఇంద్రియాతీతమైన సౌందర్యాన్ని అనుభవించడానికి అవకాశమున్నదని రవీంద్రుని ఈ మాటలు వ్యక్తం చేస్తాయి.

**కళ్ళూ రెండూ గట్టిగా మూసుకున్న**
**నా హృదయాంతర హృదయంలో లీలగా**
కనుపిస్తుంది, రూపాతీతమై మహాసౌందర్యము. కాని ఆ అంతస్తును చేరడానికి ఎంతో సాధన కావాలి. రూపముల ద్వారానే రూపాతీతమైన సౌందర్యాన్ని సాక్షాత్కరింప చేసుకోవడము సౌందర్యాన్వేషణకుని ఆశయము. ఈ ఆశయము ఎంతో అనుభవం తర్వాతగాని, ఎంతో యత్నం వల్లగాని సిద్ధించదు. రవీంద్రుడు లలితకళలో సంగీతానికి కూడా చాలా ప్రాధాన్యం ఇయ్యడము గమనింపతగినది. ఆయన ఒకచోట అంటారు ఇలా:

**లలిత కళలలో అతి స్వచ్ఛమైన సంగీత కళ.**
**మరి ఏ ఇతర ఆలంబనములేక, సూటిగా,**
**సౌందర్యానుభూతిని పొందవచ్చు. మనము సంగీతము ద్వారా,**
అని.

మన సంగీతము దక్షిణాదిదైనా, ఉత్తరాది బాణీ సంగీతమైనా చాలా వరకు మాటలలో కట్టుబడి ఉన్నది. మనవారి వట్టి రాగాలాపన సమయాలలో తప్ప ఏ వాద్యమున కీర్తనలుగాని, భజనలుగాని వినిపిస్తున్నా ఆ కీర్తనల ఆ భజనలలోని మాటలు మనకు స్ఫురిస్తూ ఉంటాయి. పాశ్చాత్య సంగీతమలా కాదు. భితోవెన్ సింఫనీగాని, లిట్స్ సంగీత రచనలుకాని, షోపా సంగీత రచనగాని మాటల ప్రసక్తి లేకుండా, కేవలము వాద్యసమ్మేళనము ద్వారా మనకెప్పుడు అమితమైన ఆనందానుభూతి కలిగింపగలవు. ఆ సంగీతము ద్వారా అందమైన చిత్తరువులను చిత్రిస్తారు వారు మన మనోనేత్రము ముందు. పాశ్చాత్య క్లాసికల్ మ్యూజిక్ ద్వారా మనము పొందగల సౌందర్యానుభూతికి పరిమితిలేదు. ఒక జీవిత కాలము వినినా ఇంకా మిగిలిపోయే సంగీత రచనలు రికార్డ్ అయి ఉన్నాయి. ఇంగ్లండ్, జర్మనీ, పోలెండ్, రష్యా దేశపు సంగీత ప్రవీణులు రికార్డ్ చేసినవి. ఇవన్నీ మన నిత్యజీవితాన్ని ఎంతో ఆనందపూరితంగా చేయకలవు.

ఈనాడు మనలో ఏదో ఒక పేరిట మూఢవిశ్వాసాలు ప్రబలి ఉన్నా, పండుగా, పబ్బమూ వచ్చిన సమయాలలో ఇంకా మన లోగిళ్ళు సౌందర్య చిహ్నాములతో కళకళల్లాడుతూ ఉంటాయి. నవనాగరికత ఎంతగా వ్యాపించి ఉన్నా, మనవారి నిత్యజీవితంలో సౌందర్యం ఎంత గొప్పగా ఉంటుందో మనం గమనించవచ్చు. ఇట్టి జీవిత ధోరణి మార్పు చెందకుండా చూచుకోవడం మన విధి. హేతువాదానికీ, అందమైన ఆధారాలకీ ఏమీ సంబంధం లేదు. పూర్తిగా హేతువాదులమైన, మన నిత్యజీవితంలో సౌందర్యాన్ని ఈ రీతిగా పాటింప వచ్చును.

ఇందాక ఒకచోట, ప్లాస్టిక్ బల్లగుడ్డలను గురించి చెప్పాను. బందరు (మచిలీపట్టణపు) జలతారు కుట్టుపనితో కూడిన దుప్పట్టా. మనవారి సౌందర్య దృష్టి ఎంత గొప్పదో తెలుపుతుంది. ఇటువంటి వానిని విడిచిపెట్టి కేవలము అనుకరణలైన నకిలీ సుందర దృశ్యములతో నిండి మెషీన్ల ద్వారా తయారైన ప్లాస్టిక్ వస్తువులకు ఎగపడడమంత అవివేకమునకు మనము లోనుగాకూడదు.

ఈ వ్యాసమును రవీంద్రుని మాటలలోనే పూర్తి చేయడము సమంజసమనిపిస్తోంది. ఆ మహాసౌందర్యవేత్త ఉత్తమ జ్ఞాని, ఇలా అంటారు. పరమ ఋషి వాక్యంగా.

**లోకము భయంకరమైన సంక్షోభములను కలిగించే**
**పెనుతుఫానులకు పుట్టినిల్లు, కాని, తుఫానుల తీవ్రతను**
**నాశనముచేసి పరమశాంతిని నెలకొల్పుతుంది.**
**సౌందర్యము అనే విశ్వగానము!**

మన నిత్యజీవితములో ఈ విశ్వగానము వినిపిస్తూనే ఉంటుంది. మనము వింటూ, ధన్య జీవులము కావాలి. అంతే!

# కారుణ్యమె ముద్దు



మహా, మరో ప్రస్థానాలు
విప్లవాగ్నులు
మంటల చేత మాట్లాడించి
రక్తం చేత రాగాలాపన
ప్రజల ఆస్తులు మంటల్లో
యువరక్తంతో రాగాలాపన
రాజకీయం.
విధ్వంసాలతో సర్వం నాశనం
భావి యువ శక్తి - హతం
విధ్వంసాల శిక్షణ
విద్యాభ్యాస భక్షణ
విచక్షణను చంపి
విలువైన భవితను
బలి తీసుకుంటుంది
విప్లవం - అవ్యవస్థపై
యువశక్తి, నవయువశక్తి
శక్తియుక్తులు, రక్తము
సైతం దార్ల హస్తగతం
మారిన అసలు అభిమతం
ఎర్ర సేనగా మారి
దేనికో ఎర్రై
గొడ్డళ్లతో నరుకుతూ
కొడవళ్లతో తరుగుతూ
చంపాల్సినదాన్ని బ్రతికిస్తూ
ఉంచాల్సినదాన్ని బలితీస్కుంటూ
బూజుదులిపే కర్ర
బూర్జు వాలకు వరంగా
విప్లవ సాహిత్యం
వికృత మయిందా!
పెద్దరికం దాన్ని
తిరగ వ్రాయించుకుందా?
సమస్యల పరిష్కారం
సమస్యల కారకమయింది.
స్వార్థం చేతికి చిక్కింది
సామాన్యునికి శాపమయింది.
యిప్లవం యూదిందిరా! అని
ఊది వదిలారు, వారు లేరు.
నేటిది అది కానేకాదు
యిప్లవంలో కూడు, గుడ్డ
యాడ? కన్పించదే?
కండతో శ్రమిస్తే తిండి
కండలోని కక్ష, కర్కసంకు
కూడు, గూడు, గుడ్డ దూరం
కారుణ్యం - ముద్దు
క్రూరత్వం వద్దొద్దు
ఉద్యమాలపుడు
ఉరకలెత్తి
విధ్వంసాలపుడు
ఆగలేదా గాంధీ!
గాంధీ శ్రమిపుడు
స్వార్థం.. హక్కు భుక్తం
పెట్టుబడి దారీ
పెత్తందారీ
పెద్దరికంల
ముద్దు పేరే స్వార్థం.

**- బండి ప్రసాదరావు**

# విశ్వవిజేత నెపోలియన్

"ఒకచేత్తో కలంపట్టి, మరోచేత్తో కత్తిబట్టి నేనొకనాడు ఈ ప్రపంచాన్ని జయిస్తానని" తన తల్లికి ఏడేళ్ళ ప్రాయంలో ఉత్తరం వ్రాశాడు నెపోలియన్ బొనపార్టి. బోనపార్టి అనేది తల్లి ఇంటి పేరు. అతని జీవితకాలం అర్ధశతాబ్ద కాలం కావచ్చు (51 సం॥), అతని విజయ పరంపర దశాబ్దకాలం కావచ్చు, కానీ కొన్ని యుగాలు నిలిచిపోయే చరిత్ర సృష్టించాడు. కొందరు చరిత్రలో భాగస్వాములవుతారు, కొందరు చరిత్రను సృష్టిస్తారు. నెపోలియన్ రెండవ కోవకు చెందినవాడు. ఫ్రాన్స్ దేశమంతా మరీ ముఖ్యంగా పారిస్ నగరం సుమారు మూడురోజులపాటు అతని జన్మదినాన్ని అంగరంగ వైభవంగా జరుపుకుంటారు (ఆగష్టు 15). ఒక్కమాటలో చెప్పాలంటే అతను ఫ్రెంచి ఆత్మ, ఫ్రాన్స్‌కు ప్రతిరూపం.

ఫ్రెంచి రివల్యూషన్ తరువాత ఒక దశలో ప్రజలు మూడు వర్గాలుగా విడిపోయారు. ఒకరు రాజరిక కుటుంబవ్యవస్థకు మద్దతు ఇచ్చేవారు (తక్కువ) రెండవవారు లెఫ్టిస్ట్‌లుగా పిలువబడిన జాకోబియన్స్ ముఖ్యమైన వర్గం. మూడోవారు రైటిస్ట్‌లు. జాకోబియన్ నాయకుడు రోబస్ పియరీ కాలంలో అతని ముఖ్య అనుచరునిగా మిలటరీలో ప్రముఖ స్థానాన్ని పొందిన నెపోలియన్ తరువాతి కాలంలో (1799) ఫ్రాన్స్ నియంతగా మారి, ఆ తరువాత చక్రవర్తిగా అవతరించాడు. విప్లవం తరువాత ఏర్పడిన గందర గోళ, అస్థిర పరిస్థితులలో అవకాశాలను చేజిక్కించుకున్న రాజకీయ చతురడతను. మొత్తం 60 యుద్ధాలు చేశాడు. నలభైకి పైగా యుద్ధాలలో అతనిదే పైచేయి. పోర్చుగల్, రష్యా, స్వీడన్ మినహా మిగిలిన ఐరోపా దేశాలనన్నిటినీ జయించాడు. ఇంగ్లండుకు వ్యతిరేకంగా ఈ అన్నిదేశాలనూ కలుపుతూ 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ యూరప్'ను స్థాపించి ఇంగ్లండ్‌ను ఒంటరి చేయాలనుకున్నాడు. ఇంగ్లండ్ వస్తువులు ఎవరూ కొనరాదనే నిషేధాజ్ఞను ధిక్కరించినందుకు రష్యాపై యుద్ధం ప్రకటించాడు. మాస్కో ప్రజలు లొంగక తమ నగరానికి తామే నిప్పంటించుకున్నారు. భౌతికంగా విజయం సాధించి నైతికంగా రష్యన్ జాతీయత ముందు గెలిచి ఓడిపోయారు.

నెపోలియన్‌ను కట్టడి చేయాలనే తలంపుతో ఇంగ్లండ్, రష్యా, ప్రష్యా లాంటి దేశాలు ఒప్పందం కుదుర్చుకుని యుద్ధం (1814) లో అతన్ని ఓడించాయి. అప్పుడు ఎల్బా ద్వీపానికి కాందిశీకునిగా పంపబడ్డాడు.

టుష్కన్ సముద్ర తీరానికి 20 కిలోమీటర్ల దూరంలో ఎల్బా' అనే చిన్న దీవి ఉంది. 'ఎంపరెర్' అనే గౌరవ సూచిక పదాన్ని నెపోలియన్ పేరు ముందు అలానే ఉంచారు. ఎల్బాలోని జనాభా 12 వేలు. "కుంజర యూధంబు దోమ కుత్తుక జొచ్చెన్' అన్నట్లుగా ఆ మహావిజేత సామ్రాజ్యం ఇప్పుడు ఆ చిన్న దీవికే పరిమితమైంది. అయినా 'పని రాక్షసుడయిన' నెపోలియన్ ఊరకనే ఉండలేదు. ఆ ప్రాంత ప్రజలతో ఒక చిన్న నావికా దళాన్ని, ఆర్మీనీ తయారు చేశాడు. అక్కడ భూగర్భంలో నిక్షిప్తమయిన ఇనుప ఖనిజాన్ని వెలికి తీశాడు. వ్యవసాయదారులకు శాస్త్రీయమైన, నూతన సేద్యపు విధానాలపై అవగాహన కల్పించాడు.

మార్చి 7వ తేదీ 1815 సంవత్సరంలో 'ఎల్బా' నుంచి తప్పించుకొని ఫ్రాన్స్‌లోని 'గొలిగన్' ప్రాంతంలో కాలుపెట్టాడు. నెపోలియన్ తిరిగి వచ్చాడన్న సంగతి తెలుసుకున్న ఫ్రెంచి రాజయిన 18వ లూయిస్ అతను కనిపిస్తే కాల్చివేయమని ఆజ్ఞను జారీచేస్తూ 5వ రెజిమెంట్ సైన్యాన్ని పంపాడు. రెండు రోజుల తరువాత (9.3.1815) రెజిమెంట్ అతన్ని ఎదుర్కొంది. నెపోలియన్ వారి ముందు నిలబడ్డాడు. అప్పుడతను ఒక వాక్యాన్ని ఆయుధంగా ఉచ్ఛరించాడు. అది "అవును, నేనే, మీ ప్రభువును. మీరు కావాలనుకుంటే నన్ను చంపవచ్చు"నన్నాడు. ఎవ్వరూ ఒక్కడుగు ముందుకు వేయలేదు. నెపోలియన్ కాలంలో ఫ్రెంచి దేశస్థులు అనుభవించిన సువర్ణఘడియలు వాళ్ళ కళ్ళముందు కదలాడాయి. ఒకొక్కరుగా వెళ్ళి అతని వెనుక నిలుచున్నారు. "మా ప్రభువు నెపోలియన్‌కు జయమగుగాక" అంటూ

సింహనాదాలు చేశారు. వారు తన వెంటరాగా నెపోలియన్ పారిస్ వైపు అడుగులు సారించాడు. రాజైన 18వ లూయిస్ ఇంగ్లండ్ దేశానికి దాసానుదాసునిగా మారి, ఫ్రెంచి దేశపు ఆత్మ గౌరవాన్ని కించపరచాడనే భావన అప్పటికే ప్రజల మనస్సుల్లో గాఢంగా ఉంది. నెపోలియన్ కాలంలో జరిగిన యుద్ధాలలో సుమారు 60 లక్షలమంది ఫ్రెంచి యువకులు ఆ మహాయజ్ఞంలో సమిధలుగా ఇంటికొక్కరుగా నేలకొరిగారు. అయినా ప్రజలకతనిపై ద్వేషభావం లేదు. కదలివస్తున్న సైన్యాన్ని నడిపిస్తున్న నెపోలియన్ కనులలో దృఢచిత్తతను చూశారు. ఫ్రెంచి ప్రజల ఆధిపత్యానికి, ఆకాంక్షకు ప్రతిబింబంగా అతను కనిపించాడు. ప్రజలు తండోప తండాలుగా తమ ఇంటి ముందు నిలచి అతనికి స్వాగతం పలికారు. సంగతి తెలుసుకున్న 18వ లూయిస్ కుటుంబంతో సహా పలాయనం చిత్తగించాడు. ఆస్ట్రియాలో తలదాచు కున్నాడు. ఒక్క బొట్టు రక్తం చిందించకుండా నెపోలియన్ తిరిగి ఫ్రాన్స్‌కు రాజయ్యాడు.



ఇప్పుడిక నెపోలియన్‌కు ముందున్నవి రెండే మార్గాలు 'విజయమో, వీరస్వర్గమో.' ఉన్న వనరులతో తిరిగి సైన్యాన్ని సమాయుత్త పరిచాడు. బెల్జియం వద్ద నున్న 'వాటర్‌లూ'లో ఇంగ్లండుతో జరిగిన యుద్ధంలో మొదటి మూడు గంటలూ నెపోలియన్‌దే పైచేయి అయింది. ఆ తరువాత ప్రష్యా నుంచి సేనలు వచ్చి బ్రిటిష్ సైన్యంతో కలవటంతో, అల్పసంఖ్యలో ఉన్న ఫ్రెంచి సైన్యం ఓటమి చవిచూసింది. ఈసారి నెపోలియన్‌ను ఖైదీగా సైయింట్ హెలీనాకు తరలించారు. 1821 సంవత్సరం మే 5వ తేదీన విజేత కన్నుమూశాడు. వాటర్‌లూ యుద్ధాన్ని నడిపిన 'వెలింగ్‌టన్' "In this age, in past age, in any age Napolean is the best" అంటూ తన ప్రత్యర్థికి నివాళులర్పించారు.

నెపోలియన్‌లో లోపాలు లేకపోలేదు. గర్విష్టి. స్వల్ప ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని యుద్ధాలు చేశాడంటూ బ్రిటిష్ చరిత్రకారులు చెప్పినా (ఎన్‌సైక్లోపిడియా, బ్రిటానికా) అతనిని ఒక గొప్ప స్టేట్స్‌మన్‌గా ప్రపంచం గుర్తించింది. రాజకీయ పరమైన ఎత్తులు వేయటంలో, ఆర్థిక ప్రణాళికా రచనలలో, శాస్త్రీయ దృక్పథాన్ని అన్నిరంగాలకూ మళ్ళించటంలో ఆనాటి సమకాలీన కాలంలో అతన్ని మించిన వారు లేదు. లలిత కళలను అమితంగా ప్రేమించాడు. వెస్టర్న్ క్లాసికల్ సంగీతపు విజర్డ్ అయిన బీతోవెన్‌ను అభిమానించాడు, ఆదరించాడు. క్లాసికల్ చిత్రకారు డయిన (ముఖచిత్రం డేవిడ్ వేసినది) డేవిడ్‌ను తన ప్రభుత్వ ఆస్థాన చిత్రకారునిగా నియమించాడు. దేశ దేశాలలో విజయం సాధించిన తరువాత ఆయాదేశపు ప్రసిద్ధ చిత్రకళా ఖండాలను పారిస్‌లోని లూర్ మ్యూజియమ్‌కు తరలించాడు. వీటన్నిటికంటే ముఖ్యమైనది 'నెపోలినిక్ కోడ్'గా పిలువబడుతున్న సివిల్‌లా, న్యాయశాస్త్రంలో తీసుకొని వచ్చిన మార్పులు. ఇప్పటికీ ఇది యూరోప్‌లోని నాల్గవవంతు దేశాల్లో అమలులో ఉంది. ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా సామాన్యుల ఆస్తిహక్కును ఒక ప్రాథమిక హక్కుగా చట్టం చేశాడు. యూదుల పట్ల వివక్షతను ఎత్తివేసిన మొదటి చక్రవర్తి కూడా అతనే.

నెపోలియన్‌ది వైజ్ఞానిక దృష్టి. ఏ మతంపైనా విశ్వాసం లేనివాడు. 'మతాలన్నీ మనుషులు సృష్టించినవే' అన్నాడు. అందుకే తన పట్టాభిషేక మహోత్సవంలో పోప్ తన తలపై కిరీటం ఉంచబోతున్నప్పుడు దానిని తన చేతులతో లాక్కుని తన తలపై తానే పెట్టుకున్నాడు. నెపోలియన్ కాలంలో విద్య పూర్తిగా మతాధిపతుల చేతుల్లో ఉండేది. ఉన్నత విద్యనభ్యసించడానికి చర్చికిగాని, కాథిడ్రల్‌కుగాని, అబ్బెకుగాని విద్యార్థి వెళ్ళవలసి ఉంది. బయటెక్కడా విద్య లభ్యమయ్యేది కాదు.

ఏ దేశమైనా బలపడాలంటే విద్య ఒక ముఖ్యమైన అవసరమని, పౌరులందరికీ విద్యగరపటం ప్రభుత్వ బాధ్యతని గుర్తించి అమలుపరిచిన మొదటివాడు నెపోలియన్. అతని తరువాతే ప్రపంచాధిపతులు అతని మాటలలోని సత్యాలను గ్రహించారు.

నెపోలియన్ యుద్ధ తంత్రాలను ఈనాటికి బ్రిటన్, అమెరికా దేశాల్లో సైనిక శిక్షణ ఇచ్చేటపుడు అకడమిక్‌గా బోధిస్తున్నారు. "నన్ను ఏమయినా అడుగు ఇస్తాను, నా సమయాన్ని తప్ప." "సింహాసనమన్నది మఖమల్ గుడ్డతో కప్పబడిన ఒక చెక్క కుర్చీమాత్రమే." "యుద్ధంలో తన ప్రాణాలను ఒడ్డిన సైనికునికి మనం ఏమిస్తున్నాము? రిబ్బన్‌తో చుట్టబడిన ఒక మెదల్ తప్ప", "వెయ్యి తుపాకీలకు భయపడను. ఒక్క పత్రికకు భయపడతాను." ఇలాంటివి ఎన్నో అతని కొటేషన్స్ పుస్తక రూపంలో వచ్చాయి. ఒకేసారి 8మంది వ్యక్తులకు భిన్నమైన విషయాలపై లేఖలను డిక్టేట్ చేయగలిగిన అమోఘమైన జ్ఞాపక శక్తి అతనిది.

నెపోలియన్ మరణిస్తూ పలికిన చివరి మాటలు, 'ఫ్రాన్స్, మిలటరీ, జోసఫిన్' (ఈమె నెపోలియన్ ప్రాణాధికంగా ప్రేమించిన ప్రియురాలు, తరువాత భార్య).

రెండవ ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన హిట్లర్ ఏప్రిల్ 30వ తేదీ 1945వ సంవత్సరంలో ఆత్మహత్య చేసుకుంటూ తనను మే 5వ తేదీన ఖననం చేయాలని కోరుకున్నాడు. కారణం అది నెపోలియన్ మరణించిన రోజుకావడమే.

చరిత్ర సృష్టించిన నెపోలియన్ జీవితంపై, అనేక గ్రంథాలు ప్రపంచ సాహిత్యంలో వెలువడినాయి. అందులో ముఖ్యమైనవి లుడ్విగ్, విల్‌డురాంట్ వ్రాసినవి.

**- ఎన్. ఆర్కే**

---

## Statement about ownership and other particulars of **MISIMI**

## <u>FORM IV (SEE RULE - 8)</u>

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Hyderabad |
| 2. | Periodicity of Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 4. | Publisher's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 5. | Editor's Name | : | CHENNURU ANJANEYA REDDY |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 6. | Names and Addresses of Individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total capital | : | Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |

I, ALAPATI BAPANNA, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
**ALAPATI BAPANNA**
Publisher

Date : March 1, 2011.

# కవిత్వం నిరర్థకమా?

**- జగన్నాథ ప్రసాద్ దాస్**

ఈరోజు మీ అందరి సమక్షంలో ఉండటం నాకు చాలా సంతోషం కలిగిస్తూంది. మీరిక్కడ చేరడం నాకు గౌరవ ప్రదం. రచయిత, పాఠకులు కలుసుకోవడం అరుదుగానే జరుగుతూ ఉంటుంది. వారిని ఒకచోటికి చేర్చే ఏ సందర్భమైనా స్వాగతించదగిందే.

పాఠకులు, విమర్శకులు తమ రచనల పట్ల అనాసక్తంగా ఉంటున్నారని కొందరు రచయితలు బాధపడుతూ ఉంటారు అయితే నా అనుభవం మాత్రం కొంచెం వేరుగా ఉంది. పాఠకులు, మిత్రులు, పరిచయస్థులు, అప్పుడప్పుడు అపరిచితులు కూడా నాపైన దయ-ప్రేమల వర్షం కురిపించారు. ఇది ఎంతవరకంటే, ఎన్నోసార్లు నాకు అనిపిస్తూ ఉంటుంది, నేనిందుకు తగుదునా? అని. నేను రాసింది కొంచెమే అయినా దానికి ప్రతిఫలంగా ప్రజలనుంచి చాలా ఎక్కువే పొందాను. ప్రజలు ఉదార భావంతో నాకిచ్చిన గొప్ప ఆదరణకు యోగ్యునిగా మారడానికి నేనింకా చాలా చేసి ఉండవలసిందని కూడా నాకు చాలాసార్లు అనిపిస్తూ ఉంటుంది.



ఇలాంటి సందర్భాల్లో రచయిత సాహిత్యాన్ని గురించి మాట్లాడాలని, తను చేసిన రచనల గురించి, తన ఆలోచనా ధోరణి గురించి చెప్పాలని ఆశించడం కద్దు. దురదృష్టం కొద్దీ నేను ఏదో కొంత రాశానే తప్ప ఏ సాహిత్య సిద్ధాంతంలో గానీ, ఎలాంటి సాహిత్య చర్చల్లో గానీ, నాకు ఆసక్తి ఎన్నడూ లేదు. నేను చెప్పదలుచుకున్నది ఏదైతే ఉందో, అది నా కవితల్లో చెప్పాను. నేనిక వివరించవలసిన విషయాలు గానీ, చేయవలసిన సిద్ధాంత ప్రకటనలు గానీ ఏమీ లేవు.

కానీ ఒక రచయితగా నాలోని బలహీనతల గురించి, నన్ను వేధించే సందేహాలగురించి బహుశా కొంత చెప్పగలనేమో! నేను చాలా లోతుగా ఆలోచించి రచన చేశాను. అయితే రచన కోసం నా పూర్తి జీవితాన్ని, సమయాన్ని, అంకిత భావాన్ని ఇవ్వలేకపోయాను. రచనకోసం తమ పూర్తి సమయాన్ని వెచ్చించే రచయితలకు, రచనను వృత్తిగా చేపట్టిన రచయితలకు, అలా చేయడం సాధ్యమే... కానీ రచనకు కొద్ది కాలం మాత్రమే వెచ్చిస్తూ అదివారం మాత్రమే రాసే నాలాంటి రచయితలు రాయకుండా ఉండడానికి ఎప్పుడూ ఏదో ఒక సాకు వెతుకుతూనే ఉంటారు. ఉదాహరణకు - ఈ రోజు గాలి బాగా లేదు, ఈ రోజు నేను బిల్లు చెల్లించే ముఖ్యమైన పని చేసేయాలి, లేదా అన్నింటికంటే పెద్ద కారణం, ఈ రోజు నాకు రాసే మూడ్‌లేదు, అనే దాన్ని ఆసరాగా తీసుకోవడం జరుగుతుంది.

నా మనసును తొలిచే మరో సందేహం - నేనెందుకు రాస్తున్నాను? నేను రాసింది ఎవరైనా చదువుతున్నారా లేదా? అనేది. ఒరియా పుస్తకాలు చదివేవారి సంఖ్య చాలా తక్కువ. కవిత్వం చదివేవారి సంఖ్య అయితే మరీ తక్కువ. అయితే, పాఠకుల సంఖ్య తక్కువగా ఉన్నప్పుడు రచయితకు తన మనసులోని మాట తన పద్ధతిలో చెప్పే స్వేచ్ఛ ఉంటుంది కదా! అని నన్ను నేను సమాధానపరచుకొని రాస్తూ పోయాను.

హిందీ నుంచి తెలుగు : డా. జె. లక్ష్మిరెడ్డి, ఫోన్ : 09811589430

నా మనసులో మరో ప్రశ్న కూడా తలెత్తుతూ ఉండింది. గుజరాత్‌లో ఏదైతే జరిగిందో, అది జరిగిన తర్వాత కవిత్వం రాయడం సాధ్యమా? అనే ప్రశ్న. ఈ ప్రశ్నకు నా పద్ధతిలో నేను సమాధానం చెప్పుకున్నాను. గుజరాత్‌లో ఏదైతే జరిగిందో, దాని తర్వాత గుజరాత్ గురించే రాయడం వీలవుతుందని, అది రాసి వాల్మీకి మహాకావ్య కల్పనకు వెలుపల అయోధ్య అనేది మరెక్కడా లేదనే సత్యాన్ని మనం పరిపుష్టం చేయగలమని.

సమాజంలో కవి స్థానం ఏమిటి? అనే దాన్ని గురించి కూడా నేను చాలా సార్లు ఆలోచిస్తాను. సాహిత్యకారుడు తన సాహిత్యం ద్వారా సమాజాన్ని మార్చాలని అందరు కోరుకుంటారు. సమాజం వెలిబుచ్చే ఈ కోరిక బరువును రచయిత భరించలేడు. పేదరికం, పీడన, అవినీతి, క్రమశిక్షణా రాహిత్యం, రోగాలు – రోష్టులు, అసంతృప్తి, హింస, అలజడి నలువైపుల వ్యాపించి ఉన్నప్పుడు పాపం, కవి మాత్రం ఏం చేయగలుగుతాడు? ఈ ప్రశ్నకు నాకు తోచిన సమాధానం నేను చెప్పుకుంటాను. అదేమిటంటే, కవి తాను ఏది చేయగలడో, అదే చేయాలి – అదే, కవితలు రాయడం. ప్రపంచం సత్యం తెలుసుకొనేలా వాటిని గురించి రాయడం. చెఖోవ్ అన్నట్లు, సమస్యను పరిష్కరించడం, సమస్యను యథాతథంగా చిత్రించడం, ఈ రెండింటిలో రెండవది మాత్రమే కళాకారుని బాధ్యత.

భారతీయ భాషల్లో రాసే మేము మరో సమస్యను కూడా ఎదుర్కొంటున్నాము. ప్రపంచీకరణ కారణంగా మన సమాజంలో వలసపాలనలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ సమాజంలో పెరుగుతున్న ఇంగ్లీషు ప్రాబల్యంవల్ల మన భాషల మనుగడకు ప్రమాదం ఏర్పడబోతూంది. మన భాషలను కాపాడుకోడానికి మనకున్న మార్గం ఒక్కటే – ఆ భాషల్లో రాయడం, వాటిలో విస్తారంగా మంచి సాహిత్యం సృష్టించడం. ఈ ప్రయత్నానికి నాకు చేతనైనన్నాళ్ళు నా సహకారం అందిస్తూ ఉండగలననే నమ్మకం నాకుంది.

**భారతీయ భాషల్లో రాసే మేము మరో సమస్యను కూడా ఎదుర్కొంటున్నాము. ప్రపంచీకరణ కారణంగా మన సమాజంలో వలసపాలన లాంటి పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ సమాజంలో పెరుగుతున్న ఇంగ్లీషు ప్రాబల్యంవల్ల మన భాషల మనుగడకు ప్రమాదం ఏర్పడబోతూంది.**

మీ ముందు మరో విషయం కూడా నేను అంగీకరించాలి. అది రాయడం నాకు సులభమైన పనిగా ఎన్నడూ లేదనే విషయం. కొందరు కవులు అంటూ ఉంటారు, ఏదో దైవీయ శక్తి కవితలు చెప్తూపోతూ ఉంటే వాళ్ళు కాగితంపైన రాసే పని మాత్రం చేస్తూ ఉంటారని. నేనంత భాగ్యశాలిని కాదు. మరికొందరు అంటూ ఉంటారు, కవిత్వం తనంతతానే వాళ్ళకు తోస్తూ ఉంటుందని. కవిత్వం ఎక్కడి నుంచి పుట్టుకొస్తుందో తెలిస్తే, నేనూ అక్కడికి వెళ్ళేవాణ్ణి. నామటుకు నాకు రాయడం ఎల్లప్పుడూ కష్టసాధ్యమైన పనిగానే ఉంటూ వచ్చింది. ఏదైనా ఒక రచన పూర్తి చేసిన తర్వాత కలిగే సంతృప్తే గనక నాకు కలగకుండా ఉండి ఉంటే, బహుశా నేనెప్పుడో గానీ రాసేవాణ్ణి కాదేమో! రాయడం చాలా శ్రమతో కూడిన పని. బహుశా అందుకేనేమో, ఎంత రాశానో, అంతకంటే ఎక్కువ రాయలేకపోయాను. ఎంతో కొంత రాయడమే కాక నా జీవితం పూర్తిగా జీవించడానికి కూడా నేను ప్రయత్నం చేశానని ఆలోచించి తృప్తి పడుతూ ఉంటాను. నేను రాయకపోవడం వల్ల సాహిత్యానికి నష్టం కలుగుతుందని గనక నాకు అనిపించి ఉంటే బహుశా నేను మిగతా పనులన్నీ వదలిపెట్టి ఇంకా ఎక్కువగా రాయడానికి ప్రయత్నించే వాణ్ణి. అయితే నాకలాంటి భ్రమగానీ, అహంకారంగానీ ఎప్పుడూ కలగలేదు.

నేటి ఈ సందర్భం నన్ను మరింత వినయవంతునిగా చేయడమే కాక, నా పరిమితులు, నాలోని లోటుపాట్లు మరింత బాగా తెలిసి వచ్చేట్లు చేస్తూంది. ఇప్పుడు అయ్యో! నేను ఇంకా కొంచెం ఎక్కువ రాసి ఉంటే, నా మనసులో తేలియాడుతూ ఉండిన ఆలోచనలకు రూపం ఇచ్చి ఉంటే, సగంరాసి వదిలిపెట్టిన రచనలను పూర్తి చేసి ఉంటే, ఎంత బాగుండేది! అనిపిస్తూంది. ఇదంతా చేయడానికి వయసులో కొంచెం చిన్నవాడినయి ఉంటే ఎంత బాగుండేది, అని కూడా అనిపిస్తూంది!

ఈ సమ్మానం పొందిన పుస్తకాన్ని గురించి నేను కొంత చెప్పాలేమో. అది ఒక కథల పుస్తకమో, నవలో అయి ఉంటే క్లుప్తంగా కథ చెప్పి వినిపించే వాణ్ణి. అయితే ఒక కవితా వస్తువు గురించి క్లుప్తంగా చెప్పడం గానీ, దాన్ని వివరించడం గానీ వీలుపడదు. ఎందుచేతనంటే ఒక కవితలో చెప్పిన

విషయానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో అది చెప్పిన విధానానికి కూడా అంతే ప్రాధాన్యం ఉంటుంది. నేను చేయగలిగిందల్లా సంపుటిలోంచి ఒక కవిత చదివి వినిపించడం మాత్రమే. మీలో కొందరైనా ఎప్పుడో ఒకప్పుడు పుస్తకం చదివే శ్రమ తీసుకుంటారని ఆశిస్తాను.

ఈ నివేదన అనంతరం ఎంతో వినయంతో సమ్మానం స్వీకరించి, కవిత్వం రాయడానికి నాకు ప్రేరణ కలిగించిన మునుపటి ఒరియా కవులకు, నాకు ప్రోత్సాహాన్నందించిన నా సమకాలికులకు, ముఖ్యంగా ఒరియా కవిత్వాన్ని వినూత్న దిశల్లో నడిపించేందుకు సిద్ధంగా ఉన్న యువ కవులకు దీన్ని సమర్పిస్తున్నాను.

**కవిత్వానికి అర్థం :**

కొందరు అడగుతుంటారు / కవిత్వం అంటే ఏమిటి? అని.
చివరకు కవిత్వంతో ఎలాంటి సంబంధమూ లేనివాళ్ళు కూడా.
అయితే కాలం అంటే ఏమిటి? / ప్రేమకు నిర్వచనం ఏమిటి?
జీవితానికి ఉద్దేశ్యం ఏమిటి అని ఎవరూ అడగరు.
ఎవరో చెప్పినమాట నిజమే, / కవిత్వం ఎవరూ చదవరని –
చేపలమ్మే వాడుగానీ, ముఖ్యమంత్రిగానీ, ప్రచురణకర్త గానీ
ప్రొఫెసరు గానీ/ అందరికీ తెలిసిన మరో విషయం
వీళ్ళంతా ఇంద్రధనుస్సును గానీ / సీతాకోక చిలుకను గానీ,
వర్షపు చినుకుల చిటపటలు గానీ,
భూమి సువాసనలను గానీ, పట్టించుకోరని
అందరికీ తెలిసిన మరో విషయం కూడా ఉంది
కవిత్వం విప్లవం తీసుకురాలేదని / ఆకలి కడుపుల ఆర్తి తీర్చలేదని
పోలీసుల తుపాకి గుండ్లను అడ్డుకోలేదని
అంతేకాదు, అది ఒక్క నైతిక సూత్రాన్ని కూడా నేర్పలేదని
అదే కవి ఉద్దేశ్యం అయి ఉంటే,
కలానికి బదులు తుపాకి చేత పట్టుకొని/దారుల వెంబడి తిరిగేవాడు
యుద్ధ నినాదాలు ఎలుగెత్తి పలికేవాడు
కవితలు బదులు నినాదాలు రాసేవాడు/ నీతి సూత్రాలు కూర్చేవాడు
పుస్తకాలు చదివేవాళ్ళు కూడా
సాధారణంగా కవిత్వానికి దూరంగానే ఉంటారు
అయినా ఇప్పటికీ కొందరున్నారు / ఉన్మాదులు:
కవిత్వం చదివేవాళ్ళు / వాళ్ళు కవితలు చదువుతారు
కవితో కలిసి కవిత్వం సృష్టిస్తారు దానికి ఇంకా ప్రాణం పోస్తారు కూడా!
కవిత్వం ఎవరికోసం?
మొదటిసారి చదివినప్పుడు అర్థం కాకపోయినా
నిబ్బరంతో మరోసారి చదివే ప్రయత్నం ఎవరు చేస్తారో, వాళ్ళకోసం
కవితార్థం అంటే? / అనుమానాల అస్పష్టార్థాల గుండా నడిచి
దృష్టి సరిహద్దులను దాటి పాఠకుని మనసు అంతరాంతరాళాల్లోకి
ప్రవేశించేది మాత్రమే
కవితా ప్రయోజనం అంటే?
ద్వంద్వార్థాల, అవ్యక్తతా స్పష్టతల మధ్య పాఠకునికి ఎంత
అర్థమవుతుందో, అంతే.
అంతకు మించి మరేమీ లేదు / కవిత ప్రేమలాంటిది. కావాలంటే
కాలం లాంటిదనైనా అనవచ్చు / అది స్వయం పూర్ణమైంది
అది దేన్నీ ఆశించదు, / దేన్ని కాంక్షించదు
దానికదే సాధన, దానికదే సిద్ధి, / దానికదే వస్తువు, విస్తారం,
దానికదే సంగీతం, సమర్థన, ఔచిత్యం/స్వయంభూ అయిన కవి
అర్థాన్నీ సృష్టిస్తాడు / నిగూఢతనూ సృష్టిస్తాడు
ఛందోలంకారాలకతీతంగా పుడుతుంది కవిత్వం
అది ఉంటుంది ఉపమ, రూపకాలంకారాలకతీతంగా
వ్యాకరణానికి, వర్ణక్రమానికి / విరామ చిహ్నాలకు అతీతంగా
ఉంటుంది విమర్శకుల, సమాలోచకుల, / బోధకుల, టీకాకారుల,
వ్యాఖ్యాతల నిరంకుశాధిపత్యం నుంచి స్వచ్ఛందంగా
ఉంటుందది తన సర్వస్వతంత్ర సామ్రాజ్యంలో
తన సమ్రాట్టు, తన సార్వభౌముడు తానే అయి, కవిత్వం తన
దగ్గరకు లాక్కెళ్ళుతుంది / అర్థమైనా, కాకపోయినా
కవిత్వం ప్రలోభ పెడుతుంది, ఆశపెడుతుంది.
వినయభావంలేని పదాలకు / బేషరతుగా లొంగిపోవడానికి,
కవిత్వం ప్రతిసారి నిర్బంధిస్తుంది.
చకిత నేత్రాలను మళ్ళీ వెనుకటి పంక్తి వైపు మళ్ళడానికి.
ఎవరూ చదవరు కవిత్వం, / ఎవరికోసం అది రాయబడిందో,
వాళ్ళు సైతం చదవరు / ఇక ఎవరైనా అనవచ్చు మరి
కవిత్వం నిరర్థకమనీ / జీవితానికి అంతరాయమని.
అదినిజమే / కానీ... / ఆలోచిస్తే / మరి జీవితమంటే ఏమిటి?
ఒక అనామక కవితలోని / అస్పష్టమైన కొన్ని పంక్తులు కాక!

**జీవితం, సాహిత్యం:**

1936లో జన్మించిన జగన్నాథ ప్రసాద్ దాసు అలహాబాదు విశ్వవిద్యాలయం నుంచి రాజనీతిశాస్త్రంలో ఎమ్.ఎ. పట్టా పొందారు. ఆ విశ్వవిద్యాలయంలోనే కొంతకాలం లెక్చరరుగా పనిచేసిన తర్వాత 1956లో ఐ.ఏ.ఎస్.కు ఎంపిక అయ్యారు. పరిపాలనా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా ఆయన అధ్యయనం ఆగలేదు. కళా చరిత్రలో పిహెచ్.డి పట్టా పొందారు. ఇంగ్లాండులోని University of Sussex నుండి వికాసశీల అర్థశాస్త్రంలో

ఒక కోర్సు చేయడమే కాక Homi Bhabha Fellowship పొంది కూడా కొంత పని చేశారు. ఆయన నిరంతరం చేస్తూ వచ్చిన అనేక విషయాల అధ్యయనం, ఆయన సాహిత్య సృజనకు ఎలాంటి అంతరాయమూ కలిగించలేదు. అంతేకాక సాహిత్య రచనపట్ల పెరిగిన మక్కువ కారణంగా పదవీ విరమణకు పది సంవత్సరాలు మునుపే అంటే, 1984లో I.A.S.ను వదలిపెట్టి పూర్తిగా రచనకు అంకితమై పోయారు. సాహిత్య లోకంలో జే.సి. పేరుతో పిలువబడే ఈ ప్రముఖ రచయిత దాదాపు అన్ని సాహిత్య ప్రక్రియల్లో రచనలుచేసి పేరు పొందారు. పదిహేను కవితాసంపుటాలు, ఐదు నాటకాలు, ఏడు కథా సంపుటాలు, ఒక చారిత్రక నవల, పిల్లల కోసం ఒక కవితా సంపుటి, ఒక సరదా పద్యాల (nonsensical verses) సంపుటి వెలువరించారు. ఒరిస్సా కళకు సంబంధించిన ఈయన రచనలు – 'Puri Paintings', 'The Chitrakara and His Work', 'Chitra Pothi', 'Illustrated Palm - Leaf Manuscripts, 'Palm - Leaf Miniatures.' ఈయన ఇతర భాషల నుంచి ఒరియాలోకి, ఇంగ్లీషులోకి అనువాదాలు కూడా చేశారు.

చింతనను అన్నింటికంటే ఎక్కువగా అభిమానించే జగన్నాథ ప్రసాద్ దాస్ తన్ను కవిగానే అందరు భావించాలని కోరుకుంటారే గాని, అప్పుడప్పుడు కవితలు రాసే గద్య రచయితగా కాదు. 2006 సంవత్సర 'సరస్వతీ సమ్మాన్' పొందిన ఈయన ఒరియా కవితా సంపుటి 'పరిక్రమ'లో జీవితం, మృత్యువు, కాలం యొక్క ప్రకృతి, కవితా కళ వీటిని గురించిన కవితలు ఎక్కువగా ఉన్నాయి. ఈయన తన జీవితంలోని అనేక విధాలైన అనుభవాలసారాన్ని కవితల్లో పొందుపరుస్తారు. అయితే భాష ఆత్మాభివ్యక్తికి ఆటంకమని పించినపుడు దాన్ని అధిగమించే ప్రయత్నం కూడా చేస్తారు. 1998లో వెలువడిన 'పరిక్రమ'లో చిన్నవైనా లోతైన గీతాలున్నాయి. వీటిలో సంక్లిష్టమైన ఆధునిక సంవేదనకు కవితాత్మకమైన అభివ్యక్తి లభించింది. మామూలు భాషలో కొద్ది పంక్తుల్లోనే జీవితానికి సంబంధించిన లోతైన కావ్యాభి వ్యక్తికి ఉండటం వీటి విశేషత. ఇతర ఆధునిక కవుల వలనే జె.పి. కూడా జీవితం ఎన్నో స్థాయిలుగల అనుభవం అని నమ్ముతూ దాని అతిలోతైన స్థితిని, జీవితానికున్న అర్థాన్ని వెతికేందుకు ప్రయత్నిస్తారు. అందుకోసం ఏ సిద్ధాంతాన్నీ అనుసరించరు.

వీరి సృజనాత్మక రచనలన్నీ ఒరియా భాషలోను, ప్రధానమైన విమర్శా గ్రంథాలన్నీ ఇంగ్లీషులోను ఉన్నాయి. దీన్నిబట్టి ఉత్కృష్ట సృజనాత్మక సాహిత్యం మాతృభాషలోనే రాయడం వీలుపడుతుందనేమాట మరోసారి రుజువవుతుంది.

## జగన్నాథ ప్రసాద్ దాస్‌తో మాటమంతి

**ప్ర: కవి కావాలనే కోరిక మీకు ఎలా కలిగింది?**

**జ:** చిన్నప్పటి నుంచి చదవడమే నాకు అన్నిటిని మించిన ఆనందం ఇస్తూ వచ్చింది (ఇప్పుడు కూడా, ఎన్నో రకాల పుస్తకాలు చదవడంలోనే చాలా వరకు నా కాలం గడిచిపోతుంది). చిన్నతనంలో కవిత్వం కూడా చాలానే చదివాను. కొంత రాయడానికి ప్రయత్నించి ఆ కుర్ర చేష్టలను పత్రికలకు పంపడం కూడా చేశాను. కొందరు సంపాదకులు ఉదారంగా వాటిని ప్రచురించారు కూడా. అయితే రచన చేయడాన్ని వృత్తిగా చేసుకోవాలని ఎన్నడూ అనుకోలేదు. ఒరియాలో అలా ఎవరూ చేయరు కూడా. నిజానికి నా జీవితంలో ఒకానొక కీలకమైన దశలో నా వయసు 18–34 మధ్య ఉన్నప్పుడు దాదాపు 17 సంవత్సరాలపాటు రాయడం పూర్తిగా మానేశాను. అయితే అదృష్టవశాత్తు పోయిన ఆ ఆసక్తి మళ్ళీ వచ్చింది.

**ప్ర: మీ శైలికి ఆదర్శం ఎవరు?**

**జ:** నా కవిత్వానికి ఆదర్శంగా నేను ఎవరినైనా తీసుకున్నానని అనుకోను. చదివే విషయంలో నాది కొంత విశాలమైన దృక్పథం. అనేక భాషల్లో రాసిన పాత, కొత్త కవిత్వం చదివాను. ఎవరైనా ఒక కవి శైలిని అనుసరించాలని ఎప్పుడూ అనిపించలేదు. నా పైన ఎన్నో విధాల ప్రభావం పడి ఉండవచ్చు. అయితే రాయడం మాత్రం నేను రాయదలచుకున్న పద్ధతిలోనే రాశాను.

**ప్ర: ఒక కవిత రాసే ముందు సాధారణంగా మీరు అవలంబించే విధానం ఏమిటి?**

**జ:** "మీరు కవితలు ఎలా రాస్తారు?" అని అడిగినప్పుడు ఆర్హన్ పముక్ నవలలో 'కా' ఇలా జవాబిచ్చాడు –"కవితలు రాయడం ఎలా జరుగుతుందో, నాకు తెలియదు. ఒక మంచి కవిత ఎల్లప్పుడు ఎక్కడో బయటి నుంచి, దూరం నుంచి వచ్చినట్లుగానే తోస్తూంటుంది." ఏ కవి అయినా అలాగే అంటాడనుకుంటాను. కవితలు నా వద్దకు 'రావడం' జరుగుతూ ఉండినా, (సాధారణంగా నేను కోరుకున్నప్పుడు

అవి రావు) అందులో మార్పులు-చేర్పులు చేయడానికి, మెరుగులు దిద్దడానికి, దానికి అంతిమ రూపం ఇవ్వడానికి, చాలా శ్రమ పడవలసే ఉంటుంది.

**ప్ర: కవితను, అకవితను మీరు ఏ విధంగా వేరు పరుస్తారు?**

**జ:** సాహిత్య సిద్ధాంతాల్లో నాకు ఆసక్తి లేదు. వాటిని గురించిన చర్చలకు నేను దూరంగానే ఉంటాను. అకవిత్వమంటూ ఏదైనా ఉందంటారా? కవిత్వం కానిది ఏదైతో ఉందో, అదే అకవిత్వమా? అది గద్యమా? కవిత్వానికి వ్యతిరేకమైంది గద్యం కాదు, సైన్సు అని అంటారు. నాకు మాత్రం తెలియదు. అయితే చదివినప్పుడు నాకు తెలుస్తుంది, ఏది కవిత్వమో. ఒక కవితను రెండోసారి చదివినప్పుడు తెలుస్తుంది. మంచి కవిత్వం అంటే ఏమిటో. మొదటిసారి చదివినప్పుడు అది ఎంత ఆనందాన్నిస్తుందో రెండోసారి చదివినప్పుడు కూడా అంతే ఆనందం ఇస్తుంది. ఇది మాత్రం నేను మాటల్లో నిర్వచించలేని విషయమే.

> **సాహిత్య సిద్ధాంతాల్లో నాకు ఆసక్తి లేదు. వాటిని గురించిన చర్చలకు నేను దూరంగానే ఉంటాను. అకవిత్వమంటూ ఏదైనా ఉందంటారా? కవిత్వం కానిది ఏదైతో ఉందో, అదే అకవిత్వమా? అది గద్యమా? కవిత్వానికి వ్యతిరేకమైంది గద్యం కాదు, సైన్సు అని అంటారు.**

**ప్ర: కవిత్వానికి సంబంధించి, మౌలికమైన ఏ అపార్థాలు మీకు విసుగు పుట్టిస్తాయి? వాటిని మీరు ఎలా తొలగిస్తారు? లేదా ఖండిస్తారు?**

**జ:** ఆధునిక కవిత్వమంతా అస్పష్టంగా, అర్థం కాకుండా ఉంటుందనే అభిప్రాయం నాకు విచారం కలిగిస్తుంది. కవిత్వాన్ని తిరస్కరించే బదులు పాఠకులు దాని పట్ల కొంత ఓర్పు కనపరిస్తే మంచిది. అలా చేస్తే వారికి తగిన ఫలితం తప్పక దక్కుతుంది. కొందరు కవితా ద్వేషులు కవితానురాగులుగా మారడం నేను చూశాను.

**ప్ర: కవిత ఎలా రూపుదాల్చుతుంది?**

**జ:** కవిత అనేది ఎల్లప్పుడు చుట్టు పక్కలే ఎక్కడో ఉంటుంది. దాన్ని గురించి తనదిగా చేసుకునే వాడే కవి. అందులో నిజంగా కష్టమైన పని ఏదంటే, దానికి మూర్త రూపం ఇవ్వడం, పదాలను ఒకదాని తర్వాత మరొకటి ఒక పద్ధతిలో కూర్చడం, మళ్ళీ-మళ్ళీ ఆ పద్ధతిని మార్చడం, పంక్తుల క్రమాన్ని నిర్ణయించడం, అందులో ప్రాణ ప్రతిష్ఠ చేయడం, దాన్ని తగిన విధంగా ముగించడం. కవితను సృష్టించిన తర్వాత కవి పాఠకుల పరిశీలనకు, నిర్ణయానికి దాన్ని వదలి మరో కవిత అన్వేషణలో ముందుకు సాగిపోతాడు.

**ప్ర: కవితకు కాలాతీతమైన ప్రభావం ఎలా కలుగుతుంది?**

**జ:** కాలమే నిర్ణయిస్తుంది, ఏ కవితకు కాలతీతమైన ప్రభావం ఉందో. అభిరుచులు, నిర్ణయాలు, దృక్పథాలు, ఆలోచనలపట్ల, భాషపట్ల ప్రతిక్రియలు అన్నీ కాలంతోపాటు మారుతాయి. నిన్నటి వేడి-వేడి ఆహారం ఈ రోజు సద్దిది, మిగిలిపోయింది, అయిపోతుంది. ఏ కవి అయినా, భవభూతి లాగా భవిష్యత్తులో ఎప్పుడో ఒకప్పుడు, తనలాగా ఆలోచించేవాడు, తనను అర్థం చేసుకునే వాడు వస్తాడని ఆశించవచ్చు. రవీంద్రనాథ్ ఠాగూర్ వంద సంవత్సరాల తర్వాత ఆసక్తితో ఆయన కవిత్వాన్ని చదువుతున్న పాఠకున్ని ఊహించుకున్నాడు. ప్రేమ, మృత్యువు, కాలం, జీవిత రహస్యాలు, ఈ సంకల్పనల పట్ల కౌతుకం ఎల్లప్పుడూ ఉండేదే. అయితే ఈ విషయాలగురించి రాసిన కవిత దీర్ఘజీవిగా ఉండకపోవచ్చు. కవితలు రాయడం జరిగేది ఆలోచనలతోనే కాదు, పదాలతో కూడా కాబట్టి.

**ప్ర: కవితా ప్రకృతిలో ప్రాథమికమైంది, సారభూతమైంది ఏది? కాలంతోపాటు అది మారుతుందా?**

**జ:** సాహిత్య సిద్ధాంతకర్తలను, సాహిత్య సౌందర్య పరిశీలకులను ఈ ప్రశ్నలతో పెనుగులాడ నివ్వండి. కవిత్వం రాసే ఒక వ్యక్తిగా కవితా ప్రకృతి గురించి ఆందోళన చెందడం కంటే కొన్ని కవితలు రాయగలిగితే అదేమేలు, అని నేను భావిస్తాను. ప్రపంచంలో ప్రతి ఒక్కటీ నిరంతరం మార్పు చెందుతూ ఉంది. అందువల్ల కవితా ప్రకృతి కూడా మార్పులకు తప్పక లోనవుతూ ఉందనే భావిస్తాను.

**ప్ర: కవిత్వంలో అన్నిటికంటే ప్రధానమైంది ఏది? దేనివల్ల ఒక కవిత నిజంగా గొప్ప కవిత అవుతుంది?**

**జ:** అనేక విధాలుగా ఉన్న పదాలను ఒక కవితగా కూర్చడంలో ఉపకరించే ప్రతి ఒక్క అంశం ముఖ్యమైందే. రచనా వస్తువు, భాష, మూలపాఠం, ఉపపాఠం. ఒకదానితో పాటు మరొకటిగా

వచ్చే పదాల కూర్పు, పంక్తుల క్రమం విరామచిహ్నాలు (ఒక్కొక్కసారి అవి లేకుండా ఉండడం కూడా), ఇవన్నీ - చెప్పిన విషయం ఎంత ప్రధానమో, చెప్పిన విధానం కూడా అంతే ప్రధానం. ఒక్కొక్కసారి చెప్పకుండా వదలిపెట్టింది కూడా ప్రధానంగానే ఉంటుంది.

నిజంగా గొప్ప కవిత ఏది? అనే దానికి జవాబు చెప్పడానికి డికెన్సన్ చెప్పిన మాటను చెప్పటానికి మించి ఏమీ చేయలేను. "నేనొక కవితను చదివిన తర్వాత అది ఎలాంటి అగ్ని అయినా వెచ్చబరచలేనంతగా నా శరీరాన్ని చల్లబరిస్తే, అప్పుడు నాకు తెలుస్తుంది, అది గొప్ప కవిత అని. నాతల పైభాగం ఎగిరిపోయిన అనుభూతి గనక నాకు కలిగితే, నాకు తెలుస్తుంది, అది గొప్ప కవిత్వమ"ని అన్నాడాయన.

**ప్ర: కవిత్వానికి, సత్యానికి ఉన్న సంబంధం ఏమిటి?**

**జ:** కవిత్వాన్ని సత్యం నుంచి వేరుగా చూడడం కష్టం. గ్రెషియన్ అర్న్ "కవిత్వమే సత్యం, సత్యమే కవిత్వం" అని కూడా చెప్పి ఉండవచ్చు. సత్యాలు ఉండవచ్చు. అయితే కవిత్వం మాత్రం సత్యం యొక్క ఉత్సవమే, సెలబ్రేషనే.

**ప్ర: కవిత్వంలో సంప్రదాయానికి, నవీకరణకు ఎలాంటి సంబంధం ఉంటుంది?**

**జ:** నవీకరణగా నిన్న ప్రశంసించబడింది. ఈ రోజు సంప్రదాయబద్ధమైందని ఎగతాళికి గురి అవుతుంది. మతసంబంధమైన కవిత్వం స్థానంలో లౌకిక కవిత్వం వచ్చింది. ఆలోచనలు మారతాయి. కొత్త జ్ఞానం వచ్చి పడుతూ ఉంటుంది, కొత్త-కొత్త నక్షత్ర వీధులు కళ్ళముందు తెరుచుకుంటూ ఉంటాయి. ఏ సంప్రదాయాన్ని నవీకరణ వెనక వదలి పెట్టి పోవాలని అనుకుంటామో, దాని పైన అది నిరంతరం చేసే కొత్త నిర్మాణమే 'నవీకరణ' అనే అర్థం ఆ పదంలోనే నిహితమై ఉంది. అంటే ముందునుంచే ఉన్న ఒక దాన్లో మార్పులు చేయడం.

**ప్ర: స్తంభింప చేసే ప్రపంచీకరణ యొక్క ప్రభావాన్ని కవిత్వం ఎదుర్కోగలదా?**

**జ:** ప్రశ్న ప్రపంచీకరణ నుంచి కవిత్వం తన్ను కాపాడుకోగలదా? అనేది అయితే "అవును" అనేదే దానికి జవాబు. ప్రపంచీకరణ అనేది ఒక ప్రక్రియ. దానివల్ల ప్రపంచంలో అన్నిచోట్లా దైనందిన జీవితానుభవాలు ఒకే ప్రమాణానికి సరిపడేట్లుగా మారుతున్నాయి. అదృష్టవశాత్తూ కవిత్వం ప్రపంచం అనే అంగడి వీథిలో అమ్మే సరుకు కాదు. అది చల్లని పానీయాల అమ్మకానికి సంబంధించిన ప్రకటనా కాదు. మొదటి నుంచీ కవులు సరిహద్దులంటూ ఏవీ లేనివారు. అందువల్లనే భౌగోళిక, సాంస్కృతిక, భాషాగత, రాజకీయ సరిహద్దులను దాటి వెళ్ళగలిగారు. అయితే కవులు ఒకే ప్రమాణానికి సరిపడేట్లు రాసే ప్రవృత్తిని నిరోధించి, తమ భాషలోనే తమ సాంస్కృతిక స్మృతుల గురించి, అనుభవాల గురించి, రాయాలి. వాళ్ళు "అన్ని దేశాల సంస్కృతి పవనాలూ లోనికి వీచేలా కిటికీలు తెరిచి ఉంచాలి. అయితే వాటిలో దేని ప్రవాహానికీ ఎగిరిపోకుండా ఉండే ఆత్మస్థైర్యం కలిగి ఉండాలి" అనే గాంధీజీ సూక్తిని పాటించాలి. ప్రపంచీకరణ యొక్క స్తంభింపచేసే ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రభావాలను ఎదుర్కొనే విషయంలో కవిత్వం ఎలాంటి పరిణామానికీ దోహదం చేయలేకపోయినా, ప్రపంచీకరణ ముసుగులో జరుగుతున్న వలస స్థాపనకు అసమ్మతి తెలుపుతున్న కొన్ని కోట్ల ప్రజల స్వరానికి కొంత తోడ్పాటు మాత్రం అందించ గలుగుతుంది.

***(మనుదాస్ జరిపిన ఇంటర్వ్యూ 'Muse India' లో ప్రచురితం)***

కృష్ణాజిల్లా దివి తాలుకా శ్రీకాకుళంలోని అధిష్ఠానదైవం ఆంధ్రనాయకుడని తెలిసిందేగదా! ఈయన్నే తెలుగురాయడని, ఆంధ్రవల్లభుడని అనటంతోపాటు, ఆంధ్రమహావిష్ణువు అని కూడా అంటారు. ఒక జాతిపేరుతో దైవం వుండటం విశేషమే. ఇలా జాతి పేరుతో దైవం వున్నట్లు మరెక్కడా దాఖలా లేదు. శాతవాహన చక్రవర్తి శ్రీముఖునే వీరారాధన లేక నాయకారాధన ప్రక్రియలో భాగంగా ఆంధ్రమహావిష్ణువుగా భావించి పూజించుకుంటున్నాము. అది అలావుండగా, మనజాతి పేరుతో విష్ణువేగాక శివుడు కూడా వుండటం విశేషమే. ఇదీ మనజాతి ఘనత. ఇంతకూ ఈ శివుడు ఎక్కడున్నాడంటే పొదిలికి సమీపంలోని ఓ కూచిపూడి గ్రామంలోని కొండపై ఆంధ్ర రామేశ్వరుడనే పేరుతో పూజలందుకుంటున్నాడు.

**- యార్లగడ్డ బాలగంగాధర రావు**

# శ్రీశైల ద్వారాలు

**- బి.ఎస్.ఎల్. హనుమంతరావు**

ప్రస్తుతం శ్రీశైలానికి ఆంధ్ర, తమిళ, కర్ణాటక ప్రాంతాల నుండి బస్సు ప్రయాణ సౌకర్యం ఉంది. కృష్ణానదికి దక్షిణప్రాంత మార్గాలన్నింటికి దోర్నాల కూడలి. అచటి నుండి పర్వతాల మార్గం ద్వారా బస్సులు శ్రీశైలం చేరుతాయి. తెలంగాణా ప్రాంతాలనుండి కృష్ణానదిపై నిర్మించిన వంతెన మీదుగా శ్రీశైలం చేరవచ్చు. ఈ మార్గాలు ఏర్పడక పూర్వం దుర్గమారణ్యాలు, పర్వతాలు పరివేష్టించి ఉన్న శ్రీశైలక్షేత్రాన్ని చేరడం చాల ప్రయాసతో కూడిన సాహసయాత్ర. ఎటుచూచినా సుమారు ఇరవైమైళ్ళు కాలినడక సాగించవలసిందే. మజిలీలు చేస్తూ, చెట్ల నీడన విశ్రమిస్తూ, మంచి నీటికి గూడ బాధపడుతూ, కొండలెక్కుతూ, లోయలలోనికి దిగుతూ, అడవిమృగాల బారినుండి తప్పించుకుంటూ, చెంచుల దయాదాక్షిణ్యాల నర్థిస్తూ, వారి మోసాలకు తరచు గురి అవుతూ, చుట్టూ కన్పించే ప్రకృతి శోభకు తన్మయత్వం చెందుతూ, శివస్తోత్రంతో శ్రమను మరచిపోతూ యాత్ర సాగించేవారు. సాధరణంగా ఒంటరిగా శ్రీశైలయాత్ర అసంభవంగా ఉండేది.

క్రీస్తు తరువాత తొమ్మిదో శతాబ్దం నుండి శ్రీశైలం భక్తుల నాకర్షింపసాగింది. నాటి నుండి శ్రీశైల ద్వారాలు అనే విశ్వాసం కూడ బలపడింది. రాష్ట్రకూట రెండవ కృష్ణుని పుష్పగిరి శాసనంలో ఆ క్షేత్రాన్ని శ్రీపర్వత దక్షిణ ద్వారంగా పేర్కొన్నారు. అయితే తరువాతి కాలానికి పుష్పగిరి ఉపద్వారమై సిద్ధవటం ప్రధాన దక్షిణ ద్వారమయింది. త్రిపురాంతకం ప్రాగ్ద్వారం, అలంపురం పశ్చిమ ద్వారం, ఉమామహేశ్వరం ఉత్తర ద్వారం. ఈ నాల్గు ద్వార నగరాలు ప్రసిద్ధ శైవక్షేత్రాలుగా రూపొందినాయి. వీనిలో కొన్నింటికి శ్రీశైలంకంటె ప్రాచీనమైన చరిత్ర ఉన్నట్లు తెలుస్తుంది. ఈ ద్వారాల మధ్యప్రదేశం శ్రీశైల ఖండంగా ప్రసిద్ధి చెందింది.

శ్రీశైలానికి నాల్గు దిక్కుల నుండి మార్గాలున్నాయి. ఇవి శ్రీశైల ద్వారాల గుండా సాగినాయి. శ్రీశైల యాత్రలో ద్వార నగరాలు మజిలీలుగా ఉపకరించేవి. ప్రభువులు, భక్తులు పర్వతారోహణకు అనుకూలంగా సోపానాలు ఏర్పరచారు. నీటిసౌకర్యాలు కల్పించారు. విశ్రాంతికై మండపాలు, అచ్చటచ్చట శైవదేవతలకు ఆలయాలు ఉండేవి. అయితే నాలుగు మార్గాలలోను ఉత్తర పశ్చిమ ద్వార మార్గాలు జనాదరణ పొందినవి కావు. ఉత్తరమార్గం తెలంగాణానుండి ఏర్పడింది. చాల దుర్గమమయింది. పూర్వ దక్షిణ ద్వారాల నడుమ మార్కాపురం, జంగాల పల్లి, ఆరుట్లకోన మీదుగా శిఖరేశ్వరానికి మరొక మార్గం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ మార్గంలో పర్వతారోహణ కొంత సులభమయినట్లు జన శ్రుతి. తూర్పు దక్షిణ మార్గాలు ప్రసిద్ధములైనవి.

**తూర్పు ద్వారం : త్రిపురాంతకం**

త్రిపురాంతకం శ్రీశైల పూర్వద్వారం. ప్రకాశంజిల్లాలో ఒక చిన్ననగరం త్రిపురాంతకం. నగరానికి పశ్చిమంగా ఉన్న గుట్టపై ఈ క్షేత్రం ఏర్పడింది. ఇచటి దైవం త్రిపురాంత కేశ్వరుడు. శ్రీశైలంవలెనే త్రిపురాంతకం కూడా శివ-శక్తి క్షేత్రం. ఇచటి శక్తి త్రిపురసుందరి. ఈ దేవి ఆలయం ఒక తటాకం మధ్య ఉంది. చెరువుగట్లపై కడిమిచెట్లు ఉన్నందున త్రిపురసుందరి 'కదంబవనవాసిని.' పేరు త్రిపురసుందరియే గాని చాలా భయంకర స్వరూపిణి. అందుచేత శంకరాచార్యు లీక్షేత్రాన్ని దర్శించినపుడు శక్తి విగ్రహాన్ని గోడవైపు ముఖం

బి.యస్.ఎల్. హనుమంతరావు (1924 -1993)

ఉండేటట్లు మార్చినాడని ఇచటి జనశ్రుతి. నవరాత్రులలో నేటికీ ఈమె ఆలయంలో జంతుబలి విశేషంగా జరుపుతారట! ఆలయ ప్రాంగణంలోని వీరశిలలు ఆవేశపరులైన పరమశైవులు తలలు కత్తిరించి దేవికి సమర్పించే ఆచారం ఈ ఆలయంలో ఉండేదనడానికి నిదర్శనం.

త్రిపురాంతక క్షేత్ర చరిత్ర క్రీ.శ. 11వ శతాబ్దంనుండి మాత్రమే లభిస్తున్నది. ఈ ఆలయకుడ్యాలపై నున్న శాసనాలు క్షేత్రచరిత్రకు ఆధారాలు. తొలి కాకతీయ రాజుల కాలంలో కాలాముఖులు ఈ క్షేత్రంలో బలవంతులయినారు. శ్రీశైలంకూడ ఇదే సమయంలో కాలాముఖ శిలా (కలు) మఠానికి స్థానమయింది. బహుశా నాటినుండియే త్రిపురాంతకం శ్రీశైల తూర్పు ద్వారంగా ప్రసిద్ధి చెంది ఉంటుంది. కాకతీయ గణపతి దేవుని కాలంలో గోళకీ మఠశాఖను త్రిపురాంతకంలో స్థాపించుకున్నారు. కాకతీయ రుద్రమదేవిపై తిరుగుబాటు చేసిన కాయస్థ అంబయదేవుని శాసనాలవల్ల త్రిపురాంతకం రాజకీయంగా కూడ ప్రసిద్ధమైనట్లు కన్పిస్తుంది. మధ్యయుగంలో రాజకీయాధి కారం ప్రజాదరణ పొందడానికి మతపరమైన గుర్తింపు అవసరం. ఆ గుర్తింపుకోసమే బహుశా అంబయదేవుడు త్రిపురాంతకంలో మఠాధి పతులను ఆశ్రయించి ఉంటాడు.

తూర్పుమార్గాన పయనించే యాత్రికులు వినుకొండ నుండి త్రిపురాంతకం చేరుతారు. అచటినుండి దిగువమెట్ట జంగాలపల్లి రెండు మజిలీలు, జంగాలపల్లి వరకు ఎడ్లబండ్లపై ప్రయాణం చేయవచ్చు. జంగాలపల్లినుండి శ్రీశైల పర్వతారోహణ ప్రారంభమై కాలినడక సాగించాలి. 'ఏతముబావి', మొగ్గిచెరువులు మకాములు తర్వాత చుక్కల పర్వతాన్ని సమీపిస్తారు. ఈ పర్వతారోహణ చాల కష్టం. నల్లమల కొండలీప్రాంతంలో 2700 అడుగుల ఎత్తు ఉంటాయి. కొండమెట్లు ఏటవాలుగా ఉన్నందున పర్వతారోహణ శ్రమతో కూడి ఉంటుంది. పర్వతారోహణ రెండు గంటలు పట్టేది. యాత్రికుల భక్తికి ఇది మంచి పరీక్ష. చుక్కల పర్వతంనుండి రెండుక్రోసుల దూరంలోని (సుమారు 8 కి.మీ.) ఆరుట్లకోన చేరుతారు. త్రిపురాంతకం నుండి మరొక మార్గాన అంటే మార్కాపురం మీదుగా దోర్నాల చేరి అటునుండి ఆరుట్లకోనకు చేరవచ్చు.

ఆరుట్లకోనలో వెదురుతోపులు, మామిడితోటలు మంచి నీటిసౌకర్యమూ యాత్రికుల శ్రమకు ఊరట కలిగిస్తాయి. ఇచటినుండి శిఖరేశ్వరానికి సాయంత్రం చేరేవారు. శ్రీశైల పర్వతశ్రేణిలో ఇది ఎత్తయిన శిఖరం. ఇచటినుండి మల్లికార్జునాలయానికి మూడు క్రోసుల దూరం. శిఖరేశ్వరం నుండి మల్లికార్జున ఆలయశిఖరం, ఇతర శ్రీశైల క్షేత్ర దృశ్యాలు కన్పిస్తాయి. శిఖరేశ్వరంలోని వీరశంకర (గర్భ) ఆలయ పైభాగంలో రుబ్బురోలు, అందులో నందిపొత్తరమూ ఉన్నాయి. రోటిలో శనగలు, నువ్వులు, బెల్లము పోసి రుబ్బుతూ నంది శృంగముల మధ్యనుండి మల్లికార్జున ఆలయశిఖరాన్ని దర్శించినచో పునర్జన్మ ఉండదని భక్తుల విశ్వాసం. "శ్రీశైల శిఖరం దృష్ట్వా" అనే సూక్తికి ఈ సంప్రదాయమే మూలం. అందుచే ఏమార్గంనుండి శ్రీశైల యాత్ర సాగించినా భక్తులు శిఖరేశ్వరం దర్శించడం తప్పనిసరి.

వీరశంకరుని ఆలయానికి ముందు భాగంలో విభూతి కుండము అనే పుష్కరిణి, ఆ సమీపంలోనే యాత్రికుల విడిదికి మండపాలు ఉన్నాయి. శిఖరేశ్వరానికి ఆగ్నేయ దిశలో సుమారొక మైలుదూరంలో ముక్తిశిఖరం ఉంది. ఈ మైలు దూరమూ ప్రయాణం కష్టసాధ్యం. ముక్తిశిఖరంపైన 'కర్మహరేశ్వరు'ని ఆలయముంది. భక్తుల పాపాలను హరించే వాడైనందున ఆ పేరు వచ్చింది. ముక్తిశిఖరానికి దక్షిణ దిశలో సుమారు అరమైలు దూరంలో బిల్వేశ్వరం ఉంది. బిల్వ



(మారేడు) వనమధ్య ఆలయంలోని ఈశ్వరుని కన్నడదేశపు భక్తురాలైన అక్కమహాదేవితో సహా సుప్రసిద్ధులైన భక్తులెందరో సేవించినారని ప్రతీతి. బిల్వేశ్వరం తరువాతి క్షేత్రం హాటకేశ్వరం. హాటకేశ్వరానికి మూడుమైళ్ల (5 కి.మీ.) దూరంలో మల్లికార్జున ఆలయముంది. మల్లికార్జునాలయం చేరినవెంటనే భక్తులు "ధూళిదర్శనం" చేసుకొనేవారు. పాదప్రక్షాళనమైన చేయకుండా దేవుని దర్శించడమే "ధూళిదర్శనం." ఎంతో శ్రమపడి దైవదర్శనానికి వచ్చిన భక్తుల ఆదుర్దాకు "ధూళిదర్శనం" నిదర్శనం.

## దక్షిణద్వారం – సిద్ధవటం

కడపజిల్లాలోని సిద్ధవటం శ్రీశైలానికి దక్షిణ ద్వారం సిద్ధవటం పినాకినీ (పెన్నా) నదిమీద ఉంది. అమరవటం, మల్లికార్జునం (అర్జున=మద్ది) ఏకామ్ర (ఆమ్ర=మామిడి) నాథం అనే పేర్లనుబట్టి మొదట్లో శివుడు వృక్షాలకింద ఆరాధింపబడుతూ ఉండేవాడనే అభిప్రాయం కలుగుతుంది దేవాలయాలు క్రమంగా నిర్మాణమైనాయి. సిద్ధులు శైవులలో ఒకశాఖ. అణిమాది అష్టసిద్ధులు సాధించడం వీరి ఆశయం. తాంత్రిక పూజావిధానం అనుసరించే వారు. అందుచే ఈ క్షేత్రానికి 'సిద్ధవటం' అనే పేరు వచ్చి ఉంటుంది. సిద్ధవటం సమీపంలో 'జ్యోతి' అనే గ్రామముంది. రెండు గ్రామ నామాలను కలిపి జ్యోతి సిద్ధవటేశ్వరుడని ఇచటి ఈశ్వరుడు ప్రసిద్ధుడయినాడు.



సిద్ధవటం దక్షిణద్వారంగా ప్రసిద్ధమయినా ఇటునుండి శ్రీశైలానికి సరియైన మార్గంలేదు. కర్నూలు జిల్లాలో నంద్యాల మీదుగానున్న మార్గమే దక్షిణమార్గంగా జనాదరణ పొందింది. ఇచటికి శ్రీశైలం ఉత్తరదిశలో 73 మైళ్ల దూరంలో ఉంది. ఇదే కారణంగా ఈ మార్గం దక్షిణ మార్గంగా పేరొంది ఉంటుంది. నంద్యాలకు సుమారు 40 మైళ్ళ దూరంలో ఉన్న ఆత్మకూరు చేరేవారు, నంద్యాల – ఆత్మకూరుల మధ్య చక్కని రోడ్డు ఉంది. ఆత్మకూరుకు పదిమైళ్ళ దూరంలో పర్వతపాదంలో నాగలూటి అనే గ్రామ ముంది. శ్రీశైల పర్వతారోహణ ఇచటనే ప్రారంభమవుతుంది. మార్గమధ్యంలో బేచిరాలైన గ్రామాలు, శిథిలదేవాలయాలు, మండపాలు, ద్వారతోరణాలు, చెంచుగూడెములు కన్పిస్తాయి. నాగలూటి సమీపంలోనే సిద్ధపురం అనే గ్రామముండేది. అచటి శిథిలాలవల్ల సిద్ధపురం ఒకనాడు ప్రసిద్ధ నగరమైనట్లు తెలుస్తుంది. పశ్చిమ ద్వారమైన ఆలంపురం నుండి ఉన్న మార్గం నాగలూటి దగ్గిర దక్షిణ మార్గాన్ని కలుస్తుంది.

## పశ్చిమద్వారం – అలంపురం

అలంపురం శ్రీశైల పశ్చిమద్వారం. మహబూబ్‌నగర్ జిల్లాలో తుంగభద్రా తీరంలో తుంగభద్రా కృష్ణానదుల సంగమస్థల సమీపంలో ఉంది. అలంపురం చాలా ప్రాచీన క్షేత్రం ఇక్ష్వాకులనాటి (క్రీ.శ. 275 ప్రాంతం) గురజాల శాసనం ''హలంపురసామి''ని పేర్కొంటున్నది. హలంపురవే అలంపురమని కొందరి అభిప్రాయం. ఒకప్పుడిది బౌద్ధ క్షేత్రమై ఉండవచ్చుననే అభిప్రాయంకూడా ఉంది. ఇచటి సూర్యదేవాలయం (క్రీ.శ. 10వ శతాబ్ది) ముఖమండపం కప్పులో యోగముద్రలో నున్న బుద్ధుడు, ఆతని పరివేష్టించి ఎనిమిది విష్ణు అవతారాలున్న శిల్పం ఉంది. బుద్ధుడే మహానారాయణుడని మత్స్య కూర్మాది అవతారములాతడు ధరించినవే ననే అభిప్రాయం ఆ శిల్పం దర్శించినప్పుడు కలుగుతుంది. ఈ శిల్ప ఫలకంలో కల్కి లేకపోవడం గమనార్హం. బుద్ధుని బోధనలతో ప్రపంచంలో దుఃఖమూ దుఃఖకారణము నశించడంతో కల్కి ఆవశ్యకత లేదని శిల్పి ఊహించి ఉంటాడు. అలంపురం వెలుపల సంగమేశ్వరాలయంలో కూడా ఇటువంటి శిల్పమే ఉంది.

ప్రస్తుతం అలంపురంలో తొమ్మిది దేవాలయాలున్నాయి. వానిలో బ్రహ్మేశ్వరాలయం ప్రసిద్ధమయింది. ఈ ఆలయాలలో చాలాభాగం బాదామి చాళుక్య నిర్మాణాలు. రెండో పులకేశి కుమారుడైన మొదటి విక్రమాదిత్యుడు (క్రీ.శ. 646–60) అలంపురంలోని సుదర్శనాచార్యుల శిష్యుడు 'శివమండల దీక్ష'ను స్వీకరించి గురుదక్షిణగా ఆచార్యులకు కొల్లాపురం తాలూకాలోని ఇపరునుకల్లు గ్రామం దానం చేసినట్లు ఇచటి శాసనం నుండి తెలుస్తున్నది. చాళుక్య విజయాదిత్యుని

(క్రీ.శ. 696–733) సుదీర్ఘమైన సంస్కృత శాసనం ఇచట ఇటీవల బయల్పడింది. దాని ప్రకారం ఆతడు అలంపురంలో ఐదు సంవత్సరాల కాలం (713–718) ఉండి దేవాలయ నిర్మాణాన్ని పర్యవేక్షించినట్లు చరిత్రకారులు భావిస్తున్నారు. రుజువైన ఆధ్యాత్మిక దృష్టితో అన్నిమతాలను ఆదరించి ప్రజోపకర కార్యాలు నిర్వహించినట్లు చెప్పుకొన్నాడు:

*సోవ్యాద్ భాగవతాన్ బౌద్ధాన్ జినేంద్ర మతమాశ్రితాన్*
*స్వధర్మ క్రియయావిశ్వం తీర్థాన్ సన్తర్పయన్ నృపః*
*స్థానే స్థానేచ సత్రాని దరిద్రానాథ తృప్తయే*
*పశూనాం రోగ తప్తానాం ప్రీత్యాచాస్థాపయన్నృపః*

విక్రమాదిత్యుని శాసనంవల్ల క్రీ.శ. 7వ శతాబ్దానికే అలంపురం ప్రసిద్ధ శైవక్షేత్ర మయినట్లు తెలుస్తున్నది. శైవులు తమ శిష్యులకు దీక్షనీయడం ప్రారంభించారు. దీక్షను ద్విజన్ములలోని 'ఉపనయనం'తో పోల్చవచ్చు. దీక్ష తీసుకున్న వ్యక్తి స్వీయమతాచారాలను అనుసరించడానికి, బహుశా మతగ్రంథపఠనకు అర్హత సంపాదిస్తాడు. అంటే మత విజ్ఞాన సముపార్జనపై సనాతన బ్రాహ్మణమతం విధించిన ఆంక్షలను భక్తి మతాలు సడలించినాయి. క్రింది వర్ణాలకు మత విజ్ఞానం అందుబాటులోనికి రాసాగింది.



బ్రహ్మేశ్వరునిదేవి జోగుళాంబ (యోగేశ్వరి) గొప్ప మహిమలున్న శక్తియని ప్రజల విశ్వాసం. స్థానిక చరిత్రలు రేణుకాశక్తికి అలంపురంతో సంబంధమున్నట్లు చెబుతున్నాయి. ఇచటి 'నగ్నకబంధ' విగ్రహాలు రేణుకాదేవిని సంతాన కాంక్షులైన స్త్రీలు ఆరాధిస్తారు.

అలంపురం కాలాముఖ శైవశాఖకు గొప్ప కేంద్రమైంది. ఇచటి శాసనాలు పెక్కుమంది కాలాముఖాచార్యులను పేర్కొంటున్నాయి. బాదామిచాళుక్య, రాష్ట్రకూట, కల్యాణిచాళుక్య ప్రభువులు ఈదేవాలయాలను, కాలాముఖ సంస్థలను పోషించారు. కాలాముఖులు ఇచట ఘటికను స్థాపించారు. నాటి ఘటికలలో చతుర్దశ విద్యలలో పరిశ్రమ జరిగేది.

కాలాముఖ శైవంతోబాటు అలంపురంలో సిద్ధ తాంత్రిక శైవశాఖలు కూడ ఉన్న నిదర్శనలు కన్పిస్తాయి.

తీరాంధ్రం నుండి, కర్ణాటకం నుండి యాత్రికులు అలంపురంచేరి నదిని దాటి శ్రీశైలం వైపు పయనిస్తారు. నదిని దాటిన తరువాత పెద్ద చెరువు ఒక మజిలీ. అనంతరం పశ్చిమద్వార మార్గము, దక్షిణ మార్గము నాగలూటి దగ్గిర కలిసేవి. నాగలూటిలో రెండు మంచినీటి కొనేరులున్నాయి. మిట్టపైని కోనేరు సమీపంలోని మండపంలో విఘ్నేశ్వరుని ప్రతిష్ఠించారు. ఇచటనే వీరభద్రాలయం కూడా ఉంది. వీరభద్ర విగ్రహం భయంకరంగా ఉంటుంది. క్రీ.శ.1624లో (శా.శ. 1546) రక్తాక్షి జ్యేష్ఠ శుద్ధ పంచమినాడు బొంతల నాగిశెట్టి వీరభద్రాలయం తూర్పు గోపురాన్ని నిర్మించి కాశీ విశ్వనాథ లింగాన్ని, కల్యాణ బసవేశ్వర విగ్రహాన్ని ప్రతిష్ఠించి 'మూల చెరువు' కిందనున్న మాగాణిలో కొంత భూమిని దానం చేసినట్లు వీరభద్రాలయ స్తంభంపైని శాసనం ద్వారా తెలుస్తున్నది. వీరభద్రా లయానికి తూర్పున నున్న మండపం లోని నందియే కల్యాణ బసవేశ్వరుడై ఉంటాడు. ప్రస్తుతమీతణ్ణి కావలి బసవేశ్వరుడని పిలుస్తారు. యాత్రికుల కీతడు రక్షణగా ఉంటాడని ప్రజల విశ్వాసము.

నాగలూటి నుండి ఎనిమిది మైళ్లకు పైగా కొండ ఎక్కడానికి ప్రకృతి సిద్ధంగా నేర్పడిన మెట్లున్నాయి. మెట్లు చాలా నిడుపుగా నున్నందున చాలా ప్రమాదమై పర్వతారోహణ చాలా ప్రయాసతో కూడి ఉంది. కాని ఇచటి ప్రకృతి మనోహరంగా ఉండి, యాత్రికులకు ఉపశమనం కలిగిస్తుంది. నాగలూటికి తొమ్మిది మైళ్ళ దూరంలో పెద్ద చెరువు ఉంది. దీనినే 'గంగనపల్లె' అని కూడా వ్యవహరిస్తారు. ఇచట చెంచు లంబాడీ గూడేలు ఉన్నాయి. అటవీశాఖవారి బంగళా ఉంది. చెంచులు, లంబాడీలు యాత్రికులకు బండ్లు, గుర్రాలు బాడుగకు ఇచ్చేవారు. పెద్ద చెరువు నుండి ఆరుమైళ్ళ దూరంలో భీముని కొలను ఉంది. రెండు కొండల మధ్య అగాధమైన లోయలో ఏర్పడింది. నీటిమట్టంనుండి కొండ పైభాగానికి

సుమారు 650 అడుగుల ఎత్తు ఉంటుంది. భీతావహమైన ఈ కొలను చుట్టూ ప్రకృతి చాలా మనోహరంగా ఉండేది. కొలను సమీపంలో భీమలింగేశ్వర క్షేత్రముంది. పాండవ వీరుడైన భీమసేనుడు ఈ కొలను నిర్మించి లింగాన్ని ప్రతిష్ఠచేసినట్లు ప్రజలు చెప్పుకొంటారు. భీముని కొలను నుండి మిట్ట పల్లాల మార్గంగుండా పయనించి శ్రీశైలం పీఠభూమిని చేరుకుంటారు. దీన్నే కైలాసశిఖరం అని వ్యవహరిస్తారు. శ్రీశైల పర్వత శ్రేణుల్లో ఎత్తైన శిఖరాలలో ఇది రెండోది. శిఖరంపై ఎత్తైన శిలాద్వారం నిర్మించి నందిని ప్రతిష్ఠించారు. ఇదే కైలాస ద్వారం. ప్రస్తుతమిది శిథిలావస్థలో ఉంది. ఈ ద్వారంనుండి యాత్రికులు హాటకేశ్వరం చేరేవారు హాటకేశ్వర సమీపంలోనే 'పాలధార, పంచధార' అనే వాగులు జన్మిస్తున్నాయి. ఇవి రెండూ కలిసి 'భాగవతి' అనే పేరుతో కృష్ణానదిలో కలుస్తున్నాయి. భాగవతిలోని నీరు చాలా రుచిగా ఉండేవిట! హాటకేశ్వరం నుండి సాక్షి గణపతి దేవాలయం చేరుకుంటారు. కైలాస శిఖరంనుండి ఈ ఆలయానికి మైలున్నరదూరం. భక్తులు శ్రీశైలాన్ని దర్శించినట్లు ఈ గణపతి సాక్ష్యమట! ఈతని చేతుల్లో పుస్తకమూ, గంటమూ ఉంటాయి. ఇచటికి సమీపంలోనే మల్లికార్జున దేవాలయముంది.

**ఉత్తరద్వారం : ఉమామహేశ్వరం:**

ఉమామహేశ్వరం కూడ మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఉంది. ఉమామహేశ్వరుడిచటి దైవము. ఇచటి శాసనాలవల్ల కాకతీయుల కాలంనుండి ఈ క్షేత్రం ప్రసిద్ధి చెందినట్లు తెలుస్తుంది. ఇది శ్రీశైల పీఠభూమి అంచున ఉంది. ఇచటి నుండియే పర్వతశ్రేణులు ప్రారంభమవుతాయి.

కృష్ణానదికి ఉత్తర దిశనుండి శ్రీశైలానికి వెళ్ళే మార్గాలన్నింటికీ ఉమామహేశ్వరం కూడలి. తిరిగి ఈ మార్గాలు నీలగంగరేవు, జాతరరేవు మార్గాలుగా చీలిపోతాయి. ఉమామహేశ్వరంనుండి యాత్రికులు వతర్లపల్లె అనే చెంచుగూడెం గుండా నీలగంగరేవు చేరేవారు. అచట కృష్ణానదిని దాటి చుక్కలపర్వతారోహణకు ఉపక్రమిస్తారు. దీనికంటె జాతరరేవు మార్గం ప్రసిద్ధం. రాచకొండనేలిన రేచర్ల మాదానాయనిశాసనం జాతరరేవులో ఉంది. దీనినే జాతరరేవు శాసనం అంటారు. మాదానాయడు ఉమామహేశ్వరం నుండి జాతరరేవు వరకు చదునైన మార్గాన్ని నిర్మించినాడని ఆ శాసనం చెబుతున్నది. మన్ననూరు ద్వారా జాతరరేవు చేరి, నదిని దాటి చుక్కల పర్వతాన్ని సమీపిస్తారు. చుక్కల పర్వతారోహణ చాలా శ్రమతో కూడి రెండుగంటలు పడుతుంది. సుప్రసిద్ధ శివకవి పాల్కురికి సోమనాథుడు ఈ మార్గాన శ్రీశైలయాత్ర నిర్వహించినట్లు, పండితారాధ్య చరిత్రలోని చుక్కల పర్వతారోహణ వర్ణన సూచిస్తున్నది:

*సురుచిరాభ్రంకష చూడాగ్రతతుల*
*వఱలు నక్షత్ర పర్వతమంత నెక్కు*
*తరి బరిషత్కోటి దాదిగ సాగి*
*కమనీయ సురదీర్ఘికా నిత్యసంగ*
*మమున కానది యేగు మాడ్కినొప్పారె*

---

*తప్పక యప్పురాతన తీర్థచరులు*
*చొప్పారు నుజ్జ్వల సోపానములుగ*
*ద్రొక్కుచు నక్కుచు దొట్రిల్లుకొనుచు*
*జిక్కుచు మోకాళ్ళ చేతులూదుచును*
*వంగుచు వ్రాలుచు దొంగుచు జనుచు*
*జెంగుచు నొండొరు చేయూది కొనుచు*
*చేదుకో చేదుకో శ్రీ గిరినాథ!*
*చేదుకో మల్లయ్య చేదుకొమ్మనుచు*
*కనికని పాటలు గట్టి పాడుచును*
*జనిజని చిందుల జతుల కాడుచును*
*గట్టురవడి నగాగ్రంబెక్కె బరస*

---

*నరుదంద నందులో నాంధ్రదేశంబు*
*పరసబంతులు గట్టి పాడుటెట్లనిన*
*నల్లవో! నల్లవో! నగరాజ రాజ!*
*మల్లయా! మల్లయా! మహనీయతేజ!*
*పరమ పాతక కోట్లు భస్మమై తూలు*
*సిరిగిరిమల్లన్న శరణన్న జాలు*
*రాబోవనెంత దూరంబైన నడువ*
*నే బోదు మల్లయ్య నేటేట గొలువ--*

అని పాడుకొంటూ చుక్కలపర్వతం ఎక్కి రెండు క్రోసుల దూరంలో ఉన్న ఆరుట్లకోన చేరేవారు. సోమనాథునిది వీరశైవం అని ప్రసిద్ధి. ఈ శ్రమనంతా వోర్చి ప్రతి సంవత్సరం ఆతడు శ్రీశైలం దర్శించి ఉంటాడు. ఆరుట్లకోన నుండి మల్లికార్జునాలయానికి యాత్రను పైన వర్ణించినాము.

**ఉపద్వారాలు**

శ్రీశైల శిఖరానికి పైన వర్ణించిన నాల్గు ద్వారాలేగాక నాలుగు ఉపద్వారాలు కూడా ఉన్నాయి. ఇవి కూడా ప్రఖ్యాత శివక్షేత్రాలేనని వేరే చెప్పనవసరం లేదు. ఆగ్నేయదిశలో సోమశిల ఉపద్వారం మహబూబ్‌నగర్ జిల్లాలో ఉంది. నైరుతిదిశలోని ద్వారం పుష్పగిరి, కడప జిల్లాలో పినాకినీ నది మీద ఉంది. తొమ్మిదో శతాబ్దం నాటి రాష్ట్ర కూటశాసనాలు పుష్పగిరినే శ్రీశైలదక్షిణద్వారంగా పేర్కొంటున్నాయి. ఈ శాసనాల్లో అసంఖ్యాతుల, పంచ మఠస్థానాల ప్రస్తావన కన్పిస్తుంది. ప్రాచీన కాలంలో పుష్పగిరి బౌద్ధ క్షేత్రమైనట్లు నిదర్శనలున్నాయి. నాగార్జునకొండలోని బోధిసిరిశాసనాన్నిబట్టి పుఫగిరిలో ఆమె బౌద్ధులకొక మండపాన్ని నిర్మించి ఇచ్చింది. ఇటీవల చైతన్యపురి సమీపం (హైదరాబాద్)లో బయల్పడిన అయిదో శతాబ్దం నాటి ప్రాకృత శాసనం 'పుధగిరి' విహారాన్ని పేర్కొంటున్నది. పుఫగిరి, పుధగిరి రెండూ నేటి పుష్పగిరిని సూచిస్తున్నట్లు పండితులు నిర్ణయిస్తున్నారు. పుష్పగిరి కొండపై బౌద్ధనిర్మాణశిథిలాలు బయల్పడడం పైనిర్ణయాన్ని బలపరుస్తున్నది.

శ్రీశైలానికి వాయవ్యదిశలోని ద్వారం సంగమేశ్వరం. కర్నూలు జిల్లాలో నందికొట్కూరు తాలూకాలో భవనాశీ కృష్ణానదుల సంగమస్థలంలో ఉంది. ఈశాన్య దిశలోని ద్వారం ఏలేశ్వరం. ఇది కూడా పుష్పగిరియంతటి ప్రాచీన క్షేత్రం. నల్గొండజిల్లాలో కృష్ణాతీరాన నాగార్జునకొండకు అభిముఖంగా ఉండేది. ఇక్ష్వాకుల వంశంలోని మూడో రాజైన ఎహువల ఛాంతమూలుని సేనాని ఎలిసిరి ఇచ్చట ఆలయం నిర్మించి ఏలేశ్వరుని నెలకొల్పినాడు. ఎహువలేశ్వర రూపాంతరమే ఏలేశ్వరుడని చెప్పవచ్చు. నాటినుండి కాకతీయుల కాలంవరకూ ఏలేశ్వరం శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. కందూరు చోడులు, కల్యాణి చాళుక్యులు, పలనాటి హైహయులు, కాకతీయులు, వర్తకులు ఏలేశ్వరునకు చేసిన దానాలను తెలియజేసే శాసనాలు ఇచట బయల్పడినాయి.

సుమారొక అర్ధశతాబ్దం క్రితం వరకూ శ్రీశైల యాత్రికులు సాధారణంగా అనుసరిస్తూ ఉండిన మార్గాలను పరిశీలించినాము. ఏ మార్గాన సాగించినా శ్రీశైలయాత్ర కష్ట భూయిష్టమయిందే. ఐనప్పటికీ సోమనాథుడు వ్రాసిన దాన్నిబట్టి ప్రతిసంవత్సరం శ్రీశైలయాత్రచేసిన భక్తులు ఉండేవారు. వారిభక్తి అమోఘం. ఎంతటి సాహసోపేతమైన పనినైనా చేయించగల బలం విశ్వాసంలో ఉంది! శంకరుడు భక్త సులభుడనీ, భక్తవశంకరుడనీ ప్రతీతి. కాని భగవంతుని సాన్నిధ్యం చేరడం సులభ సాధ్యం కాదనే సత్యానికి శ్రీశైలయాత్ర నిదర్శనంగా ఉండేది!

ఇటీవలి కాలంలో మానవుడు సాధించిన యంత్ర నాగరికత ఆతని శ్రమను చాలా వరకు తగ్గించింది. శ్రీశైలయాత్ర సులభమయింది. అయితే చారిత్రక ప్రాముఖ్యమున్న పై మార్గాలనుగానీ, వానిపై నుండిన తీర్థాలనుగానీ గుర్తించడం నేడు సాధ్యం కాదు. శ్రీశైలఖండద్వారాలు సయితం పూర్వ క్షేత్ర ప్రాముఖ్యాన్ని కోల్పోయి కేవలం పురావస్తు ప్రాముఖ్యమున్న చారిత్రక యాత్రాస్థలాలుగా మారిపోతున్నాయి. నాగరికతా విస్తరణతోబాటు శ్రీశైలాన్ని మైళ్ళకొలది పరివేష్టించి ఉండిన మనోహర ప్రకృతి సౌందర్యం అంతరించింది. ఉద్రేక పూరితమైన అనుభవాలు లేక శ్రీశైలయాత్ర నేడు కేవలం యాంత్రికమయింది.

## శ్రీనాథుని జన్మస్థలం

కవిసార్వభౌముడు శ్రీనాథుని జన్మస్థలాన్ని గూర్చి గతంలో చాలా చర్చ జరిగింది. ఒకరు కలపట మనగా (కృష్ణాజిల్లా), మరొకరు కొత్తపట్నమనగా (ప్రకాశం జిల్లా), ఇంకొకరు నల్లూరు (గుంటూరు జిల్లా) అన్నారు. ఇంతకు ఆయన జన్మస్థలం సింగరాయ కొండకు సమీపాన సముద్రం ఒడ్డునగల పాకల గ్రామం. ఒకప్పుడు ఇది రేవుపట్టణం. ఈ రేవుపట్టణంపై శ్రీనాథుని తాతగారు కమలనాభామాత్యునికి అధికారం వుండేది. ఆ ఆధిపత్యాన్ని ఆయనకు దఖలు పరచింది కాకతి రెండవ ప్రతాపరుద్రుడు. ఆ మేరకు శాసనం పాకల గ్రామంలోని శివాలయంలో ఉంది.

**- యార్లగడ్డ బాలగంగాధర రావు**

# ఆరోహణ – 2



- ముక్తవరం పార్థసారథి

జంతు లక్షణాలూ, దైవాంశా కలగలిసిన ఒక ప్రకృతి అద్భుతం మనిషి. ఉదాహరణకు గర్భ శిశువు కాళ్ళూ, చేతులూ కొట్టుకోవటమనే అసంకల్పిత ప్రతీకార చర్య–ప్రతి తల్లికీ యిది అనుభవమే–వెన్నెముక గల జీవులన్నింటికీ వున్న సామాన్య లక్షణం. జీవి ప్రాథమిక దశలోని ఈ రిఫ్లెక్స్, క్రమేణా సంక్లిష్టమై, శిశువుకు పదకొండు నెలలు నిండేనాటికి పాకటానికి అవసరమవుతుంది. వయసుతో పాటు పెరిగే ఈ చర్య మెదడులో, ముఖ్యంగా చిన్న మెదడులోని కండరాల కదలికలో సమతుల్యతకూ, తత్సంబంధమైన యితర చర్యలకూ పునాదివేస్తుంది. చిన్న మెదడు పూర్తిగా ఎదిగిన తర్వాత యిక దానిపని యితర అవయవాలకు ఆజ్ఞలు జారీ చేయటమే. పధ్నాలుగు నెలలప్పుడు అది “నిలబడు!” అని ఆదేశిస్తుంది. వెంటనే శిశువు లేచి నిలుచోక తప్పదు.

మనిషి చేసే ప్రతి చర్యకూ జంతు మూలాలున్నాయి. అయినా, కొన్ని ప్రత్యేకతలూ వున్నాయి. ఏ విషయాల్లో జంతువులతో సారూప్యత వుంది? మరే విషయాల్లో వాటికన్న భిన్నంగా వుంటాడు? ఏ వుదాహరణయినా తీసుకోండి. ఒక క్రీడాకారుడు పరిగెత్తడం లేదా దుంకటం. రేసు ప్రారంభమైనట్టుగా గన్‌షాట్ వినిపించగానే, అతని స్పందన, సరిగ్గా జింకలాగే వుంటుంది. జంతువులాగానే పరిగెడతాడు. గుండెవేగం పెరుగుతుంది. వేగం పెంచిన తర్వాత గుండెకు (మామూలుకన్నా) అయిదురెట్లు ఎక్కువ రక్త ప్రసరణ అవసరమవుతుంది – ఇదంతా కండరాలకే. నిమిషానికి ఇరవై గాలన్ల గాలి పీల్చుతాడు – రక్తంలో కలిసిన ఆక్సిజన్ కండరాలకు చేరాలి మరి.

ఈ పెరిగిన రక్త ప్రసరణను మనం చూడొచ్చు. రేడియేషన్‌ను రికార్డుచేసే ఇన్‌ఫ్రారెడ్ ఫిల్ముల మీద ఉష్ణోగ్రత రూపంలో యిది కనిపిస్తుంది (నీలి లేదా కాంతివంతంగా ఉండే ప్రదేశం అత్యధిక ఉష్ణోగ్రతకు చిహ్నం. ఎరుపు లేదా నలుపు ప్రదేశాలు కొంత తక్కువ వేడిని సూచిస్తాయి). ఒక రసాయనిక ప్రక్రియ ద్వారా కండరాలకు శక్తి వస్తుంది (వేడికి, చెక్కర కాలి శక్తిగా మారుతుంది). అయితే ఈ ప్రక్రియలో మూడొంతుల చెక్కర వృధాగా కాలిపోతుంది. మరికొంత వ్యర్థ పదార్థంగా మిగులుతుంది. రక్తంలో చేరిన ఈ వ్యర్థపదార్థమే అలసటకు మూలం.

ఇంతవరకూ మనం మనిషి – జింకల సారూప్యం చూశాం. ఇక తేడాల గురించి, జింక భయంతో ఆత్మరక్షణ కోసం పరిగెత్తింది. కాని, గన్‌షాట్ విన్న క్రీడాకారుడు ఆనందంగా విజయం సాధించటానికి పరిగెత్తాడు. ఆ క్షణంలో అతడిది చంటి పిల్లాడి మనస్తత్వం. అంటే ఆడుకుంటున్నాడు. ఇష్టపడి చేస్తున్న ఒక సాహస కార్యమది. గుండె అంత వేగంగా కొట్టుకోవటానికి కారణం–అతడు తన శక్తి సామర్థ్యాలను పరీక్షించుకుంటున్నాడు.

సహజంగానే మనిషికీ, జంతువులకూ మధ్య అనేక యితర భౌతిక తేడాలున్నాయి. మనిషికీ, చింపాంజీకీ కూడా తేడాలున్నాయి. Pole Vaulting క్రీడాకారుడు ఎంతో నేర్పుగా Poleను పట్టుకుని ఎగురుతారు. చింపాంజీకు యిది అసాధ్యం. అయితే, యింతకన్న ముఖ్యమైన తేడా మరొకటుంది. ఎగరటం అనేది అతడికి పరిసరాల కనుగుణంగా అవసరమైన జీవనపద్ధతి కాదు. క్రీడాకారుడు విచక్షణా విజ్ఞానం వున్న

ముక్తవరం పార్థసారథి, ఫోన్ : 9177618708

యువకుడు. క్రీడలో భాగంగా తప్ప అలా ఎగరటం అర్థహీనమని అతడికి తెలుసు. ఎగిరితే ఎలావుంటుందో మొదట వూహిస్తాడు. తర్వాత ఊహను సాకారం చేసుకునే భవిష్యత్తులోకి Vault చేస్తాడు.

ఎగరటానికి సిద్ధమైన ఆ క్షణాన అతడు జంతువుకు భిన్నమైన, అనేక ప్రత్యేకతలున్న మానవుడు Pole ను చేతితో పట్టుకున్న పద్ధతి, ఒక కాలు వంచి ముందుకు వంగటం, భుజాల, నడుము కింద కండరాలు – విల్లులా వంగి నిటారుగా నిలబడే క్రమంలో క్రీడాకారుణ్ణి ఆకాశంలోకి లేపే Pole – యివన్నీ మనిషికే సాధ్యం. అంటే, లక్ష్యాన్ని వూహించి, దానికోసం పనిచెయ్యటం మనిషి విలక్షణత. అందులో ఒక ప్రణాళిక వుంటుంది. ఆ క్షణంలోని క్రీడాకారుని ఏకాగ్రత, మనిషికి తప్ప జంతువుకు సాధ్యంకాదు.

శిరస్సు కేవలం మనిషికి ప్రతీక మాత్రమే కాదు, దూరదృష్టికి మూలస్థానమది. 'సాంస్కృతిక విప్లవం' రూపుదిద్దుకునే దక్కడే. అందువలన, నేను జంతు దశనుండి ప్రారంభమైన మానవారోహణను అనుసరించా లంటే, శిరస్సు పరిణామక్రమాన్ని కూడా పరిశీలించక తప్పదు. దురదృష్ట వశాత్తూ 5కోట్లో, యింకా అంతకన్నా ఎక్కువ సంవత్సరాల చరిత్రలో, మనకు అయిదారు దశలకు చెందిన కంకాళాలు (పరిణామదశలను నిర్ణయించ గలవి) మాత్రమే లభించాయి. శిలాజాలలో యింకా ఎక్కువ దశలే నిక్షిప్తమై వుండి వుంటాయి. ఏది ఏమైనా, లభ్యమైన సాక్ష్యాధారాలతోనే మనం మన పరిశోధన ప్రారంభించక తప్పదు. ఈ కంకాళాల రేఖాగణితపరమైన అధ్యయనానికి కంప్యూటరే ఉత్తమసాధనం.

**శిరస్సు కేవలం మనిషికి ప్రతీక మాత్రమే కాదు, దూరదృష్టికి మూలస్థానమది. 'సాంస్కృతిక విప్లవం' రూపుదిద్దుకునేదక్కడే. అందువలన, నేను జంతుదశనుండి ప్రారంభమైన మానవారోహణను అనుసరించాలంటే, శిరస్సు పరిణామక్రమాన్ని కూడా పరిశీలించక తప్పదు.**

5 కోట్ల సంవత్సరాల క్రితం, చెట్లమీద నివసించే ఒక కోతి లాంటి జంతువుతో ప్రారంభిద్దాం. శిలాజాల రూపంలో దొరికిన ఈ పుర్రె Lemur జాతికి చెందిన Adapis (ఉప జాతి)ది. ఇది పారిస్ పరిసరాల్లో లభించింది. దీన్ని తలకిందులుగా పట్టుకుని పరిశీలిస్తే ఇది వెన్నెముక మీద నిలుచున్న తలకాదు, వంగినది అని తెలుస్తుంది. ఇది కీటకాలనూ, పళ్లనూ ఆహారంగా తీసుకుని వుంటుంది. అన్ని వానరాలలాగానే దీనికీ 32 పళ్లున్నాయి. ఈ Lemur శిలాజం, కోతి, చింపాంజీ, మనిషి (జీవ) కుటుంబానికి చెందినది. దీని పూర్తి అస్థి పంజరాన్ని పరిశీలిస్తే వేళ్ళకున్నవి గోళ్లు – పంజాలు కావని స్పష్టమైంది. బొటనవేలు కొంతవరకు పట్టుకోవటానికి చేతికి సహకరించేదిలా వుంది. ముఖ్యంగా, దీని పుర్రెలో వున్న రెండు రంధ్రాలు మనిషి మూలాలకు సంకేతాలుగా వున్నాయి. దీని మూతి భాగం మిగతా వానరాలకన్న చిన్నది. కళ్ళు పెద్దవి. వాటి మధ్యదూరం కూడా ఎక్కువే. అంటే వాసన కాకుండా చూపు ప్రధానమైన జీవిగా పరిణామం చెందుతున్నది. కళ్ళరంధ్రాలు పక్కకే వున్నప్పటికీ Stereoscopic Vision సంతరించుకునే క్రమమని తెలుస్తున్నది. మనిషి ముఖలక్షణాలు ఏర్పడుతున్న ప్రాథమిక దశ అది.

ఇదంతా జరిగింది 5 కోట్ల సంవత్సరాల క్రితం. తర్వాతి 2 కోట్ల సంవత్సరాల కాలంలో, కోతులు, చింపాంజీలుగా, మనిషిగా మారాయి. మన ప్రస్థానంలో లభించిన తదుపరి కంకాళ శిలాజం 3 కోట్ల సంవత్సరాల నాటిది. ఈజిప్టులోని ఫాయుమ్‌లో దొరికింది. పేరు Aegyptopithecus. దీనిది Lemur కన్నా చిన్న ముట్టె. పళ్లు చింపాంజీవి. పెద్దశరీరం. అయినా యింకా చెట్లమీదే నివాసం. అయినప్పటికీ, చింపాంజీ మానవుడి పూర్వీకులు కొంత కాలం నేలమీద కూడా గడపటం అలవాటు చేసుకున్నారు.

2 కోట్ల సంవత్సరాలనాడు తూర్పు ఆఫ్రికా, యూరోప్, ఆసియాలలో మనకు ఆంత్రోపాయిడ్ చింపాంజీగా తెలిసిన జీవులు తిరుగాడాయి. లూయిస్ లీకి కనుగొన్న ఈ శిలాజానికి Proconsul అన్న ఘనమైన పేరు పెట్టారు. ఆ దశలోని మరొక జీవి పేరు Dryopithecus. (Proconsul అని పేరు పెట్టటానికో కారణముంది. 1931లో లండన్ జూలో వున్న చింపాంజీ పేరు Consul). దీని మెదడు సైజు పెద్దది. కళ్ళు Stereoscopic Vision కు అనుకూలంగా వున్నాయి. దీన్నిబట్టి చింపాంజే–మనిషి పరంపర కొనసాగుతున్నదని తెలుస్తుంది. అయితే పళ్లు చింపాంజీవే. అంటే కోరలు

పలువరుసలో వచ్చిన మార్పును బట్టి చింపాంజీ మనిషిగా పరిణామం చెందిన క్రమాన్ని అర్థం చేసుకోగలం. ఈ దశ గురించి మనకు తెలిసింది కెన్యా, ఇండియాలలో లభించిన Ramapithecus ద్వారా. ఇది కోటి నలభై లక్షల సంవత్సరాల నాటిది. దీని పళ్లు మనిషి పలువరుసలను పోలివున్నాయి. ముఖం, చదునుగా వుంది. ఆంత్రోపాలజిస్టులు ధైర్యంగా దీన్ని 'ఆదిమానవుడు' (హొమినిడ్) అన్నారు.

ఆ తర్వాత, యాభై లక్షల నుండి, ఒక కోటి సంవత్సరాల దాకా మనకు శిలాజాల సాక్ష్యాలు లభించలేదు. చింపాంజీలనుండి ఆదిమానవులు పూర్తిగా వేర్పడిన కీలకదశ యిదే. మొత్తంమీద, యాభై లక్షల సంవత్సరాల క్రితం ఆధునిక మానవుని బంధువులు మనకు తొలిసారిగా కనిపించారు. నేటిమానవుని మరొక సోదర సంబంధీకుడు Australopithecus. భారీశరీరం, శాఖాహారి. Australopithecus robustus అంటూ మరోజీవి కూడా ఉండేది, కాని యిప్పుడది పూర్తిగా అంతరించింది.

తరువాతి దశ, మనం missing link గా చెప్పుకునే Australopithecus africanus. ఎదిగిన ఈ స్త్రీ శిలాజాలు మనకు దక్షిణాఫ్రికాలోని Transval, Sterk fontein లలో లభ్యమయ్యాయి. నేను మొదట ప్రస్తావించిన Taung శిశువు యిలా ఎదిగి వుంటుంది. నిటారుగా నిల్చుని, నడకకూడా నేర్చుకుంది. మెదడు సైజు పెద్దది. బరువు ఒకటీ, ఒకటిన్నర పౌండ్లుంటుంది. ఈ జీవి ఎత్తు సుమారు నాలుగడుగులు. Richard Leaky ప్రకారం, ఇరవై లక్షల సంవత్సరాలనాటికి మెదడు పరిమాణం యింకా పెరిగింది.

పెరిగిన మెదడులో, మానవుని పూర్వీకులు రెండు ముఖ్యమైన ఆవిష్కరణలకు నాంది పలికారు. ఒకటి ప్రత్యక్షంగా కనిపిస్తుంది. మరొకటి పరోక్షంగా అర్థం చేసుకోవాలి. ఇరవై లక్షల సంవత్సరాల నాడు Australopithecus మానవుడు తొలి రాతి పనిముట్లు తయారు చేశాడు. తరువాతి నలభై లక్షల సంవత్సరాలు దాకా యిదే అతని ప్రధాన ఆయుధం. ఇదే, పరిసరాలలో భాగంగా బతికిన యితర జంతువులకూ, అతనికీ వున్న తేడా. పది లక్షల సంవత్సరాల దాకా మరొక ఆవిష్కరణ అవసరం లేకపోయిందంటే, అది ఎంత వుపయోగకరంగా వుందో అర్థం చేసుకోవచ్చు. ఇది మాంసాహారికి ఉపయోగపడే పరికరం. కొట్టి చంపటానికీ, చీల్చటానికి కూడా పనికొస్తుంది.

మరొక ఆవిష్కరణ సామాజికపరమైంది. మనకు దొరికన Auctralopithecus పుర్రెలు, అస్థిపంజరాలన్నీ యిరవై ఏళ్ళలోపు మరణించిన జీవులవే. అంటే అనాథలు కూడా ఎక్కువే అని గ్రహించాలి. వీటి బాల్యదశ పదేళ్ళ దాకా కొనసాగింది. అంటే, వాటిని పోషించిన సామాజిక వ్యవస్థ లాంటిది కూడా వుండే వుంటుంది. విద్యాభ్యాసం పోషణలో భాగమే. సాంస్కృతిక విప్లవం దిశగా మనిషి వేసిన తొలి అడుగు యిది.

మనిషి పూర్వీకుల సంగతి సరే. ఇంతకూ మనిషి ఎప్పుడు ఆవిర్భవించాడు? ఇలాంటి ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పలేం. ఎందుకంటే ఈ పరిణామం ఒక్కనాడు జరిగింది కాదు. ఇరవై లక్షల సంవత్సరాల క్రితం మనం, ఈనాటి మనుషులం కాము. పదిలక్షల సంవత్సరాలనాడు ఈనాటి మనిషి Homo erectus ఆవిర్భవించాడు. ఇతడు ఆఫ్రికాకే పరిమితం కాలేదు. చైనాలో కొన్ని ముఖ్యమైన సాక్ష్యాలు లభించాయి. ఇతణ్ణి Pekingman అన్నారు.

ఇతని తర్వాత దశ గురించి మనకు తెలిసింది పందొమ్మిదవ శతాబ్దంలో జర్మనీలో దొరికిన Neanderthal మానవుని కంకాళం ద్వారానే. ఇతని మెదడు బరువు మూడు



పొంద్లు–అంటే ఆధునిక మానవునికున్నంత. Neanderthal మనిషి యొక్క కొన్ని వుపజాతులు అంతరించి వుంటాయి. కాని ఒక వుపజాతి Middle East కు వెళ్ళింది. అతణ్ణే Homo sapiens అన్నాం. ఇతడే ఆధునిక మానవుడు.

పదిలక్షల సంవత్సరాల క్రితం మనిషి వాడిన పనిముట్లలో గుణాత్మకమైన మార్పు వచ్చింది. శారీరకంగా, మానసికంగా కూడా పరిణామం జరుగుతుందన్న మాట. ముఖ్యంగా, పనిముట్లను ఉపయోగించడానికి అవసరమైన ఆదేశాలిచ్చే Brain Centres లో మార్పు వచ్చింది. అయిదు లక్షల సంవత్సరాల క్రితం. ఆదిమ పనిముట్ల స్థానంలో మరింత నేర్పుగా వుపయోగించే ఆయుధాలను తయారు చేశాడు.

ఈ పనిముట్ల తయారీలో వచ్చిన మార్పు, అగ్నిని వుపయోగించటం యితర పరిణామాలలో భాగమే. మనిషి ప్రవర్తనలో కూడా మార్పు వస్తున్నదని మనం ప్రధానంగా గ్రహించాలి. అయితే 'ప్రవర్తన' శిలాజాలలో రికార్డు కాదు గనుక ఎముకలను, పలువరుసను పరీక్షిస్తాం. నిజానికి ఎముకలు, పళ్లలో ఏ ప్రత్యేకతా వుండదు. కాని, అవి జీవిత విధానాన్ని ప్రభావితం చేస్తాయి. జీవి చేతులను, నైపుణ్యాన్ని వీటిద్వారా తెలుసుకోవచ్చు.

**ఆహారం సులభంగా దొరకాలంటే, వ్యక్తులమధ్య సమన్వయం, ఒక సామాజిక బంధం, అభిప్రాయాలు పరస్పరం తెలియపర్చుకోవడం కూడా అవసరం. ఒక వ్యూహంతో, ఒక బృందంగా ఏర్పడినవాళ్ళు తప్ప- జంతువులంత వేగంగా మనిషి పరిగెత్తలేడు. అంత బలశాలి కూడా కాదు - గడ్డి మైదానాలలోని పెద్ద జంతువులను వేటాడలేడు.**


మనిషి అవయవాలు, దేనికదే స్వతంత్రంగా పరిణామం చెందిం దనటం తప్పు. అలా జరిగే అవకాశమే లేదు. ఏ జంతువైనా ముఖ్యంగా మనిషి వివిధ అవయవాలు సమగ్రంగా, ఒక సమతుల్యత సంతరించుకున్న జీవి. అన్ని అవయవాలు కలిస్తేనే 'ప్రవర్తన' అంటాం. మెదడు, చేతులు, కళ్ళు, పాదాలు, పళ్లు, మొత్తం శరీర నిర్మాణమే పరిణామ ఫలితంగా, ఎంతో విలక్షణంగా మార్పు చెందింది. పరిణామక్రమంలో, ఈ లక్షణాలే అతణ్ణి యితర జీవుల కన్న భిన్నంగా నిలబెట్టాయి. 5 కోట్ల సంవత్సరాలుగా ఏ మార్పులేకుండా, ఆనాటిలాగే బతుకుతున్న కొన్ని జీవులలాకాక – ఉదాహరణకు కీటకాలు – మనిషి గుర్తుపట్టలేనంతగా పరిణామం చెందాడు. సృష్టిలోని జీవులలో కెల్లా మనిషిలోనే రాజసం వుట్టిపడుతుందని కాదు. క్షీరదాలు, అంతకుముందు డైనోసార్లు యింకా రాజసం వుట్టిపడేలా ఈ నేలమీద తిరిగాయి. అయితే, ఏ యితర జంతువుకూ లేని కొన్ని ప్రత్యేక లక్షణాలు మనిషికున్నాయి. అందువల్లనే ఈ భూమ్మీద 'జీవం' ఆవిర్భవించిన 3 వందల కోట్ల సంవత్సరాలలో మనిషొక్కడే సృజనాత్మకజీవి. జంతువుల శరీరాలు శిలాజాలుగా మిగులుతాయి. కాని మనిషి చేసిన, సాధించిన పనులు భవిష్యత్ తరాలకు వెలుగుబాటలు వేస్తాయి.

5 కోట్ల సంవత్సరాలలో ఒక జీవజాతి మారిందంటే, దాని ఆహారపుటలవాట్లలో కూడా మార్పులొచ్చాయన్న మాటే. తొలిజీవులు Lemur లాంటివి కీటకాలు, పళ్లు మాత్రమే తిని బతికిన సుకుమారులు. తొలి చింపాంజి, ఆదిమానవులు కూడా శాకాహారంకోసమే వెదికాయి. కాని Australo-pisthecus శాకాహారం మాత్రమే తినాలనే వానర స్వభావాన్ని అధిగమించింది.

శాకాహారం నుండి, అన్ని రకాల (మాంసాహారం వగైరా) ఆహారం తినటం Homo erectus, Neandethal man, Homo sapiens దాకా కొనసాగింది. Australo-pisthecus దశనుండీ మనిషి మాంసం తినటం అలవాటు చేసుకున్నాడు. మొదట చిన్న జంతువులు, తరువాత పెద్ద జంతువులూ అతడి ఆకలి తీర్చాయి. మాంసకృత్తుల సాంద్రత, మొక్కల్లో కన్నా మాంసంలో ఎక్కువ. మొక్కలు తినటంతో పోల్చితే, మూడింట రెండోవంతు కాలంలో, తక్కువ పరిణామంలో భోజనం ముగించవచ్చు. ఈ పరిణామ ఫలితాలు మనిషిమీద చాలా ప్రభావం చూపాయి. పెద్ద జంతువులను వేటాడటానికి ఎక్కువ కాలం కావాలి. వ్యూహం కావాలి. ఆయుధాలు కావాలి. ఆకలితో నకనకలాడుతున్న మనిషి పెద్ద జంతువులను చంపలేడు. అందువల్ల, మెదడులో పుట్టిన కోరికకూ, దాన్ని ఆచరణ రూపంలో పెట్టటానికీ కొంత వ్యవధి అవసరమైంది. అంటే, అనుకూల పరిస్థితులు ఏర్పడిందాకా కోరికను వాయిదా వేసుకోవటమే లక్షణం అభివృద్ధి చెందింది.

ఆహారం సులభంగా దొరకాలంటే, వ్యక్తులమధ్య సమన్వయం, ఒక సామాజిక బంధం, అభిప్రాయాలు పరస్పరం తెలియపర్చుకోవడం కూడా అవసరం. ఒక వ్యూహంతో, ఒక బృందంగా ఏర్పడినవాళ్ళు తప్ప— జంతువులంత వేగంగా మనిషి పరిగెత్తలేడు. అంత బలశాలి కూడా కాదు - గడ్డి మైదానాలలోని పెద్ద జంతువులను వేటాడలేడు. వేటకు ఒక ప్రణాళిక అవసరం. ప్రణాళికను చర్చించుకోవటానికి భాష అవసరం. వేటలోని చివరి ఘట్టం జంతువును చంపటం. కాని అంతకు ముందు మనుషులు ఎన్ని సహాయసహకారాలు యిచ్చిపుచ్చుకోవాలి!

కేవలం వేటవల్ల ఒక ప్రదేశంలో వున్న జనాభాకు ఆహార అవసరాలు తీరవు, గడ్డి మైదానాలలోని జంతువులు, సగటున, ఒక చదరపు మైలు విస్తీర్ణంలో యిద్దరి కన్నా ఎక్కువ మంది ఆకలి తీర్చలేవు. ఆలెక్కన, భూ విస్తీర్ణమంతా కేవలం రెండు కోట్ల మందికి మాత్రమే ఆహారం అందించ గలదు. వేటదశలోని మానవునికి ఇదో పెద్ద సవాల్! "ఆహారాన్వేషణలో మరో చోటికి కదులు లేదా యిక్కడే వుండి ఆకలికి చావు!"



రాతియుగం నాటి ఆయుధం

అలా ప్రారంభమైంది వాళ్ళ నిరంతర యాత్ర. పదిలక్షల సంవత్సరాల క్రితం వాళ్లు ఉత్తర ఆఫ్రికాకు చేరుకున్నారు. ఏడు లక్షల సంవత్సరాలనాడో లేదా యింకా ముందో - జావాలో అడుగుపెట్టారు. నాలుగు లక్షల సంవత్సరాల క్రితం తూర్పున చైనా దాకా, పశ్చిమాన యూరప్‌దాకా వెళ్ళారు. బహుశా ఆనాటి జనాభా పదిలక్షలకు మించకపోయినా, ఈ వలసల వల్ల ప్రపంచంలోని అన్ని ప్రదేశాల్లో అతని వునికి కనిపిస్తుంది.

నమ్మశక్యంగాని మరో వాస్తవమేమంటే, ఉత్తరాన హిమఖండం ఏర్పడిన తర్వాత మరీ అతడక్కడికి వలస వెళ్ళాడు. కొన్నివందల కోట్ల సంవత్సరాల దాకా వుత్తరార్థంలో సమశీతోష్ణస్థితులే వున్నాయి. Homo erectus చైనా, యూరోపులలో నివాసం ఏర్పరుచుకోవటానికి ముందే అక్కడ మూడు హిమయుగాలు ప్రారంభమయ్యాయి.

నాలుగు లక్షల సంవత్సరాల క్రితం Peking Man కనిపించిన నాటికి, అత్యంత భయంకరమైన మొదటి హిమయుగం ముగిసింది. అక్కడి గుహల్లో అగ్ని రగిల్చిన ఆనవాళ్ళున్నాయి. మంచుతెడారి మూడుసార్లు కింది దాకా వ్యాపించి వెనక్కి తగ్గింది. మంచు ప్రభావంలో ప్రతిసారీ నేలలో మార్పులొచ్చాయి. మంచుకొండల్లో పేరుకుపోయిన నీటివల్ల సముద్రమట్టం తగ్గింది. రెండు లక్షల సంవత్సరాల నాటి రెండవ హిమయుగంలో Neanderthal Man దర్శనమిస్తాడు. చివరి హిమయుగంలో కూడా అతనిదే ముఖ్య పాత్ర.

మనిషి సంస్కృతీ దశలుగా మనం గుర్తించగలిగిన పరిణామాలు యిటీవలి హిమయుగంలో అంటే, లక్ష లేదా యాభైవేల సంవత్సరాల క్రితం సంభవించాయి. మనకు లభించిన మెరుగైన పనిముట్లు (వేటకుపయోగించినవి) ఈకాలం నాటివే. ఉదాహరణకు బల్లెం లేదా బరిశ, గదలాంటి ఆయుధం, రెండు వైపులా మొనలు దేరిన మరో ఆయుధం (harpoon), యితర రాతి పరికరాలు, సంస్కృతీ పరిణామాన్ని సూచిస్తాయి.

ఆనాటి ఆవిష్కరణలు సంఖ్యలో తక్కువే అయినా, వ్యాపించిన సంస్కృతి వల్ల అందరికీ అందుబాటులో కొచ్చాయి. ఉదాహరణకు దక్షిణ యూరోపులోని Magdolamian వేటగాళ్ళు, పదిహేను వేల సంవత్సరాల క్రితం తొలి harpoon తయారు చేశారు. అప్పుడు దానికి ముళ్లతీగ చుట్టే సంప్రదాయం లేదు. ఆ తర్వాత వాటికి చేప గాలాలు కట్టారు. గుహకుడ్యాల మీద చిత్రకళ ప్రారంభమైన దశలో రెండుమూడు వరుసల చేపగాలాలు కూడా కట్టడం మనకు కనిపిస్తుంది.

హిమయుగాల ప్రళయ పరిస్థితులను తట్టుకుని మనిషి జీవించగలిగాడంటే, దానిక్కారణం, సమయానుకూలంగా, అవసరాన్ని బట్టి కొత్త పరికరాలను సృష్టించి వాటిని అందరికీ అందుబాటులోకి తేవటమే. హిమయుగాలు మనిషి జీవన విధానాన్ని సమూలంగా మార్చివేశాయి. ఆహారం కోసం చెట్లు చేమలమీద కాక, జంతువుల మీద ఆధారపడటం

నేర్పించాయి. జారిపోతున్న మంచుమీద నడిచి వేటాడే క్రమంలో అతడు కొత్త పద్ధతులు నేర్చుకున్నాడు. ఒక్క జంతువును వేటాడటం కన్న జంతువుల గుంపుల్ని వేటాడటం ఎక్కువ లాభసాటి అని గ్రహించాడు. ఇందుకోసం జంతువుల వలసలనూ, వాటి అలవాట్లనూ అధ్యయనం చేశాడు. ఫలితంగా, మనిషి ఎక్కడ నివసించాలనేది జంతు సమూహాలు నిర్ణయించాయి. ఈ క్రమంలోనే వాటిని మచ్చిక చేసుకుని, 'సంచార ఆహార నిల్వలు'గా మార్చుకున్నాడు.

ఈ సంచార జీవిత పద్ధతి యిప్పుడు యించుమించు అంతరించినట్టే. స్కాండినేవియాలోని Lapps మాత్రమే యింకా హిమయుగాలని తలపిస్తూ రెయిన్‌డీర్ మందల వెంటపోతారు. ఇప్పుడక్కడ వున్న Lapps జనాభా ముప్ఫైవేలు, రెయిన్‌డీర్‌లు 3 లక్షలు. త్వరలోనే ఈ సంచార జీవితం ముగుస్తుంది. వీళ్ళ పద్ధతులు కాస్త వింతగా వుంటాయి. కొన్నిసార్లు వాటికి 'కుటుంబ నియంత్రణ' చేసి వాటిని బళ్ళు తోలడానికి వాడుకుంటారు. రోజుకో జంతువు చొప్పున వాటి మాంసం తింటారు. తోళ్ళనూ, లోపలి పేగులనూ వదిలి పెట్టరు. వాటి పాలు త్రాగుతారు. చివరికి వాటి కొమ్ములను కూడా వాడుకుంటారు. అయితే, యిదంతా సాంస్కృతిక జీవితంలో భాగంగానే చూడాలి. ఎందుకంటే జీవ సంబంధమైన అలవాట్లలో మార్పుండదు. కాని సంస్కృతి మీద పరస్పర సమాజాల ప్రభావముంటుంది.

Lapps తెల్లగా ఎందుకుంటారు? మనిషి జీవితం నలుపు చర్మంతో ప్రారంభమైంది. ఆఫ్రికాలోలాగ నల్లగా వున్న చర్మం ఎక్కువ విటమిన్ 'D' ని సులభంగా తయారు చేస్తుంది. కాని ఉత్తరాన, సూర్యకాంతి తక్కువగా వున్న ప్రదేశాల్లో శరీరానికి అవసరమైనంత విటమన్ 'D' తయారు కావటం కష్టం. అందువలన, జీవజాతుల సహజమైన ఎంపిక వీళ్ళ చర్మాలను తెల్లగా వుంచింది.

అయితే కేవలం తెలుపు చర్మం వల్లనే Lapps ఆ మంచు టెడారులలో మనగలిగారా? హిమయుగాలను తట్టుకుని వాళ్ళు ఈనాటికీ మనతో సావాసం చెయ్యగలుగుతున్నారంటే అది మానవ చరిత్రలో జరిగిన ఒక అత్యద్భుత ఆవిష్కార ఫలితమే. నిస్సందేహంగా అది అత్యంతకీలకమైన, మౌలికమైన ఆవిష్కరణ. అదే నిప్పురాజెయ్యటం, అగ్నిని తయారు చేసిన మనిషి జీవితమే మారిపోయింది.

## భోగి మంటలు....

రవ్వలు రేపుతూ నాల్కలు చాపుతూ
మంట! భోగిమంట!
గాలిని తింటూ – కాలిన దుంగలు,
అగ్ని దేవుడని, సర్వభక్షకుడని, పునీతుడని...
ఈ భగ భగలు చూస్తుంటే నాలో రగిలి
రేగిన మంటలు ఎన్నో, ఎన్నెన్నో...
సీతను పునీతను చేసిన మంటలు,
పాంచాలిని దహించిన ప్రతీకార జ్వాలలు,
అనాదిగా మనిషిని మృగాన్ని వేరు చేసిన నిప్పులు.
అధికారంకోసం ఆహుతయిన సమిధలు...
యుద్ధభూమిలో రేగిన శత్రుకీలలు...
మరుభూమిలో ఆరిన మృతజ్వాలలు...
ప్రాణికోటిని నడిపించే వేడిగాలులు....
నాన్నను బూడిదచేసిన చితిమంటలు,
అమ్మను ఆవిరిచేసిన ఆరని మంటలు,
అక్కను పొట్టను పెట్టుకున్న కట్టెల మంటలు,
పిన్నిని మాయంచేసిన కరెంటు మంటలు,
మామను మరిగించిన తడిమంటలు...
రక్తం ఉడికించే మల్లెల మంటలు
ఊపిరులావిరులాదిన ఉడుకుమంటలు...
చీకటి సాగరాల దారుల రేగిన మంటలు,
భూమిగర్భం నుంచి ఎగసివస్తున్న గ్యాస్ మంటలు,
కడలి అడుగున పుట్టిన బడబాగ్ని కీలలు
నేలకు తాకే ఉల్కల దారులు...

రైలులో రాత్రి చూసిన నీ కురుల చీకటి మంటలు
మంటలు మంటలు మంటలు మంటలు....

**- కవిత**



# కర్ణాటక సంగీతం

- ఆకెళ్ళ మల్లికార్జున శర్మ

కర్ణాటక సంగీత పరిరక్షణలో ఉన్నత ప్రమాణాలుగల విద్యాబోధనకు గల ప్రాముఖ్యం చాలా ఎక్కువ. అందుకోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గురువులను ఎన్నుకోడంలో జాగ్రత్త వహించవలసిన అవసరం చాలా ఉన్నది. నిజానికి మహావిద్వాంసులంతా సద్గురువులనుకోవడం చాలా పొరబాటు. సంగీతం అసలేరాని వారికి కొంచెమైనా సంగీతం పాడే చిన్నా చితకా సంగీతజ్ఞులంతా మహావిద్వాంసులలాగే కనిపిస్తూంటారు. మన విద్యాప్రమాణాలను యితర శిష్యులతోనూ, యితర గురువుల శిష్యుల ప్రమాణాలతోనూ పోల్చి చూచుకొని ముందుగా మేల్కొనకుండా గ్రుడ్డిగా 'గురువుగారి గురించి ఏమైనా తప్పుగా అనుకుంటే కళ్ళు పోతాయి' అని నిజంగానే కళ్ళు మూసుకుంటే నష్టపోయేది శిష్యుడు మాత్రమే.

సాధారణంగా సంగీతం నేర్చుకున్న వారంతా విద్యా దానం చేయడం చాలా మంచిదనో లేక ధనసంపాదన కోసమో వారు నేర్చుకున్న సంగీతం విద్యార్థులకు నేర్పేస్తూంటారు. మరి కొంతమంది అన్నాళ్ళూ వేరే ఏదో ఉద్యోగం వెలగబెట్టి రిటైరైన తర్వాత ఏం చేయాలో తోచక అన్నాళ్ళు అటకమీద పెట్టిన వైలిన్ దుమ్ముదులిపి కొంతమందిని చేరదీసి చౌకగా సంగీతం నేర్పడం మొదలు పెట్టి, అని ఆశీర్వదించినట్లుగా సంగీతం నేర్చుకోడానికి వచ్చిన వాళ్ళను తరింపజేస్తూంటారు. అందుచేత గురువులు దొరకడం కష్టం కాకపోయినా 'మంచి గురువులు' దొరకడం అనేది భారత స్త్రీకి మంచి భర్త లభించడం లాంటిది.

విద్యార్థి యొక్క పరాధీనతను రూపుమాపి అతనిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా బోధనావిధానాన్ని ఎంత సులభతరమూ, శీఘ్రతరమూ చేస్తే అంత గొప్ప గురువు అవుతాడు. ఈ సంగీత విద్యాబోధనలో గురువు బాధ్యత 85 శాతము కంటే ఎక్కువ కాగా శిష్యుడి బాధ్యత 15 శాతము కంటే తక్కువగా ఉంటుందనే విషయం గమనించి బాధ్యతాయుతంగా, సక్రమంగా బోధించే గురువులు వ్రేళ్ళ మీద లెక్కపెట్టగలిగిన వాళ్ళే ఉంటారు.

సాధారణంగా సంగీతం నేర్పేవారు, వారు నేర్చుకున్న దానిని విద్యార్థులకు నేర్పుతుంటారు. కాని విద్యార్థులకు నేర్పవలసిన విధానాన్ని తెలుసుకొని నేర్పేవారు 'మంచి గురువులు'గా పేరు తెచ్చుకొని మంచి శిష్యుల్ని తయారు చేస్తారు. అటువంటి మంచి గురువులు కూడా ధన సంపాదనకే అధిక ప్రాముఖ్యం ఇవ్వకుండా మంచి శిష్యుల్ని ఎన్నుకోవడంలో కొన్ని పద్ధతులు ఖచ్చితంగా పాటించవలసిన అవసరం ఉన్నది. నేను వైలిన్ లెక్చరర్‌గా జేరిన క్రొత్తలో (1961) ఒక ప్రబుద్ధుడు 'వచ్చేవాడికి సంగీతం ఎలాగైనా వచ్చేస్తుంది అందుచేత సంగీతం బాగా రాని వాడి మీదే ఎక్కువ శ్రద్ధ చూపించాలి' అని సలహాయిచ్చాడు. కాబోసనుకొని అది పాటించడం వల్ల విద్యార్థులకు సిలబస్ పూర్తికాక, పూర్తయినా సరిగా వాయించడం రాకా రమారమీ 10 సంవత్సరాలకు పైగా నానా యాతనలూపడి ఒకసారి యిలా ఎందుకు జరుగుతోందని విశ్లేషించుకొని 'రాని వాడికి ఎలాగా రాదు బాగా వచ్చేవాడిమీదే ఎక్కువ శ్రద్ధచూపిస్తే


ఆకెళ్ళ మల్లికార్జున శర్మ, ఫోన్ : 9908822992

బాగుంటుందేమోనని' ఆ పద్ధతిని అనుసరిస్తే చాలా మంచి ఫలితాలు వచ్చి అప్పటినుంచి అదే పద్ధతిని అమలు చేశాను.

నేను సంగీత విద్యార్థులపై బోధనా విధాన విషయంగా ప్రయోగాలు చేస్తూ, చాలా విషయాలు తెలుసుకొంటూ ఒక సులభతర, శీఘ్రతర సంగీత బోధనావిధానాన్ని రూపొందించి దాన్ని కూడా ప్రతీసారి క్రొత్త పద్ధతులతో ఆధునికీకరిస్తూ, అనుసరిస్తూ చాలా మంచి ఫలితాలను పొందవచ్చు.

**సులభతర, శీఘ్రతర సంగీత బోధనా పద్ధతులు:**

మొట్టమొదటగా సంగీతం నేర్పడానికి విద్యార్థులను ఎన్నుకొనేటప్పుడు సాధారణంగా సంగీతాధ్యాపకులంతా విద్యార్థుల స్వరజ్ఞానాన్ని మాత్రమే పరిక్షిస్తూంటారు గాని వారి లయజ్ఞానాన్ని పరీక్షించరు. సాధారణంగా సంగీత పాఠాలు చెప్పేవారిలో ధనార్జనాసక్తి గలవారే ఎక్కువగా ఉండి వారు యిటువంటి లయజ్ఞాన పరీక్షలను పెట్టి కొందరు విద్యార్థులను వదలుకోడానికి యిష్టంలేక యీ లయజ్ఞాన పరీక్షలు శుద్ధ దండగ అని వాదిస్తూంటారు. నా అనుభవంలో సాధారణంగా లయజ్ఞానమే ఎక్కువమందికి సహజంగా ఉంటుంది. ఈ లయజ్ఞానాన్ని పరీక్షించడంలో మంచి లయానుభూతిని కలిగించే వేగంలో చతురశ్ర, త్రిస్రగతులలో వాయింపబడి రికార్డు చేయబడిన వాద్యసంగీతాన్ని విద్యార్థులకు వినిపించి దాని కనుగుణంగా మనమే రెండు చేతులతోనూ దెబ్బలను (ఘాతలను) తొడలపై సమ, విషమ గ్రహాలలో వేస్తూ, విద్యార్థులను కూడా అదేవిధంగా రెండు చేతులతోనూ ఘాతలు వేస్తూ అనుకరించమంటే లయజ్ఞానము సహజముగా గలవారు చాలా సులభంగా అనుకరిస్తారు. దీనికిగాను మొదట చతురశ్రగతిలో రికార్డు చేసిన సంగీతమే వారికి వినిపించాలి. దీనిని బాగా అనుకరించగల వారికి మాత్రమే తదుపరి త్రిస్రగతిలో రికార్డు చేసిన వాద్య సంగీతాన్ని కూడా వినిపించి మళ్ళీ దానిని కూడా మనమే అనుకరిస్తూ వారిని మనతో అనుసరించ మనాలి (యీ రెండు గతులనూ అనుకరించ గల్గినవారికి లయజ్ఞానం బాగా యున్నదని గ్రహించాలి). చతురశ్రగతిలోని సంగీతాన్ని బాగా అనుసరించినవారికి అవసరమైన లయజ్ఞాన మున్నట్లుగా భావించి వారికి మాత్రమే తదుపరి శ్రుతిజ్ఞానాన్ని 12 స్వరగత స్థానాలనూ మనమే పాడుతూ వారిచేత అనుకరింపజేసి అదికూడా తృప్తికరంగా గలవారికి మాత్రమే విద్యాబోధనను మొదలుపెట్టాలి.



ఈ సంగీత విద్యాబోధనలో గాత్రబోధనకూ, వాద్య బోధనకూ వేరు వేరు పద్ధతులున్నాగాని కొన్నిపద్ధతులు మాత్రం రెండింటికీ ఒకే విధంగా ఉంటాయి. ఈ విద్యా బోధనలో, విద్యార్థులకు మొట్టమొదటగా రెండు చేతులతోనూ రెండు తొడలమీదా ఘాతలను నేస్తూ నోటితో 'కిటతక' అని అంటూ 'కిట' అనినపుడు కుడిచేతి ఘాతనూ, 'తక' అనినపుడు ఎడమచేతి ఘాతనూ ఒక సెకను కాలములో 'కిటతక' అనే మాత్రాకాల వేగంలో రెండు చేతుల ఘాతలనూ విడివిడిగా వేయిస్తూ సాధన చేయించాలి.

దీనిని చతురశ్ర జతిగానే గాక సప్తతాళాలలోని ఏకతాళజతి అలంకారముగా కూడా పరిగణించి దీని తరువాత మిగిలిన తాళాలలోని జతి అలంకారాలను వరుసగా రూపకతాళజతి 'తక।కిటతక॥', మఠ్య తాళజతి – 'కిటతక। తక।కిటతక॥' ధ్రువతాళజతి 'కిటతక।తక।కిటతక। కిటతకలను ఒక అంచెలో యీ వేగంలోనే ఎక్కువగా సాధన చేయించి తదుపరి వరుసగా – ఝంపతాళజతి 'తకిట–తక–తకి।ట।తా॥' ఆటతాళజతి – 'తకీటా। తాకిటా। తా। తా॥' త్రిపుటతాళజతి – 'తకిట।కిట।తక॥'–లను కూడా యిదే 3వ కాలంలో రెండుచేతుల ఘాతలతోనూ (తాళాంగముల గురించి చెప్పకనే) ఎక్కువగా సాధన చేయించాలి. లయజ్ఞానం సహజంగా ఉన్నవారికి యీ అభ్యాసాలన్నీ ఒక వారం రోజుల్లోనే పూర్తవుతాయి. అప్పుడు సరళీస్వరాలను (మాయా మాళవ గౌళరాగంలో కాక) శంకరాభరణ రాగంలో అదే మాత్రాకాల వేగంలో ఘాతలు వేస్తూ సెకనుకు రెండు స్వరాల రెండవ కాలవేగంలో 'Casio' వాయిస్తూ దానితో పాటుగా గురువులు పాడుతూ విద్యార్థిచేత కూడా పాడించాలి. ప్రాథమిక దశను అనగా గీతాలవరకూ 'Casio' యొక్క లయ, స్వరసహకారంతో సాధన మంచి పునాదిని వేస్తుందని గురువులు గ్రహించడం అవసరం. ఇదే విధంగా 6 సరళీస్వరాలు నేర్పిన తరువాత 4 జంటస్వరాలను సెకనుకు రెండు స్వరాలవేగంలోనే ఘాతలు చేస్తూ 'Casio'

వాయిస్తూ పాడించాలి. తదుపరి సప్తతాళస్వర అలంకారాలను యిదివరకటి వరుసలోనే సెకనుకు రెండు ఘాతలూ, ఘాతకు రెండు స్వరాల చొప్పున 'Casio' వాయిస్తూ వారిచేత పాడించాలి. గాత్ర, వాద్య విద్యార్థులకందరకూ యింతవరకూ యిలాగే బోధించి వాద్య విద్యార్థులకు యిక్కడే వాద్యం వాయించే విధానం సరళీస్వరాల నుండి మొదలు పెట్టాలి.

తదుపరి కూడా తాళాంగాలు చెప్పకుండానే యిదివరకటిలాగే రెండుచేతుల ఘాతలతోనూ సెకనుకు 2 ఘాతలూ ఘాతకు ఒక స్వరం అనగా సెకనుకు 2 స్వరాల వేగంలోనే వరుసగా శంకరాభరణము, మోహన, శుద్ధ సావేరి, కళ్యాణి, మలహరి రాగాలలో గీతాల స్వరాలనూ శ్రీరంజని రాగలక్షణ గీతస్వరాన్నీ చివరిగా హిందోళ రాగస్వరపల్లవినీ బోధించి యింతవరకూ యివన్నీ కంపితగమక రహితంగా శుద్ధస్వరాలను మాత్రమే పాడడం, వాయించడం నేర్పి, తదుపరి అన్నిగీతాలకూ వరుసగా ఆకారాన్నీ, సాహిత్యాన్నీ కూడా నేర్పి అపుడు అంతవరకూ అయినవాటినన్నింటినీ తాళాంగాలతో బాటుగా కుడిచేతితో తాళంగాలనూ, ఎడమచేతితో ఘాతలనూ వేయించి అన్నీ త్రికాలాలు పాడడం, వాయించడం నేర్పాలి. తదుపరి ఒకవంక గాత్ర, వాద్య విద్యార్థులకు 12 స్వరగతస్థానాల పరస్పర కంపిత గమకానుబంధ విజ్ఞానాన్ని కలగజేసి అందుకు సంబంధించిన వివిధ అభ్యాసములనూ మరొకవంక చతురశ్రగతి ఆదితాళములో త్రిస్ర, ఖండ, మిశ్ర జతవిరుపు అభ్యాసముల వంటి లయసాధనలనూ సక్రమంగా చేయించాలి.

ఇంతవరకూ విద్యార్థులకు నేర్పవలసినవన్నీ లయ అభ్యాసములతో బాటుగా పైన జెప్పబడిన 18 కేసెట్లలోనూ వివరముగా పాడి రికార్డుచేసి లోకానికందీయడం జరిగింది. వీటిలో ప్రతి కేసెట్‌లోనూ 'ఎ'లో గల దానిని యింకొక పూర్తి కేసెట్‌లో రెండు ప్రక్కలనూ, అలాగే 'బి'లో గల దానిని, మరొక పూర్తి కేసెట్‌లో రెండు ప్రక్కలనూ డబ్ చేయించి విద్యార్థులకు వారి స్థాయికి సంబంధించినది యిచ్చి వారు వీటిని వారి వారి యిళ్ళ వద్ద విని వీటితోబాటుగా సాధన చేయడం జరిగేలా చూడాలి.

తదుపరి నాటకరంజి, కాంభోజి, దర్బారు, శంకరాభరణము, కళ్యాణి, బేగడ, తోడి, సావేరి రాగాలలోని 8 ఆదితాళ వర్ణాలనూ యిదే వరుసక్రమంలో మొదట స్వరాన్నీ, తదుపరి ఆకారాన్నీ, చివరిగా సాహిత్యాన్నీ సెకనుకు ఒక అక్షర వేగంలో అవసరమైన కంపితగమకాదులతో నేర్పించి వాటి స్వరభాగమును అవసరమైన కంపిత గమకాదులతో పాడి రికార్డు చేసిన కేసెట్లను కూడా వారికిచ్చి వారియిళ్ళవద్ద వీటిని వింటూ సాధన చేసేట్లు చూడాలి. చివరన అన్ని వర్ణాల పూర్వాంగ ఉత్తరాంగాలు రెండూ రెండుకాలాలు పాడడం, వాయించడం నేర్పాలి.

ఈ 'సులభతర, శీఘ్రతర సంగీత బోధనాపద్ధతి' లోగల విశేషమేమంటే యీపై 8 ఆది తాళవర్ణాల పూర్వాంగ ఉత్తరాంగాలు రెండూ రెండేసి కాలాల చొప్పున పాడడం, వాయించడం వస్తే తదుపరి నేర్చుకొనవలసిన కృతి కీర్తనలను స్వరపరచి వ్రాసి యిచ్చి వాటితో బాటుగా వాటిని పాడి రికార్డు చేసిన కేసెట్లను కూడా యిస్తే విద్యార్థులు చాలా వరకూ వారంతటవారే వాటిని స్వర, ఆకార, సాహిత్యాలు పాడుకొనే, వాయించుకొనే శక్తిని పొందితే అంతవరకూ గురువు బోధించిన, పర్యవేక్షించిన విధానము సక్రమముగనే యున్నదనీ, లేనియెడల సక్రమంగా లేదనీ గ్రహించాలి. ఇదే యీ బోధనా పద్ధతికి గల నిదర్శనం.

ఈ పద్ధతిలో విద్యార్థులు నిత్యమూ చేసుకొనే వివిధ సాధనలలో వినియోగించుకోడానికి షడ్జ, పంచమ, మధ్యమ, షడ్జములలో మంద్ర, మధ్య, తారాస్థాయిలు మూడింటిలోనే ఒక్కొక్క తంబూరా చొప్పున మూడు తంబురాలు ఒకేసారి శ్రుతి జేసుకొనే సౌకర్యమేగాక రెండు స్థాయిల షడ్జ, అంతరగాంధార, శుద్ధ మధ్యమ, పంచమ, పంచశ్రుతి దైవతములలో రాగాన్నిబట్టి కావలసిన స్వరములను కూడా వినియోగించుకొనే వీలుకలిగిన ఎలక్ట్రానిక్ – ఆటోమాటిక్ – తంబురానూ తయారుచేయించి యీయడం వలన విద్యార్థులు ప్రతిదినమూ కనీసం 5, 6 గంటలు ఆసక్తితో, సాధన చేయడం జరుగుతోంది. ఇట్లే విద్యార్థులు ఆసక్తితో సాధన చేయడానికి వీలుగా వారికి యిటువంటి ఎలక్ట్రానిక్ శ్రుతిలయ సాధనాలను సమకూర్చవలసిన ఆవశ్యకత నిజానికి తల్లిదండ్రులకంటె ఉన్నతస్థానమీయబడిన గురువులపైనే ఉన్నది.

వర్ణముల తరువాత విద్యార్థులకు నేర్పవలసిన కృతి, కీర్తనలు చిక్కని స్వరపాతముతో నిండి ఉండేట్లుగా చూడాలి. దాని మూలంగానే రాగంలో గల క్లిష్టమైన సంగతుల సాధన అలవాటౌతుంది. క్లిష్టమైన సంగతులు కావాలంటే

రాగాలాపనలో పాడుకోవచ్చునుగాని కృతి పాఠంలో అనవసరమనే అభిప్రాయం చాలామందికి ఉన్నది. కాని అది సరికాదు. కృతిలోని రాగ సంగతులు క్లిష్టమైనవి ఉంటే ప్రత్యేక సాధన చేస్తేనే గాని వాటిని పలకడం సాధ్యం కాదు. గనుక తప్పక సాధన చేయవలసి వచ్చి ఆ సంగతులను పాడడం జరుగుతుంది. అందుచేత కృషి చేసే వారికి యిదే మంచిది.

మంచి కీర్తన పాఠం తరువాత జాగ్రత్త వహించవలసినది స్వరకల్పన విషయంలో. ప్రభుత్వ సర్టిఫికేట్ సిలబస్‌లో స్వరకల్పన, రాగాలాపనలు 4వ సంవత్సరం చివరలో ఉండడం చేత అధ్యాపకులు విద్యార్థులకు వీటిని 4వ సంవత్సరం చివరలోనే మొదలు పెడుతూంటారు. అదీగాక యీ స్వరకల్పన, రాగాలాపనలు నేర్పితే రావు, బాగా వినగా వినగా, సాధన చేయగా చేయగా ఎపుడో వస్తాయనే దురభిప్రాయం అందరిలోనూ బాగా పాతుకుపోయింది. వర్ణాలకు ముందు నుండీ చేస్తున్న జతివిరుపు అభ్యాసముల సాధన ఆధారంగా 'సులభముక్తాయి'ల జతుల సాధననూ తదుపరి వాటికి స్వర సాధననూ బోధిస్తే స్వరకల్పన చేయడంలో విద్యార్థులకు ఆత్మవిశ్వాసమేర్పడి మొదటి 5, 6 కృతులు నేర్చుకోగానే 2వ కాలంలో స్వరకల్పన చేయగల సామర్థ్యం వస్తుందన్నది నా స్వానుభవం.

కాని వచ్చిన చిక్కేమిటంటే యివన్నీ ముందుగా అధ్యాపకులు తెలుసుకొని వారు సాధన చేసిన తరువాత విద్యార్థులకు నేర్పాల్సి వస్తుంది. ఈ కారణంచేత చాలామంది ఆధ్యాపకులు విద్యార్థులకు వర్ణాలు, కృతులు, కీర్తనలు ఎక్కువగా నేర్పుతూ పోతూంటారుగాని స్వరకల్పనను సమర్థవంతంగా పాడడం నేర్పరు. రాగాలాపనకు తాళంతో పాడే యిబ్బంది ఉండదు. గనుక కొంతమంది ఆధ్యాపకులు రాగాలాపన చేయడం కొంచెం నేర్పుతుంటారు. స్వరకల్పన జోలికేపోరు. పోయినాగాని పట్టుమని పది ఆవర్తాల స్వరకల్పనకంటే నేర్పరు. ముక్తాయిలతో అసలే నేర్పరు. స్వరకల్పనను ముక్తాయిల ద్వారా చేస్తే సులభంగా వస్తుందని చెప్పినా మనవాళ్ళు నమ్మేస్థితిలో లేరు. అసలు కారణం ఏమిటంటే, వాళ్ళే ముందుగా యీ ముక్తాయిలన్నీ సాధన చేయవలసి వస్తుందనే బాధ మాత్రమే. ఇక్కడ ఒక ముఖ్య విషయం చెప్పాలి. సంగీతాన్ని పాడినది, రికార్డు చేసుకుని దానిని ఎన్నిసార్లయినా తిరిగి వినేసౌకర్యంగల "కేసెట్ రికార్డర్" అనేది నిజానికి మన సంగీతానికి వరం లాంటిది. కాని మనవాళ్ళు దీనిని సంగీత బోధనకు వినియోగించుకో వలసినంతగా వినియోగించడం లేదనడానికి నిదర్శనంగా కేసెట్లలో రికార్డు చేసుకొని అమ్ముకొనే కృతులను వివరంగా స్వరపరచి వ్రాసిన గ్రంథాలుగాని అదేవిధంగా గ్రంథాలలో స్వరపరచి వ్రాసినవి వ్రాసినట్లుగా పాడి రికార్డు చేసిన కేసెట్లుగానీ లేవు. 'మేము ఎంతో ఘనమైన సంగీత సేవచేస్తున్నాం' అని ఎంతో ఘనంగా చెప్పుకొని భుజాలు చరుచుకొంటూ ఎడా పెడా సన్మానాలు, బిరుదులూ, పురస్కారాలు కొట్టేస్తున్న ఘనమైన విద్వాంసులు ఎంతసేపూ మేం వ్రాసిన గ్రంథాలు చూసీ మేంపాడిన కేసెట్లూ, సిడీలు, సినీ వర్ణాలూ, త్యాగరాజ కీర్తనలూ, అన్నమాచార్య కీర్తనలూ, రామదాసు కీర్తనలూ, నేర్చుకోమని చెప్పేవారేగాని మనోధర్మ సంగీతంలో అతిముఖ్య విభాగాలైన స్వరకల్పన, రాగాలాపనలు సులభతరం చేసి, స్వరపరచి వ్రాసి, అదే కేసెట్లులో పాడి రికార్డు చేసి సంగీతలోకానికందించిన ఘనమైన విద్వాంసులొక్కరూ లేకపోవడం మనజాతి దురదృష్టం.

ఈ లోటును తీర్చడానికే చరిత్రలో మొట్టమొదటిసారిగా ఆరు తాళాలలోని వివిధ కృతులకు వివిధ సులభ ముక్తాయిలను జతి, స్వర సహితంగానూ, 36 రాగాలాపనలను స్వరపరచి వ్రాసి వాటినే యధాతథంగా పాడి రికార్డు చేసిన 9 కేసట్లతో సహితంగా 'సంగీత స్వరరాగసుధ' అనే గ్రంథాన్ని తెలుగు, ఇంగ్లీషు భాషలలో వ్రాసి లోకానికందించడం జరిగింది. ఈ రాగాలలో ఏదీ 4, 5 నిమిషములకు మించకుండా వివరంగా కంపిత గమకగుర్తులతో స్వరపరచి వ్రాసి, ప్రతీరాగాన్నీ, ముక్కలుగా విభజించి, ఆ ముక్కలకు వరుస సంఖ్యలనిచ్చి, ప్రతిముక్కనూ ఒకసారి స్వరమూ, రెండుసార్లు ఆకారమూ, చివరిగా రాగం అంతా ఒకసారి ఆకారంతోనూ పాడి రికార్డు చేయడం జరిగింది. నా కర్ణాటక సంగీత విజ్ఞానం అంతా ప్రఖ్యాత విద్వాంసులు 'సంగీత కళానిధి' శ్రీ నేదునూరి కృష్ణమూర్తి గారి నుండి ప్రాప్తించిన కారణంచేత యీ రాగాలను వారు పాడే విధంగా సంగతులతో నేను పాడి 9 కెసెట్లలో రికార్డు చేసి యీ గ్రంథంతో బాటుగా అందించడం జరిగింది. ఈ విధంగా స్వరకల్పన, రాగాలాపనల బోధన చరిత్రలో మొట్టమొదటిసారిగా సులభతరం, శీఘ్రతరం చేయబడినవి. ఈ గ్రంథంలో పల్లవిని, త్రికాలంపాడే విధానంతో బాటుగా కొన్ని పల్లవులను కూడా పేర్కొనడం జరిగింది.

# భారతీయ ముస్లింలు :
# ఒక పరిశీలన

- దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి

ప్రపంచంలో అత్యధిక ముస్లింలుండే దేశం ఇండొనేషియా. రెండోస్థానంలో ఇండియా ఉంది; పాకిస్తాన్, ఇరాన్, ఇరాక్, సౌదీ అరేబియా లాంటివి కాదు. అసలు పాకిస్తాన్‌లో కంటే ఇండియాలో ముస్లింల సంఖ్య ఎక్కువ. అయితే అల్ఖయిదాలో భారతీయ ముస్లింలు లేరు. అమెరికాకు చెందిన 'గువన్తనామొబే'లోని 9/11 ఖైదీల కేంప్‌లోనూ భారతీయ ముస్లింలు లేరు. ఇరాక్‌లోని జీహాదీలతో కలసి కూడా భారతీయ ముస్లింలు పోరాటం చేయలేదు. కాని పలు ముస్లిం దేశాల ముస్లింలు అల్ఖయిదాలో ఉన్నారు. మరో విచిత్రమేమంటే, అమెరికన్ ముస్లింలూ అల్ఖయిదాలో ఉన్నారు. బొంబాయి సంఘటనలోనూ ఉన్నారు. ఎందుకు ఇలా? భారతీయ ముస్లింలు మాత్రం ఉగ్రవాద సంస్థలో లేకపోవడానికి కారణమేమిటి? భారత్‌లో ఉండే పరిస్థితే ఇందుకు కారణం. ఏమిటది? సెక్యూలరిజం, స్వేచ్ఛా వాణిజ్యం, ప్రజాస్వామ్యం భారత్‌లో నెలకొని ఉండడం, వాటిపై అహింసా సిద్ధాంతం, హిందువుల సహజీవన, సహన గుణాల ప్రభావం ఉండడం అందుకు కారణం. అరవై ఏండ్లు పైగా నిలకడగల ప్రజాస్వామ్యాన్ని నిరాటంకంగా అనుభవించిన అత్యధిక సంఖ్యాక ముస్లింలు ప్రపంచంలో భారతీయ ముస్లింలు మాత్రమే. భారత రాజ్యాంగమూ సెక్యులర్ రాజ్యాంగం, నైపుణ్యాన్ని ప్రదర్శించగల ఏ మత, కుల, వర్గం వారైనా ఆర్థికాభివృద్ధిని సాధించుకోవడానికి నిజమైన అవకాశాన్ని కల్పిస్తోంది ఆ రాజ్యాంగం. అందుకే ప్రధానంగా భారతీయ ముస్లింల మధ్యతరగతి క్రమంగా పురోభివృద్ధిని సాధిస్తోంది. అందుకే ప్రజాస్వామ్యేతర పాలనా వ్యవస్థగల దేశాల్లోని ముస్లింలలో అగుపడే తీవ్ర కోపాగ్నులు (పాకిస్తాన్‌లోవలె) భారతీయ ముస్లింలలో అగుపడదు. నియంతృత్వ సామాజిక రాజ్య వ్యవస్థలో (పాక్‌లోవలె) ఇస్లాం కూరుకుపోయిన పాకిస్తాన్, సౌదీ అరేబియా, సిరియా, ఈజిప్టు వంటి దేశాల్లో ప్రజాకోపాగ్నికి ఇస్లాం ఆజ్యం పోస్తోంది. కాని బహుళ ప్రజాస్వామ్య సామాజిక, రాజ్య వ్యవస్థల్లో ఇస్లాం కూరుకుపోయిన భారత్, టర్కీ వంటి దేశాల్లో అభిప్రాయాల్ని స్వేచ్ఛగా వెలిబుచ్చడానికి, వాటికై పోరాడడానికి సమాన అవకాశాల్ని ఇస్లాం పొందగల్గుతోంది. అందుకే నూట ఇరవైకోట్లు పైగా ఉన్న జనాభాతో బహుభాషా, బహుజాతి, బహు ఉపజాతీయుల సమ్మేళనంతో భారతదేశపు ప్రజాస్వామ్యం అరవై ఏండ్లు పైగా ప్రపంచానికే స్థిరత్వాన్ని అందిస్తోంది. అంతేకాదు, ఇద్దరు భారతీయ ముస్లింలు దేశాధ్యక్షులయ్యారు. అందులో ఒకరు ఏ.పి.జె. అబ్దుల్ కలాం భారతదేశ అణు మిసైల్ ప్రోగ్రాంకు పితామహుడయ్యాడు. పలువురు భారతీయ ముస్లింలు, అందులో స్త్రీలు కూడా పలు రాష్ట్రాలకు గవర్నర్లుగానూ నియమితులయ్యారు. ముఖ్యమంత్రులూ, మంత్రులూ అయ్యారు. ఇతర ఉన్నత పదవుల్ని పొందారు. దేశంలో అత్యంత ప్రధాన సాంకేతిక పరిశ్రమల్లో ఒకటైన విప్రోకు ఛైర్మనైన అజీంప్రేంజీ భారత్‌లో అత్యంత ధనవంతుడేకాక ఒక ముస్లీం కూడా. భారతదేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ఉన్నత స్థానాన్ని ముస్లిం పురుషుడేకాదు ఒక ముస్లీం మహిళ కూడా పొందగలుగుతోంది. అయితే, సౌదీ అరేబియా వంటి ముస్లిం దేశాల్లో ఒక ముస్లిం స్త్రీకి కారు నడిపే హక్కు కూడా లేదు. భారత్‌లో మాత్రం సినిమా హీరోయిన్‌గా, పార్లమెంట్ సభ్యురాలుగా ఉన్న ముస్లిం స్త్రీ షబానా ఆజ్మీ వంటి వారికి న్యూఢిల్లీలోని అత్యంత పెద్ద మసీదు ఇమాంతో ఒక టెలివిజన్ చర్చలో పాల్గొనే అవకాశం 2001లో ఏర్పడింది (ఇది ఒక


డా. దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, ఫోన్ : 9849584324

ఉదాహరణ మాత్రమే). ఆ చర్చలో ఆఫ్ఘనిస్తాన్‌కు వెళ్ళాల్సిందిగా, అమెరికాకు వ్యతిరేకంగా పోరాడాల్సిందిగా భారతీయ ముస్లింలను ఇమాం కోరాడు. అయితే ఆ లైవ్ టి.వి. ప్రోగ్రాంలో షబనా ఆజ్మీ మాత్రం ఆయన్ను చీల్చి చెండాడింది. భారతీయ ముస్లింలను వారి మానాన వారిని వదిలేసి ఆయన్నే కాందహార్ వెళ్ళి తాలిబన్లలో చేరుమని దెప్పిపొడిచింది. ఆ ఒక ముస్లిం స్త్రీ ఆ రీతిలో ఎలా చెప్పగలిగింది? జవాబు చాలా సులభం. స్త్రీకి ఎంపవర్ మెంట్‌ను రక్షణను ఇవ్వగల్గే వాతావరణంలో / పరిస్థితుల్లో ఆమె జీవించినందునే అలా ఒక మతాధిపతితో స్వేచ్ఛగా మనసువిప్పి మాట్లాడగల్గింది. అంటే, జాతీయతాభావ వ్యతిరేక శక్తులైన మతభావం (మతం కాదు), కులభావం వంటివి సంకుచిత, తిరోగమన ఆలోచనాపరుల ఆస్తులే గాని షబనా ఆజ్మీవంటి భారత జాతీయవాదుల ఆస్తులు కావు.

ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే, ఇస్లాం క్రీ.శ. 7వ శతాబ్దిలో మక్కాలో పుట్టింది; ఇండియాలో కాదు. అది పుట్టిన నాటికి మక్కా దాని పరిసరాల్లో ఇతర మతాలుండేవి. వాటిని రూపుమాపి ఇస్లాం అక్కడ వ్యాప్తి చెందింది. ఆ తరువాత నేటి పశ్చిమాసియా, ఆఫ్రికా, రష్యాలకు వ్యాప్తి చేయబడింది. ఆ పిదప దక్షిణ ఆసియా, ఆగ్నేయ ఆసియా, దక్షిణ చైనాలకూ వ్యాప్తి చేయబడింది. చాలవరకు సైనిక శక్తితోనే ఇదంతా సాధించడం జరిగింది. ఈ క్రమంలోనే ఇండియాలో కూడా ప్రవేశించింది. అరబ్బులు, తురుష్కులు, గజనీ, ఘోరీల దండయాత్రలతో ప్రారంభమై అఫ్గనులు, ఢిల్లీ సుల్తానులు, మొగలుల దండయాత్రలతో భారతదేశాన్ని ఆక్రమించి దీర్ఘకాలం ఇస్లాం పాలకులు ఇండియానూ పాలించారు. దండయాత్రలు చేసిన ముస్లిం పాలకులతో బాటు వారి కుటుంబీకులు, బంధువులు, మిత్రులు, సన్నిహితులు, సైనికులు, ఇతర అధికారగణం అనేక వేల సంఖ్యలో భారతదేశంలో ప్రవేశించారు. ముస్లిం రాజ్యాల ఏర్పాటు తరువాత కాలక్రమంలో అనేక వేల ముస్లింలు భారతదేశ ముస్లిం రాజ్యాల సైన్యంలో, పాలనాయంత్రాంగంలో, వ్యాపార వాణిజ్యాల్లో స్థిరపడ్డారు (బ్రిటిష్ పాలనాకాలంలో క్రైస్తవుల వలె). కానీ, వీరంతా కొన్ని వేలు, లేదా కొన్ని లక్షలమంది మాత్రమే (క్రీ.శ. 1800 నాటికి కూడా భారత జనాభా ఇరవై కోట్లు కూడా లేదు). అయితే సామ్రాజ్యవాద తత్వంగల మతంగా పాలకుల చేతుల్లో మార్పు చెందినందున రాజ్యాల్ని ఆక్రమించడంతోబాటు ఆ రాజ్యాలకు స్థానికుల బలం శాశ్వితంగా ఉండడంకై భారతీయుల్లో అనేకమందిని, ప్రధానంగా ఆర్థికంగా, బలహీనంగా ఉన్న వర్గాల వారిని బలవంతంగాగానీ లేదా సైన్యంలో, ప్రభుత్వంలో పదవుల్ని ఆశచూపిగాని, ఇతర ఆర్థిక లాభాలు చూపిగాని (బ్రిటిష్ వారివలె) హిందూమతీయుల్ని ప్రధానంగా (ఈ మతంలోనే పేదరిక కులస్తులు ఎక్కువ), బౌద్ధ, జైన, సిక్కు వంశీయుల్ని కొంతమేరకు ఇస్లాంమతంలోకి మార్చడం జరిగింది. ఇలా ఇస్లాం మతం స్వీకరించిన వారే అత్యధికులు. అందులోనూ పేదవారే (అందుకే ఇప్పటికీ అధిక ముస్లింలు పేదవారు). భారతదేశాన్ని ఆక్రమించడానికి వచ్చిన ముస్లింలు, అలాగే ముస్లిం రాజ్యాలు ఏర్పడ్డాక వచ్చి భారతదేశంలో పలు రంగాల్లో స్థిరపడిన ముస్లింలకన్నా ఇస్లాం మతాన్ని స్వీకరించిన భారతీయ పేదలే అత్యధిక సంఖ్యాకులు (ఉన్నత కులాల వారు కూడా కొందరు ఇస్లాంను స్వీకరించారు). అంటే, ఒరిజినల్ ముస్లింల కన్నా (విదేశాల నుండి వచ్చిన ముస్లింలు) మతమార్పిడి పొందినవారే అధికులు. అంటే, నేటి భారత దేశంలో ఉన్న ముస్లింలలో అత్యధికులు కన్వర్టెడ్ ముస్లింలే. (క్రైస్తవుల వలె). అంటే భారత ముస్లింలలో రెండు రకాలున్నారు: ఒరిజినల్ ముస్లింలు (హిందువుల్లో ఉన్నత కులాల వంటి వారు; ధనిక పాలక వర్గాల వారు), కన్వర్టెడ్ ముస్లింలు (హిందూ బి.సి., ఎస్.సి., ఎస్టీ వంటివారు). ఒరిజినల్ ముస్లింలు కూడా క్రీ.శ. 7వ శతాబ్దిలో ఇస్లాం పుట్టుక మునుపు ఉండిన మతాల్ని వదలి ఇస్లాంను స్వీకరించిన వారే. ఇక, కన్వర్టెడ్ ముస్లింలు ఒరిజినల్‌గా హిందువులు, కొద్దిపాటి బౌద్ధులు, జైనులు, సిక్కులు. అందుకే భారతీయ ముస్లింలలో మతస్వీకారం వలన భాష, పరదా, మసీదుకు వెళ్ళడం వంటి ఇస్లాం సంస్కృతీ మూలాలు (సంస్కృతి మత మూలాలలో కూడి ఉంటుంది) వారిలో ఉన్నప్పటికీ హిందూ సంస్కృతీ మూలాలు వారిలో పూర్తిగా తరాలు మారినా చెరిగిపోవడం లేదు; ముఖ్యంగా పేద ముస్లింలలో. ఉదాహరణకు బొట్టు, చీరకట్టు, హిందూ ఆలయాలకు కూడా వెళ్ళడం, స్వచ్ఛమైన ప్రాంతీయ భాష మాట్లాడడం (తమిళనాడులో తిరుచివంటి కొన్ని ప్రాంతాలలోని ముస్లింలకు తమిళం మాత్రమే వచ్చు, ఉర్దూ కూడా రాదు) ప్రాంతీయ భాషల్లో కవులుగా, రచయితలుగా ప్రావీణ్యం కలిగి ఉండడం హిందూ పండుగల్ని జరుపుకోవడం

వంటి అనేక అంశాల్లో సంస్కృతిని కొనసాగుతుండటం అగుపడుతుంది. ఇతర మతస్తులలో, ఇతర హిందూ మతాలతో సహజీవనం సాగించే సర్దుబాటు తత్వంగల హిందూమతంలోని మూలాలు ఇలాంటి వారిలో, వారి నడవడికలో అగుపడుతాయి. పరదేశాలనుండి వచ్చిన ముస్లిం కుటుంబాల్లోనే సహజీవనతత్వం కొంత తక్కువగా అగుపడుతుంది (కొందరిలో). ఇట్టి కుటుంబాల నుండి వచ్చిన వారిలోనే చాందన ఇస్లామిక్ భావాలు అధికంగా అగుపడుతాయి. పరదేశీ మూలాలుగల ఇలాంటి వారి కుటుంబాల నుండే కొంత వరకు మత, హింస, ప్రాంతీయతా వాద అనుకూలురు సాధారణంగా ఉద్భవిస్తున్నారు. అయితే, ఇస్లాంను స్వీకరించిన భారతీయుల ప్రభావంతో క్రమంగా వీరూ చాలా వరకు మోడరేట్ కాబడుచున్నారు. అందుకే, అల్ఖయిదా వంటి ఉగ్రవాద సంస్థలో పలు పశ్చిమాసియా దేశాల ముస్లింలు చేరి రాజకీయ ఇస్లాంల వాదంకై పోరాడుతున్నప్పటికీ ఒక్క భారతీయ ముస్లిం కూడా అలాంటి సంస్థల్లో చేరలేదు. ఇందుకు భారతదేశ ఇస్లాం మతస్థులపై ప్రాచీన కాలం నుండి అన్యమతాల వారితో శాంతియుత సహజీవనం సాగించే హిందూ సంస్కృతీ ప్రభావం గాఢంగా ఉండడం, ఆ సంస్కృతి మూలాలుగల వారు, ఇస్లాం మతంలో అత్యధికంగా ఉండడమే అందుకు కారణం.


ఇక, ఇస్లాం మతస్తుల వెనుకబాటు తనానికి కారణాల్ని పరిశీలిస్తే అందుకు ఇస్లాం మత పెద్దలు, ఆ మత పాలకులు, ఆ మత అధికారులు, ఆ మత పురుష జాతి సంకుచిత భావాలే కారణం. రాజకీయ తాలిబన్లవలె కొంతమేరకు వీరూ సాంఘిక తాలిబన్లుగా ప్రవర్తించడమూ ఇందుకు కారణం. ఉదాహరణకు, ఇస్లాం మతస్తుల్లోని సగం జనాభా, ప్రత్యేకంగా స్త్రీలు ఉత్పాదకరంగంలో చాలావరకు లేకుండా ఇస్లాం మత పెద్దలు, పాలకులు, ఇతరులు చేయడం వలన దాదాపు ప్రతి కుటుంబంలో సగం మంది ఉత్పాదకరంగంలో పని చేయనందున సగం ఆదాయం ప్రతి కుటుంబానికి తగ్గిపోతోంది. తల్లుల్ని అజ్ఞానులుగా ఉంచుతున్నందున తమ పిల్లల్ని చదువులేని వారిగా ఆదాయం పెంచుకొనే జ్ఞానంలేని వారుగా, చిన్న చిన్న పనులు చేసుకొంటూ తక్కువ ఆదాయంతో నివసించేట్లు చేస్తున్నారు. ఇక పురుషుల్లో కూడా మత విద్యే ప్రాధాన్యం సంతరించుకొంటూ వస్తోంది. అధిక ధన సంపాదనకు దోహదపడే సైన్సు, టెక్నాలజీ విద్య ఆర్జించేవారు అతి తక్కువగా ఉండడం వలన అత్యధికులు అధిక సంపద సృష్టించలేని, చిన్న చిన్న పనులు చేసుకొంటూ తక్కువ ఆదాయంగల కుటుంబీకులుగా మిగిలిపోతున్నారు. అధిక ఆదాయాన్ని ఇవ్వగలిగే శక్తి సెక్యులర్ విద్యకు మాత్రమే ఉందనేది వీరు గుర్తించడం లేదు. అంటే, సమాజంలో ఏ విద్యకైతే, ఏ స్కిల్‌కైతే, ఏ నైపుణ్యంకైతే గిరాకీ (డిమాండ్) ఉందో ఆ విద్యను ఆర్జించినప్పుడే ఆ విద్య ఆర్జించిన వ్యక్తి, ఆతని కుటుంబం, ఆతని దేశం ఆర్థికంగా బలపడుతుంది. సహజ భౌతిక అవసరాల్ని, తద్వారా దేశ అవసరాల్ని తీర్చలేని విద్య, స్కిల్స్ (ఉదాహరణకు మత విద్య) అధిక ఆదాయాన్ని సమకూర్చడానికి ఉపయోగపడదు. అంటే, సమాజ భౌతిక అవసరాల్ని తీర్చే విద్య, స్కిల్స్ మాత్రమే. ఒక వ్యక్తి ఒక కుటుంబం, ఒక మతానికి చెందిన వారి, ఒక కులానికి, చెందిన వారి ఆదాయాలు నిర్ణయించబడతాయి. ఆధునిక కాలానికి తగిన విద్య, స్కిల్స్ సమకూర్చుకోనట్లయితే ఏ మతస్తులైనా, ఏ కులస్తులైనా, ఏ ప్రాంతీయులైనా ఆర్థికంగా వెనుకబడక తప్పదు. ఆర్థికస్థాయి లేనప్పుడు సమాజంలో కూడా గౌరవ స్థానం పొందలేరు; తక్కువ సామాజిక స్థానం, తక్కువ సామాజిక గౌరవం తప్పదు. స్కిల్స్ తక్కువగల కూలివాడికి తక్కువ ఆదాయం ఉంటుంది. అందుకే అతడిని సంఘంలో తక్కువగా చూస్తారు. సమాజంలో గిరాకీ ఉన్న స్కిల్స్ విద్యగల డాక్టరు, ప్రొఫెసరు, ఇంజనీరు, కలెక్టరు వంటి వారి ఆదాయం ఎక్కువగా ఉంటుంది; వారి జీవనస్థాయి మెరుగ్గా ఉంటుంది గాన, వారికి సంఘంలో గౌరవమూ ఎక్కువగా ఉంటుంది. అంటే, ఆర్థిక వెనుకబాటుకుగాని సాంఘిక వెనుకబాటుకు గాని కారణం సమాజంలో డిమాండ్ ఉన్న స్కిల్స్ (విజ్ఞాన స్థాయి) కలిగి ఉండక పోవడమే; మతాలు, కులాలు కాదు. ఆ స్థితి నుండే కులాలు పుట్టాయి. ఉన్నత కులాలు వారు , తక్కువ కులాలు వారు ఏర్పడడానికి కారణం ఇదే. కొంతమేరకు ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న ఉన్నతకుల హిందువులు, క్రిస్టియన్లు, బౌద్ధులు కొంతమెరుగైన జీవితాన్ని కలిగి ఉండడానికి మతచాందసంలో మునిగి తేలుతోన్న ఇస్లాం మతస్తులు (అన్ని దేశాల్లో) కొంత తక్కువ స్థాయి జీవితాన్ని కల్గి ఉండడానికి స్కిల్స్ (స్కిల్స్ ఇన్ డిమాండ్) స్థాయిలోని తేడాలే కారణం. స్కిల్స్ (విజ్ఞానం) పెరగాలంటే స్వేచ్ఛగా ఆలోచించగల్గే పరిస్థితులు ఉండాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యం. స్వేచ్ఛలేనిచోట అభివృద్ధి సాధ్యపడదు. పశ్చిమాసియా దేశాలే అందుకు ఉదాహరణ. ⓜ







# చదవండి...







✥ **వెన్నెల వెలుగు :** చాలా ఆలస్యంగా సాహిత్య రచనా వ్యాసాంగం ప్రారంభించిన 'డాక్టరు వెంకట రమణగారు' తమ 6వ పుస్తకంగా 'వెన్నెల వెలుగుల'ను ప్రచురించారు. ఇందులో సంగీతం, చిత్రకళ, శిల్పకళ, సాహిత్యం లాంటి ఎన్నో విషయాలకు చెందిన వ్యాసాలున్నాయి. వీటన్నిటిపై ఆయనకు అవ్యాజమైన ప్రేమ ఉంది. ఆ సంస్కారమే ఈ వ్యాస రచనలకు దోహదం చేసింది. ఇందులో వున్న 33 వ్యాసాలలో వసుచరిత్ర, షేక్స్‌పియర్, ఆధునిక చిత్రకళ, రెండు ప్రపంచ యుద్ధాల మధ్యన వచ్చిన ఐరోపా సాహిత్యం వికాసం, హిందుస్థానీ సంగీతం. విజయ తెండూల్కర్. ఇలా తనకు నచ్చి, తనను, ప్రభావితం చేసిన అనేక విషయాలను ఆయన స్పృశించారు. అయితే పెద్ద పెద్ద విషయాలను చాలా క్లుప్తంగా చెప్పారు. వ్యాస విస్తృతి మరింత ఉంటే బాగుండేదనిపిస్తుంది.

✥ **గురవాయణం :** తన పేరుమీద, తనమీద జోక్‌లు వేసుకునే చమత్కారి, సదా హాస్యప్రియుడైన గురవారెడ్డి రచన. తెలుగులో హాస్య రచనలు అకారణంగా తగ్గిపోతున్న (ఎందుకో?) గీష్మం లాంటి ప్రస్తుత సాహిత్య రుతువుల్లో ఇదొక మధుమాసం. ఈ కాలమ్‌లో సొంత దబ్బాలున్నాయి, గొడవలున్నాయి, రుచులున్నాయి, అభిరుచులున్నాయి. గురకలు, గాండ్రింపులు, ఓండ్రింపులున్నాయి అంటూ భార్గవి ఆప్త వాక్యంలోని చురకలూ ఉన్నాయి.

✥ **గుండ్లకమ్మ తీరాన :** 'పండుటాకు' కథా సంకలనం తరువాత చాలా కాలానికి దయానంద్ తీసుకు వచ్చిన కథా సంకలనం. ఇవన్నీ మనిషి కథ. నేల కథ. అటకెక్కిన కాడిమానులు. కర్రులు, ఎద్దుల గంటలతో ఒక వ్యవసాయ పండుగను కళ్ళముందుంచే ప్రయత్నం చేశారు రచయిత. కొందరి జీవితాల్లో దుఃఖం పాళ్లు ఎక్కువ వుండవచ్చు. అంతమాత్రాన కథలను విషాదాంతం చేయవలసిన అవసరము లేదు.

✥ **ముకుందమాల :** కేరళలోని చేర రాజవంశానికి చెందిన కులశేఖరుడు విష్ణుభక్తుడైన ఆళ్వారు. వారి సంస్కృత రచన ముకుందమాల. దానిని బాల్యంనుంచీ తమ అమ్మమ్మ ద్వారా వింటూ వచ్చి ప్రభావితులైన గణితాచార్యులు సముద్రాల వెంకటకృష్ణగారు. సంస్కృతం నుంచి దీనిని ముందుగా ఇంగ్లీషులోనికి అనువదించి, అది పాపులర్ కావటంతో తెలుగులో వాఖ్యానం రచించారు. ఇవి మొత్తం 42 శ్లోకాలు. వీటిని వివిధ స్థాయిలోని వారు సులువుగా అర్థం చేసుకోడానికి వీలుగా భగవద్గీత నుంచి శ్లోకాలను, దేవులపల్లి వారి సినిమా గీతాలనూ ఉటంకిస్తూ అనేక అంశాలను విశ్లేషించారు. అద్వైతమతంలో నున్న కొన్ని తప్పుటర్థాలను ఎండగట్టారు. అష్టాక్షర స్మరణలో 'ఓమ్' ఉచ్చారణ వైశ్య, శూద్రులకు నిషిద్ధమనే వెర్రి ఆలోచన అహేతుకమని తెలుపుతూ విశిష్టాద్వైతములో వర్ణ వివక్ష లేనపుడు ఈవాదన కుమతీరోదనమే కదా అంటారు రచయిత. పురాణ రచనలను ఆధునిక దృష్టితో గమనించారు రచయిత. కులశేఖరుని 'పద్మ'రాగాలకు వెంకటకృష్ణ ఒక ఆత్మీయతను అద్దారు.

✥ **పణి విపణి :** రచయిత మచిలీపట్నం నివాసయిన నళినీ కుమార్. రచయిత శ్రీశ్రీ 'మహాప్రస్థానాని'కి తొలి ముద్రాపకుడయినప్పటికీ ఈ రచనలో ఎక్కడా ఆ ధోరణి కనిపించదు, వినిపించదు. ఇది ఆరు అశ్వాసములతో కూడిన 475 కవితల సంపుటి. ఇవి సులభ గ్రాంధిక భాషలో మాత్రా చంధస్సులో సాగిన స్వీయచింతనా కావ్యం. ఇందులో రచయిత యొక్క జీవిత తాత్వికత, ప్రాచ్య, ప్రాశ్చాత్య సాహితీ గాధ పరిచయం సొంత గొంతులో, సొంత రాగంగా ఆలపించబడింది. ప్రాచీన,

నవీన కవితారీతుల మధ్య సౌష్ఠవమైన వంతెనగా నిలచే రచనయిది.

✤ **తెలుగులో మాట్లాడుకుందాం :** రచయిత తిరుమల శ్రీనివాసాచార్య. మనం తెలుగువారము, మనది తెలుగుభాష. 'ఈ అమరవాణిని నిలుపుకుందాం' అంటూ రచయిత చేసిన అందమైన రాగాలాపన రుబాయితులు. "వ్రాతలో ముత్యాల అందం, పాడితే సంగీత గంధం, తేనె సోనలు జాలువారే తెలుగు భాష'' అంటూ తెలుగు భాషా ఔన్నత్యాన్ని పునరుద్ధరించడానికి చేసిన ప్రయత్న మీ రచన. తెలుగులో సరైన పదాలు లేనట్లు, ఇంగ్లీషు భాషను అవసరానికి మించి అరువు తెచ్చుకుంటున్న టి.వి. కార్యక్రమాలకు సరైన ప్రత్యమ్నాయాలను రచయిత ఇందులో సూచించారు (గెస్ట్ అవర్‌ను, అతిథి దేవోభవగా శీర్షికను మార్చుకుందామంటూ). అంతేకాకుండా తెలుగు పదాల ఉచ్ఛరణలో వినిపిస్తున్న అపస్వరాలు, వికృత రూపాలు, సంకర సమాసాలపై కూడా రచయిత తన నిరశనను వ్యక్తపరచారు.

వెలుగు ప్రస్థానాలు చూపే తెలుగులో మాట్లాడుకుందాం అన్న రచయితతో ఏకీభవించని తెలుగు వాడుంటాడా? తెలుగు వారందరూ కొని చదవదగ్గ పుస్తకమిది.

✤ **సజల నయనాల కోసం :** *రచయిత ఎలనాగ (సురేంద్ర)*: మనసులో మధుర భావావేశంగా కదలగా చిక్కని కవిత్వాన్ని అందించారు రచయిత. పోజిటీవ్ ఔట్‌లుక్ ఈ రచన లన్నిటిలోనూ కానవస్తుంది. 'ఏ ఇద్దరి మధ్యనయినా ఎండుగడ్డి వేస్తే అది పచ్చగడ్డిగా మారే పచ్చని స్వప్నం నా రథానికి ధ్వజ'మని చెప్పుకున్నాడు రచయిత. 'ప్రవాస జీవిత'మనే రచనలో తలను నిమరలేనంత దూరంలో ఉంటూ ఆత్మీయ స్పర్శకై తహతహ లాడే ప్రేమస్పందనలను రచయిత హృద్యంగా చిత్రించుకున్నాడు. ప్రతి రచన వెనకా ఆర్ద్రత, స్పష్టత ఉన్నాయి.

✤ **ఉదయిస్తున్న భూమి, అస్తమిస్తున్న చంద్రుడు : రచయిత టి.వీ. భాస్కరాచార్య** – రచయిత దీనిని శబ్ద చిత్రాల వినూత్న ప్రయోగంగా వ్రాసిన కాలీన కావ్యంగా పేర్కొన్నారు. అందమైన పదచిత్రాలు ఒక అల్లిక జిగిబిగి లాంటి ఈ రచన మనలను అలరిస్తుంది.

✤ **మొర్సింగ్ మీద మాల్కౌంస్ రాగం :** రచయిత పరిచయంలో ఆయనకు శాస్త్రీయ సంగీతంలో ముఖ్యంగా హిందుస్థానీ అంటే పిచ్చి ఇష్టమని పేర్కొన్నారు. 'మొర్సింగ్' కర్నాటక సంగీతంలో నాలుక సాయంతో వాయించే ఒక విలక్షణమైన శబ్దాన్నిచ్చే సంగీత వాయిద్యం. మాల్కౌంస్ హిందుస్థానీ రాగం. ఈ రెండింటి కలయకతో ఏర్పడే ఒక హార్మనీగా ఈ రచనలను చేశారు. ఇదొక ప్రయోగాత్మకమైన గేయరచన. వర్తమాన జీవనంలో మంచి చెడులపై చేసిన సద్విమర్శగా ఈ రచనలు తమ ప్రయోగ శీలతను విజయవంతంగా నిలబెట్టుకున్నాయని చెప్పవచ్చు.

✤ **ఆనాటి గాథలు** : సంస్కృత భాషను ఇష్టంగా చదివి అందులో ప్రాజ్ఞత సాధించిన పాలంకి సత్య దీని రచయిత. సంస్కృత శ్లోకాల ఆధారంగా ఒక నాటి సామాజిక జీవనాన్ని రచయిత మనకు పరిచయం చేస్తూ వాటిని ఆధునిక కాలానికి సహితం నప్పే విధంగా విశ్లేషించారు. కె.వి. భీమారావు గారి ముఖచిత్రం రమ్యంగా ఉంది.

✤ **వెన్నెల్లో వేణుగానం**: రచయిత్రి ఆదూరి సత్యవతీ దేవి వ్రాసిన లలిత, భక్తి, దేశభక్తి, బాలల గీతాల సంపుటి. ఇందులో నున్న రెండు సంగీత నృత్య రూపకాలు ఆమె సాహితీ సౌరభానికి అద్దంపడతాయి. చక్కటి లయతో సాగిపోయే రచనలివి.

✤ **అభినయ భరతా చార్య :** డాక్టర్ చాట్ల శ్రీరాములు. ఇవి కందిమళ్ల సాంబశివరావు ఆరుపదుల నాటకరంగ చరిత్రతో మమైక్యమైన 'చాట్ల' గారి పై వ్రాసిన జీవిత చరిత్ర. నటునిగా, దర్శకునిగా ఆచార్యునిగా నాటకరంగానికి త్రిముఖ బ్రహ్మగా రూపొందిన విజ్ఞాన బాండాగారం చాట్ల. నాటక, సినీ రంగంలో ఎందరో నటులకు దిశ, నిర్దేశం కల్పించిన ఈ నటయోగిపై మరింత విస్తృతంగా విశ్లేషణ జరిపి ఉంటే బాగుండుననిపిస్తుంది. నాటక కళపై అభిమానమున్న వారంతా తప్పక చదవవలసిన పుస్తకం.

✤ **చైతన్య వసంతం :** 'సిరిసిల్ల'గా మారిన గఫూర్ శిక్షక్ కవితాసంపుటి 'చైతన్య వసంతం.' కవిత్వం జీవధారయని, నిత్య సంఘర్షణల చైతన్యమే ఈ 'వసంతం.' కవితలనిపించినా, గఫూర్ హెచ్చరికలను ఉపేక్షించలేము.

**'నీ అకృత్యాల... చీకటి నడుగు'**
**'నువు పోసిన కలుషిత నీరు'**
**'నిను చుట్టి ముట్టి... తస్మాత్ జాగ్రత్త'**

అంటూ తర్జనీతో చైతన్యపరచే ఈ కవితా సంపుటి రచయిత లోని 'జవం జీవం నిజం ఒకటేనని' తన ఉనికి చాటుకుంటాయి... మి

# ప్రార్థన!

"ఒక రోజున నేను వేదుల సత్యనారాయణశాస్త్రి గదికి వెళ్ళాను. శాస్త్రి ఒంటరిగా కూర్చుని ఎందుకో తీవ్రంగా ప్రార్థన చేస్తున్నాడు. నేను వెళ్ళినా మాట్లాడలేదు. కళ్లు కూడా తెరవలేదు. అతని ప్రార్థన పూర్తి అయ్యే పర్యంతం నేను అలాగే కూర్చున్నాను. పది నిమిషాలైన తరువాత కళ్లు నలుపుకుంటూ సమాధిలో నుంచి లేచాడు. "శాస్త్రీ! ఏమిటయ్యా! అంత తీవ్రంగా ప్రార్థన చేస్తున్నావూ?" అని అడిగాను.

శాస్త్రి సాధారణంగా నవ్వుతూ మాట్లాడేవాడు. కాని ఆ సమయంలో ఆయన సీరియస్‌గా "నరసింహారావూ! నేను ఈ విశాల ప్రపంచంలో ఏకాకిని. ఇల్లు వాకిలీ లేదు. ఏ గృహస్తు పంచనో ఇల్లా పడి ఉంటాను. భార్యలేదు. బిడ్డలు లేరు. ప్రపంచంతో నాకేవిధమైన సంబంధం లేదు. కాని నా కొక్క కోరికుంది. దాని ఫలసిద్ధికై ప్రార్థన చేస్తున్నాను" అన్నాడు.

"పెండ్లి అయ్యేట్టు చేయమనా?"

"కాదు"

"ఏ లాటరీలోనైనా డబ్బు వచ్చేటట్లు చేయమనా?"

"కాదు"

"మరేమిటి శాస్త్రీ నీ కోరిక?" అని గట్టిగా అడిగాను. "మనం కోరితే మటుకు, భగవంతుడు ఐశ్వర్యము చటుక్కున ఇచ్చేస్తాడా? కోరుకున్నంత మాత్రాన ఒక లక్ష రూపాయలు ఇచ్చేటట్లయితే అంతా కోరుకుంటారు. అటువంటి గొంతెమ్మ కోరికలు నాకేమీ లేవు. పూర్వజన్మ సుకృతాన్ని బట్టి వస్తుంది ఈ జన్మలో ఏదైనా" అని వేదాంత ఫక్కీలో మొదలుపెట్టాడు.

నేనన్నానూ - "ఈ వేదాంతం కట్టిపెట్టి, అసలు విషయం ఏమిటో చెప్పు. ఇప్పుడు నీకు కలిగిన బాధేమిటి?" అనీ.

'ఇదంతా ఎందుకు, నా ప్రార్థన వినవోయ్' అని అంటూ మళ్ళీ కూర్చుని కృష్ణుని విగ్రహానికి నమస్కరిస్తూ,

"ఓ భగవంతుడా, యే దీనబంధు, దయాసింధు, తండ్రీ! నాకు ధనధాన్యాదులు వద్దు. దారాపుత్రాదులు వద్దు. ఇల్లు వద్దు, వాకిలి వద్దు, కవితాశక్తి వద్దూ, గడ్డలూ వద్దు, ఏమీ వద్దు మహాప్రభూ! నాకు ఒక్కటే కోరిక ఉంది తండ్రి ఆ ఒక్క కోరికా మన్నించు మహాప్రభు" అని అక్కడాగాడు.

ఒక్క క్షణం ఆగి, మళ్లా క్రైస్తవులు ప్రార్థన చేసే ఫక్కీలో "దీనబంధూ, ఓ ఆకాశమందున్న తండ్రీ, నాకు ఏ రోజు విరోచనం... ఆ... రోజున... అగులాగున... వరము ప్రసాదింపుము... తండ్రీ... పరలోకమందున్న ... నీ రాజ్యము... ఇక్కడ... ఉండుగాక... ఆమెన్..." అని పూర్తిచేసి కళ్ళు తెరిచాడు.

శాస్త్రి ఆ రోజులలో మలబద్ధకంతో బాధపడుతూ ఉండేవాడు. ఎవరైనా స్నేహితుడు కనబడితే ప్రశ్నలడిగే తీరు - "ఏం బ్రదర్ రోజూ సుఖవిరోచనం అవుతుందా" అని. దాని తరువాత అతనికి వివాహమూ అయింది, ఆ బాధా పోయింది. ఇప్పుడు సంతానవంతుడై కులాసాగా ఉన్నాడు.

కాని కొత్త బాధలు తప్పవుకదా - ప్రార్థన జరుగుతూనే ఉంది!

**- మునిమాణిక్యం నరసింహారావు**

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు**

| | | | ₹ |
|---|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు | " " | 200.00 |
| 5 | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 6. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 60.00 |
| 7. | అమోహ | " " | 60.00 |
| 8. | అంతర్వీక్షణం | " " | 50.00 |
| 9. | సిద్ధార్థ | " " | 50.00 |
| 10 | నాలో నేను | " " | 30.00 |
| 11. | కథాంజలి-1 | ఎస్సారె | 80.00 |
| 12. | కథాంజలి-2 | " " | 110.00 |
| 13. | THE THUNDERCLOUD | S.R.A. | 120.00 |
| 14. | భట్టిప్రోలు కథలు | డా. నక్కా విజయరామరాజు | 150.00 |
| 15. | రెండు దశాబ్దాలు - కథ 1990-2009 | కథా సాహితి | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన - *మరుపూరు కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన - *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన - *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన - *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం - *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | బౌద్ధ ధర్మ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 2. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 3. | మిళిందపన్హ : ఉపమలు - *బోధ చైతన్య* | 75.00 |
| 4. | మహా పరిత్తం - *బోధ చైతన్య* | 100.00 |
| 5. | జాతక కథలు - *శివశంకర స్వామి* | 60.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? - వాగరి | 40.00 |
| 2. | సిద్ధనాగార్జునుని రసేంద్రమంగళం - సం: కుర్రా జితేంద్రబాబు | 90.00 |
| 3. | తెలంగాణాలో ఇనుము, ఉక్కు పరిశ్రమ - డా.ఎస్. జైకిషన్ | 70.00 |
| 4. | శ్రీకృష్ణదేవరాయల తెలుగు శాసనాలు - సం: శివనాగిరెడ్డి, సూర్యకుమార్, జితేంద్రబాబు | 90.00 |

మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in ; Visit us at : www.misimi-monthly.com

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹200/- తో పాటు పంపండి. బయటి చెక్కులకు అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ........................................................................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ........................................................................................

వీథి ........................................................................................

పేట ........................................................................................

ఊరు ........................................................................................

పిన్ ........................................................................................

సెల్ ........................................................................................

**3. సంతకం :** ........................................................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com



నాగస్వరం (కాపురాజయ్య)

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2009-11



ఏంజిలికా కాఫ్‌మన్ (స్వీయచిత్రం)